

ఆంధ్ర సచిత్ర వార పత్రిక
29-12-78
75 పైసలు

— లోకం పోకడ * బొమ్మన్ —



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938 – 1972]
శుక్రవారం : 29-12-'78
కాళయుక్తినామ సం. మార్గశిర బ. అమావాస్య
సంపుటము 72 : సంచిక 16
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

పోస్టులో ఏడాది చందా రు. 41-60
ఆరు మాసాల చందా రు. 20-80
విడి ప్రతి వెల 75 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

అట్టమీద బొమ్మ :


'కరుణామయుడు'లో విజయచందర్

కథలు :

సీరియల్ కథలు :

వ్యాసాలు, శీర్షికలు :

హార్లిక్స్



ఆరోజుకు ఆరోజు రోగనివారణ శక్తిని పెంచి ఆరోగ్యాన్ని కాపాడే పౌష్టికాహారం.

హార్లిక్స్ నిత్యం సేవించినట్లయితే, మీ కుటుంబానికి రోగాలు రాకుండా తట్టుకునే శక్తి పెరుగుతుంది. వారికి సంపూర్ణమయిన ఆరోగ్యం చేకూరుతుంది. ఆరోగ్యం మహాభాగ్యం.

హార్లిక్స్, ప్రపంచం అంతటా డాక్టర్లు సిఫార్సు చేసేది ఇది ఒక్కటే, మీకు అత్యధికంగా పుష్టి ఇచ్చేది ఇది ఒక్కటే ఎందుచేతనంటే ఇందులోను సంపన్నమయిన స్వచ్ఛమయిన పదార్థాలు, అపూర్వమయిన హార్లిక్స్ పద్ధతి ప్రకారం సమ్మిళితమైనాయి. దీనివల్ల వీటి సహజ సద్గుణాలు నష్టంకావు. అవి సులువుగా జీర్ణం అవుతాయి.

అందువల్లనే సుచిత్ర హార్లిక్స్‌ని తన కుటుంబ జీవితంలో భాగంగా చేసుకుంది.

సుచిత్ర మోస్తరుగానే మీరుకూడా మీకుటుంబానికి ప్రతిరోజ హార్లిక్స్ ఇవ్వండి వారు ఆరోగ్యంగా, బలంగా పెరగడం మీకు కనబడుతుంది.

"హార్లిక్స్ ప్రధానమయిన పుష్టి సాధనం. మీకుటుంబంలోనివారికి వ్యాధులు రాకుండా తట్టుకునే శక్తి పెరిగేందుకూ వారు ఆరోజుకారోజు ఆరోగ్యంగా, చురుగ్గా ఉండేందుకూ నేను హార్లిక్స్‌ను సిఫారుసు చేస్తున్నాను"



హార్లిక్స్ మంచి పుష్టికరమైనది

హార్లిక్స్ రిజిష్టర్డ్ ట్రేడ్ మార్క్.



ముఖచిత్రం

అక్కినేని నాగేశ్వరరావు ముఖచిత్రంతో వెలువడిన 1-12-78 నాటి పత్రిక చాల ఆకర్షణీయంగా వున్నది. "ఓ ఇంటి కథ" కథ చాలా బాగుంది.

వీరాకృష్ణ. [పాలమూరు.]

* * *

ఆంధ్రుల అభిమాన ఎవర్‌గ్రీన్ నటులు శ్రీ నాగేశ్వరరావు ముఖచిత్రంతో 1-12-78 నాటి పత్రిక చాలా ఆకర్షణీయంగా వుంది. కథలలో "ఓ యింటి కథ" అందించిన రచయిత్రికి నా అభినందనలు. "ధర్మపథం" ద్వారా మంచి విషయాలు అందిస్తున్నారు. రచయిత చిరునామా తెలుపగలరు. ఎప్పుడూ క్రొత్తవిషయాలు, సమాచారం అందించే "జి.వి.జి., జనప్రియ" ఎందుకో యీ సారి వెనుకబడ్డారు. ఈ వారం సినిమా విశేషాలు ఏమంత చెప్పుకో దగ్గవిగా లేవు. పాత విషయాలే

పోలవరపు వెంకటరమణ. [సికింద్రాబాద్.]

వెంకట్ అవార్డు కార్టూన్ల పోటీ

యువ కార్టూనిస్టు, చిత్రకారుడు కీ.శే. "వెంకట్" (ఎ.వి.ఎల్.ఎస్. ప్రసాద్) జ్ఞాపకార్థం "వెంకట్ అవార్డు"ల బహూకరణకై సితా కార్టూన్ పోటీ నిర్వహించి అత్యుత్తమమైనదిగా ఎన్నిక చేయబడిన కార్టూనుకు రెండువందల రూపాయలు, ఆ తరువాత ఉత్తమ కార్టూన్లుగా ఎన్నుకొనబడిన రెండు కార్టూన్లకు ఒక్కొక్క దానికి వందరూపాయల చొప్పున మొత్తం మూడు నగదు అవార్డులు ఇవ్వటానికి "వెంకట్" అప్తులు, అభిమానులు నిశ్చయించారు. ఈ సంవత్సరం ఈ పోటీకి ఎంట్రీలు స్వీకరించటానికి చివరిరోజు 1978 డిశంబరు 20వ తేదీ. ఎంట్రీలను "కన్వీనరు, వెంకట్ అవార్డు కార్టూన్ల పోటీ, వివేక్‌నగర్, చిక్కడపల్లి, హైదరాబాదు-500020." చిరునామాకు పంపించాలి.

అ. జనార్దనరావు, [సాధన సమితి హైదరాబాదు-20]

కలం పేరు

ఈ వారం శ్రీరామరక్షలో నాగేశ్వరరావుగారి ముఖచిత్రంతో పత్రిక మా కనుల ముందు నిలిచింది. శ్రీనివాస్‌గారి కార్టూన్ చాలా బాగుంది. మీ పత్రికకు చాలా కథలు పంపించాను అన్నీ తిరిగి వచ్చేస్తున్నాయి. నా కథలు అంతబాగుంటాయని నేనన లేనుగాని, ఒక సందేహం; ఒక ఆడదాని పేరు కలంపేరుగా పెట్టుకుని పంపించమంటారా మీరు ఎన్నిసార్లు త్రిప్పి పంపినా, నేను విసుగుచెందక వ్రాస్తూనే ఉంటాను. ఎందుకో తెలుసా? నేను ఒక నిరుద్యోగిని.

మా అభిమానతారలు శారద, మాధవి ముఖచిత్రాలతో అందించమని మీ పత్రిక చదివిన నేను కోరుకుంటా.

కోట వెంకటరమణ. [బరంపురం.]

మనలో మాట

అందరికీ మా క్రిస్మస్ శుభాకాంక్షలు!

దీపావళి కథల పోటీకి వచ్చిన కథలలో మామూలు ప్రచురణకు ఎన్నుకున్న కథల ప్రచురణ విషయం ఆయా రచయితలకు తెలియజేశాము... "ఆమోదం" అందని కథకులు తమ కథలను యితర పత్రికలకు పంపుకోవచ్చును. ఈ విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలకి తావులేదు కనుక- రిప్లయి కార్డులు వ్రాయవద్దని మనవి చేస్తున్నాము.

దీపావళి కథలపై బ్యాలట్ ఫలితాలు, వ్యాసరచన పోటీ ఫలితాలు కూడా త్వరలోనే ప్రకటిస్తాము.

కథలు

24-11-78వ తేదీ వారపత్రిక ముఖచిత్రం అంత ఆకర్షణీయంగా లేకున్నా, "రత్నదీప"గారు రచించిన "అర్చనా! అర్చనా" కథ పత్రికకే హైలైట్. మొదట కథ చదువుతున్నంతసేపూ అర్చనమీద ఎంత కోపము వచ్చిందో. కథ ముగింపులో అర్చనపై అంతకంటె ఎక్కువ జాలికలిగింది.

యస్.యల్. కె. మోహన్. [వెదుళ్ళపల్లి.]

* * *

24-11-78 నాటి మా అభిమాన "ఆంధ్ర సచిత్ర వారపత్రిక"లో 'రత్నదీప'గారి "అర్చనా! అర్చనా!" యను కథానికను చదివాము.

కథ చాలా చాలా బాగుంది. కాని రచయిత్రి ఈ కథలో కుష్టువ్యాధి భయంకర అంటువ్యాధిగా పేర్కొన్నారు. రచయిత్రికి, కుష్టురోగం అంటు వ్యాధి కాదని తెలుపుటకు చింతిస్తున్నాము.

చిన్నతంబి, మోహన్‌ప్రసాద్, నారాయణమూర్తి, దేవానంద్ సరోజాశంకర్ రెడ్డి. [బరంపురం]

(50వ పేజీ చూడండి)

జి. శ. — మద్రాసు

రె.రా. గారూ మీ జవాబులు నాకు చాలా నచ్చుతాయి. మరి మీ మీద కొంతమంది ఈర్ష్యగామాట్లాడుతారు. వారిపై మీ అభిప్రాయం?

★ ఈర్ష్యకూడా ఓ రకం పొగడ్తే. ఇందిరా మనం సాధారణంగా ఎవరినిచూసి ఈర్ష్యపడతాం?—మనకి లేనివి ఉన్నవాళ్ళనుచూసి; మనం సాధించలేనిది సాధించిన వాళ్ళను చూసికదా. దానిఅర్థం ఏమిటి? మనం వారికంటే మెరుగనే కద!

డి. ఎల్. ఆర్. - అయిజ

మీరు సినిమాలు ఎక్కువగా చూస్తారా? లేదా?

★ పూర్వం చాలా తక్కువ చూసేదాన్ని. ఇప్పుడు అధికస్య అధికం ఫలం అన్నట్టు చూస్తున్నాను.

కె. వి. కె. — జడ్చర్ల

మీరు స్త్రీలు వేసే ప్రశ్నలకు "సౌమ్యం"గానూ, పురుషులు వేసే ప్రశ్నలకు వ్యంగ్యంగానూ సమాధానాలు ఇస్తారు ఎందువల్ల?

★ సౌమ్యంగానూ, వ్యంగ్యంగానూ — కనిపించడం—అ చూసే వాళ్ళని పట్టి వుంటుంది.

ఐ. ఎస్. ఆర్. రాజమండ్రి

మా కాలేజి అమ్మాయిలకు హీరోగా కనిపించాలంటే ఏం చెయ్యాలి?

★ సగంపేరు కలిసొచ్చింది కద ఐ.ఎస్.ఆర్. అయిపోతే సరి!

యు. ము. — నిమ్మగనూరు

ఏదైనా ఒకపని చేస్తాను, అదితప్పని నాకు తెలుసు. అయినా నేనాపని చేస్తాను. ఇది నాలోని బలహీనత అంటారా?

★ చిన్నప్పుడు మీ తల్లిగారు తప్పుపని చేసినప్పుడు నాలుగుతన్ని బుద్ధి చెప్పివుంటే పెద్దయ్యాక యిలాంటి మూర్ఖపు బుద్ధులురావు!

ప్రశ్నావళి

రామలక్ష్మి

టి. వి. ఎస్. టి. వి. వి. — అండలూరు

వైఫ్ యీజ్ నైఫ్ టు కట్ యువర్ లైఫ్. కామెంట్ ప్లీజ్.

★ బెటర్ టు కట్ యువర్ లైఫ్ విత్ ఎ నైఫ్ దేన్ ఎ వైఫ్!

బి. ఆర్. — చిత్తూరు

మీరే ప్రశ్నావళికి జవాబులిస్తున్నారే మీకు రిటైర్‌మెంటు లేదా?

★ జర్నలిస్టు వచ్చి రిటైరవుతారు. కామమిస్తు పీకేస్తే రిటైరవుతారు. ఇంకా రెండూ జరగలేదు నాకు!

జి. జి. ఆర్. — ఖర్గపూరు

ప్రతి ఏసుక్రీస్తు సందేశాల వెనుకా "ఆమెన్" అనే పదాన్ని వాడుతారు. దాని అర్థమేమిటి?

★ మహాప్రభో—పూర్తిగా వినవేనా వినాలి చదవవేనా చదవాలి, అడగవేనా అడగాలి పక్కవాళ్ళని. క్రీస్తు సందేశాల వెనుక రాసేది ఆమెకాదు—"ఆమెన్" అంటే తథాస్తు అని. అలాగే జరుగుగాక అని.

పి. ఎస్. బి. — హైదరాబాదు

మిమ్మల్ని సమర్థించే గాంగ్‌ని తీసుకుని ఏ హిమాలయాల్లోనో శుభ్రంగా ఆశ్రమం ఏర్పరచుకొని—అక్కడ హితబోధలు చేస్తూ కూర్చుంటే...

★ నో. నో. ఐ బిలీవ్ ఇన్ సిటీస్!

బి. కె. వి. — విశాఖపట్నం

64 కళలలో మీరు నిర్వహిస్తున్న ఈ తిక్క జవాబులని ఏ కళ అంటారు?

★ తిక్క కళ!

ఎ. బి. ఆర్. — మామిడిపల్లి.

మీకు కుల మతాల పట్టింపులు ఎంతవరకు వున్నాయి?

★ నేను ఎవరినీ కులం అడగను. అడిగితే చెప్పడం సభ్యత కనుక చెప్తాను. అంతే.

ఎస్. ఎస్. — జనగామ

ప్రజలకు మార్గ దర్శకులు కావలసినవాళ్ళు కామే దౌర్జన్యాలు చేస్తూంటే ప్రజల గతి?

★ అధోగతే! ప్రజాస్వామ్యంలో ఉన్న పెద్ద లిటిగేషన్ అదే—ప్రజలే ఎన్నుకున్న వినాయకులు వారు—అంచేత నోరు మూసుకోవాలి—ఓటు విలువ తెలియని వాళ్ళు.

బి. వి. ఆర్. — ఏలూరు


ఆడవారిని మీరు సమర్థిస్తారని తెలిసి కూడా అదే ప్రశ్నలు వేస్తారు ఎందుకు?

★ మనసుమార్చుకున్నానేమో యీలోగానని!

సి. వి. కె. ఆర్. — మచిలీపట్నం

భార్యాభర్తల మధ్య ఎప్పుడూ కలతలు రాకుండ వుండాలంటే ఏం చేయాలి?

★ ఎప్పుడూ "కలతలురాని" భార్యాభర్తలుంటూ వుంటారనుకోడం పొరపాటు. అక్కర్లేదు కూడా. విభిన్న వ్యక్తులిద్దరు కలసి బ్రతకడంలో—ఘర్షణ తప్పదు. పేచీ పడ్డం తప్పుకాదు. దేనికిపడుతున్నారన్నదిముఖ్యం. ఉదా: మల్లెపూలు తెల్లచీరా తెలుగు సినిమాల గురించి కావలసినంత ఘర్షణ పడండి. కాని, ఎంతమంది పిల్లలు ఆదాయం ఎలా ఖర్చుచేయాలి—లాంటివిషయాల్లో ఏకం కండి. అదీ సూత్రం.



సీరియల్

గవర్నెస్ కరుణ

గంటి వెంకటరమణ

పది రోజులు గడిచేసరికి యింట్లో చైతన్యం వచ్చింది. రవికీ కరుణకీ మధ్య స్నేహం బలపడింది. ఇన్నాళ్ళకి కరుణ జీవితానికి ఓ స్నేహితుడు దొరికాడు. ఓ సాయంత్రంపూట కరుణ అతనితో అంది 'నేను ఓసారి మా డాడీతో ఈ వూరు వచ్చాను. అప్పుడు నేను ఏమీ చూడలేక పోయాను. నువ్వు వానపల్లి, నఖినేటిపల్లి ద్రాక్షారం, యివన్నీ చూపించవా. ఇంటి దగ్గర వుండి వుండి బోర్ అనిపిస్తోంది!'

రవి బుర్ర వూపి చిన్నగా నవ్వాడు. కరుణ ఈ విషయం అడిగిన పది నిమిషాలకి అతను తల్లి దగ్గరకి వెళ్ళి ఈ సంగతి చెప్పాడు. కాళి చేస్తున్న పని ఆపి కొడుకు మొహంలోకి ఓసారి చూసి 'నీ యిష్టం' అంది.

'నువ్వు వూఁ అను అమ్మా. నువ్వు యిష్టపడి వెళ్ళమంటే అలాగే వెడతాను. కానీ...' రవి మధ్యలో ఆపేశాడు మాటల్ని.

కాళి తల దించుకుని 'వెళ్ళిరండి' అంది.

'ఇవాళ కాదు, రేపు' అన్నాడు.

కాళి ఆ రాత్రి భోజనాలు వడ్డిస్తూ కరుణ వైపు అప్పుడప్పుడు చూస్తూ తిరిగి పనిలో మునిగిపోయింది. ఆ మర్నాడు ప్రొద్దున్నే స్నానం చేశాక అమలాపురం వెయ్యేరు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం చూపించేందుకు తీసుకు వెళ్ళాడు.

'వెయ్యేరా?' కరుణ అమలాపురంలో అంది! 'మా డాడీ చెప్పలేదే.'

'ఆయనకి మూఢ నమ్మకాలు లేవు. మిలిట్రీ మనిషి కదా నేను పదహారణాలా అర్ నూరు నయాపైసలా ఆస్తికుడిని నాకు దేవుడంటే నమ్మకం వుంది.'

'డాడీకి కూడా నమ్మకం వుంది రవీ.'

'ఆ నమ్మకం వేరు కరుణా. నా నమ్మకం ప్రతి రాయినీ దేవుడని పూజిస్తే ఆ రాయే

(గత సంచిక తరువాయి)

కొన్నాళ్ళకి వరాలిచ్చే దేవుడు అవుతాడు'

కరుణ పక పకా నవ్వింది. నోటి దగ్గర చేయిని అడ్డం వుంచుకుంది. ఆ చేతిని అతి నెమ్మదిగా తీసేసుకుని: 'సారీ రవీ. నువ్వు యింజనీర్వి. ప్రతి రాయీ దేవుడు అని బ్రిడ్జి కట్టడానికి ప్రారంభోత్సవం చేస్తే కొన్నాళ్ళకి చేతనత్వం వచ్చి రాయి కదిలి పోతుంది. అప్పుడు నీ దేవుడు ఆదుకోలేడు ఎవర్నీ.'

'నువ్వు మిలిట్రీ మనిషి కూతురవని పించుకున్నావు. పద పద' బస్సు దిగాక ఆలయం వైపు దారితీశాడు. ఎక్కడో అమలాపురానికి చాలా దూరంలో వున్న వెయ్యేరులో వున్న సామివారు అన్ని చోట్లా కనిపించే శ్రీనివాసుడికి భిన్నంగా ఏమీలేడు. కానీ అక్కడవున్న పాతిక ఏళ్ళ యువతి వొంటిమీదకి స్వామివారు వచ్చారు. కరుణ తెల్లబోయింది.

'మన కోరికలు దేవుడు చెబుతాడు జరిగేవీ లేనిదీ' రవి లోపలికి వెళ్ళి కళ్ళు మూసుకుని భక్తిగా నమస్కారం చేశాడు. అతని వొంతు వచ్చేందుకు చాలా సేపే పట్టింది.

జరిగినకథ: ఠాకర్ భార్గవ, మేనకల ఏకైక పుత్రిక కరుణ, తన తల్లి, మూర్తితో చనువుగా ఉండటాన్ని చూచి సహించలేక పోతుంది. ఊరి నుండి తిరిగి వచ్చిన భార్గవకు, మేనక మూర్తితో లేచిపోయిందని దర్శన్ చెప్తుంది. మేనకా వియోగంతో భార్గవ ఆత్మహత్య చేసుకోగా, అప్పుల వాళ్ళు ఆస్తినంతా కాజేయగా, దర్శన్‌తో మేనత్త 'కాళి' యింటికి వెళ్తుంది కరుణ.

ఒక్కొక్కళ్ళే వస్తున్నారు. స్వామివారి కరుణాకటాక్ష వీక్షణాల కోసం పడిగాపులు పడుతున్నారు. ఆయన చెప్పే మాటలు విని కొందరు తృప్తితో వెళిపోతే మరి కొందరు చిన్నబోయిన మొహాల్తో యిళ్ళదారి పడుతున్నారు. రవి వొంతు వచ్చింది. పాతికేళ్ళ ఆమె వచ్చని శరీరంతో పవిత్రంగా కనిపిస్తోంది. రవి వైపు ఓసారి తేరపారి చూసి 'నువ్వు కోరుకున్నది కాదు' అన్నది. రవి జాలిగా చూశాడు.

'నీ రాత అంతే' అని అతనికి బొట్టు పెట్టి పంపింది ఆమె. రవి దిగులుగా వస్తూ 'కరుణా నువ్వూ నిలుచో' అన్నాడు.

కరుణ తప్పనిసరిగా నిలుచుండిపోయింది.

ఆ యువతి కరుణ వైపు చూసి రెండు క్షణాలు మాట్లాడలేదు. చివరికి నెమ్మదిగా అంది. 'ఎన్ని కష్టాలు ఎంత పోరాటం ... యివన్నీ జరుగుతేగానీ ఒడ్డున పడవు. ఇంక వెళ్ళు.'

కరుణ బయటికి వచ్చేసింది. ఆమె మనసు ఆ మాటలకి చిన్నబోయింది. దార్లో చిన్నోసార్లు అనుకుంది. చివరికి మనసులో ఆగక రవి వైపు చూస్తూ 'యిటువంటివి వింటే చూడు మూడ్ పాడైపోయింది. నువ్వు ఒక్కడివే వెళ్ళాల్సింది. మిలిట్రీ వాళ్ళమని నువ్వు ఎగతాళి పట్టిస్తావని నేను నీ మాట విన్నాను. ఇప్పుడు నాకెంత బెంగగా వుందో తెలుసా.'

రవి మాట్లాడలేదు. అతని మనసే బాగులేదు. ఆమెకేం జవాబు చెబుతాడు? ఆలోచిస్తున్నాడు? రవి ఆమెను అటునుంచి వానపల్లి తీసుకు వెళ్ళాడు. అక్కడ పళ్ళాలమ్మకి పూలు, పళ్ళూ యిప్పించాడు. కాలువ పారుతోంది గుడి పక్కనే. అక్కడ కూర్చుంటే వేపచెట్లు, రావిచెట్లు చల్లని గాలులు మనసుని ఆహ్లాద పరుస్తున్నాయి. దూరంగా పడవమీద పాటలు పాడుతూ ఏ తీరాలకో వెడుతున్నారు. ప్రొద్దున్నుంచీ భోజనంగానీ, ఫలహారంగానీ, చేయలేదు. దారిలో ముక్కామల రేవు దగ్గర హోటల్ కనిపిస్తే 'టిఫిన్ చేద్దామా రవీ' అని అడిగింది. కానీ అతను వినిపించుకున్నట్టు లేదు. మరోసారి అడిగితే 'గుడికి వెళ్ళేప్పుడు కడుపు నింపుకుంటామా?' అని ఎదురు ప్రశ్న వేశాడు. ఆ దెబ్బతో నోరు మూసుకుంది. ఇప్పుడు కడుపులో కర కర

మంటోంది. ఎదురుగా అరటిపళ్ళు కనిపిస్తున్నాయి అతన్ని అడగాలంటే 'నామోషీ' అనిపించింది. అయినా తప్పేట్టు లేదు 'రవీ రెండు అరటిపళ్ళు కొనవా' అంది.

రవి ఈ లోకంలో లేడు. అతను నిశ్చలంగా పారే ప్రవాహం వైపు చూస్తున్నాడు. నీటిపక్షులు నీటి అంచుల వరకూ వాలి ఆకాశంలోకి ఎగిరిపోతున్నాయి. అవతలి గట్టున బారెడు పొడవున్న త్రాచు చెట్టు ఎదురుగానున్న పుట్టలోకి సన్నగా జారిపోతోంది. రాయి ఒకటి తీసుకుని నీళ్ళల్లోకి విసిరేశాడు అతను. నీళ్ళు చెల్లాచెదరు అయిపోయాయి. బల్లకట్టు మీద సైకిళ్ళు ఈ వొడ్డు నుంచి ఆ వొడ్డుకు చేరుతున్నాయి. పడవతాడు పట్టుకుని 'హైలో, హైలెస్సా' అంటూ సాగిపోతున్నారు.

'అరటిపళ్ళు కొను రవీ.'

రవి తృళ్ళిపడ్డాడు 'సారీ, కరుణా' అంటూ లేచి వెళ్ళి డజను పళ్ళు కొని తెచ్చి ఆమె చేతిలో వుంచాడు. ఆమె వాటిని అందుకుని మొత్తం తినేసింది. రవి చాలా బాధ పడ్డాడు. 'నీకింత ఆకలి అని నాకు తెలియదు కరుణా. నిన్ను నా పిచ్చి సెంటిమెంట్స్‌తో వుపోషం పెట్టాను.'

కరుణ కళ్ళు పైకెత్తి 'ఫరవాలేదు' అంది నవ్వి.

మరి కొంచెం సేపు అక్కడే వుండి యింటిదారి పట్టారు. అప్పటికే కరుణ చాలా అలసిపోయింది. ఇంటికి వస్తూనే భోజనం చేసి గదిలోకి వెళ్ళి పడుకుంది. ఆ పడుకోవడం పడుకోవడం సాయంత్రం వరకూ లేవ లేక పోయింది.

'ఏమో ఏం తెలుస్తుంది? తిండికి వసూలు చేస్తున్నట్టు డబ్బు అడుగుతే ఏం బాగుంటుంది. మా అన్నయ్య అప్పట్లో మా రవి చదువు ఆగిపోకుండా అడ్డు పడ్డాడు.'

'ఇప్పుడు యిస్తారా. పిల్ల బాగుంటుంది. డబ్బు వుంచే వుంటాడు మీ అన్నయ్య' అవతల గొంతు అంటోంది.

కాళి గట్టిగనే నిట్టూర్చింది. 'మా అన్నయ్య అంటే నాకు ప్రేమలేదని, స్వార్థపరురాలినని లోకం అంటే అందుకు నేను జవాబు చెప్పలేను కానీ అందరూ లేచిపోయినదాని కూతురు అంటూంటే యీ

అగ్నిహోత్రాన్ని కోరి కొంగున ముడి పెట్టుకోలేము కదమ్మా.'

'మీ రవి ఆ పిల్ల వెంట వెంట తిరుగుతూంటే అనుకున్నాం.'

'మేము అనుకోవడం లేదు. వాడికీ ఆ వుద్దేశ్యం వుంటుందంటే నేను నమ్మను. వాడికి భక్తి ఎక్కువ. సంధ్యావందనం చేసుకోనిదే భోజనంచేయడు. అందరూ అనుకునే యీ పిల్లని వాడు చేసుకోడు' కాళి ఖచ్చితంగా అంది.

'మీ అన్నయ్య వున్నప్పుడు అనేదానివి కదటమ్మా కాళీ' మూడో మనిషి అంటున్నది.

కాళి నిర్భయంగా జవాబు యిచ్చింది:

'నాకు వున్నవాళ్ళందరూ ఆడపిల్లలైతే వాళ్ళ పెళ్ళిళ్ళు కావద్దా.'



కేలిఫ్లవర్‌తో పకోడి

కావలసిన వస్తువులు : కేలిఫ్లవర్, శనగ పిండి, కొంచెం ఉప్పు, సోడా కారం.

తయారుచేయు విధానం : పువ్వును (కేలిఫ్లవర్) ముక్కలుగా కోసి, శుభ్రంగా కడగాలి. ఆ తరువాత ముక్కల్ని కొద్దిగా ఉడకేసి వార్చాలి. లేకుంటే పకోడి కొంచెం గట్టిగా వుంటుంది. అవసరమైనంతమేరకు శనగ పిండిని తీసుకుని, నీటిలో కాస్త చిక్కగా కలపాలి. ఇందులో తగినంత ఉప్పు, సోడా కారం వేయాలి. తర్వాత వార్చిన ముక్కల్ని, ఒక్కొక్కటిగా శనగ పిండిలో ముంచి, కళాయిలో కాగుతున్న నూనెలో వేయాలి. బాగా వేగినాక తీయవలెను. వీటినే కేలిఫ్లవర్ బజ్జీ అని కూడ అంటారు. ఇవి అరటికాయ, వంకాయ, బంగాళాదుంప బజ్జీల కంటే రుచిగా వుంటా యంటారు.



వంటలు

'కిరిసి' పాయసం

కావలసిన వస్తువులు : చిక్కని పాలు 1 లీటరు, పంచదార 150 గ్రా, మెత్తని బియ్యపు పిండి 150 గ్రా. తగినంత పరిమాణంలో ఏలకులు, జీడిపప్పు, కిస్‌మిస్.

తయారుచేయు విధానం : సగానికి తక్కువగా బియ్యపు పిండిని తీసుకుని, కొద్దిగా పాలతో కలిపి, ముద్దగా తయారు చేయవలెను. అందు చిటికెడు ఉప్పు, టేబిల్ స్పూనుతో పంచదార వేసి సన్నని సెగమీద వుంచాలి. ఇది తేనెలా పలచగా వున్నప్పుడు దించుకుని, మిగిలిన పిండి వేసి బాగా కలపాలి. తరువాత మిగిలిన పాలను వెడల్పాటి గిన్నెలో పోసి మరగబెట్టాలి. మరుగుతున్నపుడు-మొదట పాలు, పిండి కలువగా తయారైన ముద్దను కారప్పూస వత్తుకునే బల్లపై కారప్పూస వత్తుకున్నట్లుగా కాస్త కాస్త వత్తుకోవాలి. ఇలా వత్తేటప్పుడు మంటను తగ్గించడం, పెంచడం చేస్తుంటే పొంగిపోకుండా వుంటుంది. వత్తడం పూర్తయ్యేక కాసేపు ఉడకనిచ్చి దించుకోవాలి. తర్వాత పంచదార వేసి బాగా కలియబెట్టాలి. ఇదే సమయంలో ఏలకులు, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ వేస్తే మరింత రుచికరంగా వుంటుంది కిరిసి పాయసం.

—శ్రీమతి ప్రభా మల్లిబాబు

గవర్నెస్ కరుణ

కరుణ నిద్రమత్తు వదిలిపోయింది. ఒక్కసారిగా నిప్పుల వర్షం కురిసినట్లు అనిపించసాగింది. చటుక్కున లేచి కూర్చుంది. పక్కనే చూసింది. కొంగు పరుచుకుని దర్శన్ పడుకుంది. ఇప్పటి కిప్పుడు దర్శన్‌ని తీసుకుని ఏదైనా ఎరిగెత్తి పారిపోవాలని పిస్తోంది. కాళి మనసులో యిటువంటి భావం వుందని తెలియలేదు యిన్నాళ్ళూ. ఆమె మాత్రం తప్పేం అంది? కూతుళ్ళు ఎక్కువగా వుండి తక్కువ ఆదాయం వున్న యీమె స్వార్థపరురాలెందుకైంది? వివేకవంతురాలు కనుక పిల్లల భవిష్యత్ చూసుకుంటోంది. మాతృమూర్తి కనుక పిల్లల సుఖం చూసుకోవడంలో తప్పేం వుంది? కరుణ ఆవేశం చల్లారిపోయింది. మంచం మీద నీరసం వచ్చినట్లు వెనక్కి వాలిపోయింది. పైన వున్న కొబ్బరికాయల అటక చూస్తోంది కానీ మనసు మాత్రం దుర్భేధ్య భవిష్యత్‌ని చీల్చుకుంటూ పోవాలని ప్రయత్నం చేస్తోంది. కరుణ మనసు కుదుటపడడంలేదు.

మర్నాడు మధ్యాహ్నం పోస్ట్‌మన్ కాల్ లెటర్ యివ్వగానే కరుణ ఎగిరి గంతు వేసింది. సంతోషం పట్టలేక దర్శన్‌కీ, కాళికీ యీ విషయం చెప్పేందుకు వెళ్ళింది. రవి గుమ్మంలో కలిపించినా అతనిపక్క నుంచే దూసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

'ఏమిటి? ఏమిటీ హడావుడి!' అంది కాళి.

'నాకు వుద్యోగం దొరికిందత్తయ్యా' కరుణ గుమ్మంలో కూర్చుండిపోయింది.

'ఎక్కడ?' కాళి ఆతృతగా అడిగింది.

'ఢిల్లీలో.'

'ఢిల్లీలోనా? మళ్ళీ అంత దూరంలో ఒక్కదానివీ వుంటావా?' కాళికి యిప్పుడే బెంగగా వుంది.

'కాల్ లెటర్ కదా. సెలక్టవాలి అప్పుడు రావాలి' రవి నిరాశ తెప్పించాలని అన్నాడు. అతను ఎప్పుడు వచ్చాడో గమనించనే లేదు కాళి. కరుణ అసలు పట్టించుకోలేదు. దర్శన్ ఓ మూల కూర్చుని ఈ వుద్యోగం రావాలని దేవుళ్ళకి మొక్కుకుంటోంది. కరుణ లేని సమయాల్లో అందరూ ఆడుకునే గుసగుసలు భాష రాకపోయినా భావం కనిపెట్టగల్గే దర్శన్‌కి శూలాల మాదిరి గుచ్చుకుంటున్నాయి.

కరుణ కీర్తికి టెలిగ్రాం యిచ్చింది.

మరో వారం రోజులకి కరుణ పెట్టె బెడ్డింగ్‌తో బయలు దేరింది. దర్శన్ ఆమె వెనుకే వుంది. రవి రాజమండ్రి వరకూ వస్తానని బయలుదేర బోతూంటే 'వొద్దు' అని ఆపేసింది కరుణ. అయినా రవి విని పించుకోలేదు. బస్సు ఎక్కుతూ మేనత్త ఎంత వొద్దని వారించినా వినకుండా వంద రూపాయలు ఆమె చేతిలో వుంచింది. దర్శన్ కొడుకు రామ్‌లాల్ ఢిల్లీలో వుంటున్నాడు. ఆ ధైర్యంతోనే గడప బయట కాలు పెట్టింది.

'నువ్వు మా యింటి కోడలివి కావాలనుకున్నాను' కాళి ఏమనుకుందో ఏమో చటుక్కున అంది. కరుణ ఒకసారి మేనత్త మొహంలోకి చూసింది. ఆ చూపులకి అర్థం కాళి గ్రహిస్తే 'నిజంగా... నిజంగానే అంటున్నావా అత్తా. లేచిపోయిందాని కూతురు నీ కోడలు అవుతే నీ పిల్లలకి పెళ్ళి కాదు. అసలే మీరు వుండేది ఆంధ్ర దేశంలో. నీకు ముందు ముందు అగౌరవం కలగదా... ఎందుకులే అత్తా లేని పోని మాటలు. మనసులో ఒకటి పైకి మరొకటి అనడం. నేను అర్థం చేసుకోగలను' అని తెలుసుకునేది.

కరుణ చూపుల్ని తప్పించుకుంటూ దృష్టి మార్చింది. బస్సు కదిలింది! కరుణ లోకంలో మరో పాఠం చదువుకుంది. బస్సు క్షణంలో మలుపు తిరిగింది. పంటపొలాలూ కాలువా కరుణకి వీడ్కోలు చెప్పాయి. రాజమండ్రి స్టేషన్‌లో రైలు ఎక్కించే ముందు రవి చనువుగా కరుణ చేతిని అందుకున్నాడు. 'కరుణా ఐ లౌ యూ. ఐ వాంట్ టు మారీయూ!'

చిన్నగా నవ్వింది కరుణ.! ఆ కళ్ళల్లో తడి ముత్యాల మాదిరి మెరుస్తున్నాయి.

థాంక్స్ రవి. నాకుగా నేనెప్పుడూ మనసు పోగొట్టుకోలేదు. నువ్వు పెళ్ళి చేసుకోవాలనుకున్నా నాకు మాత్రం యిష్టంలేదు'.

'యిష్టంలేదూ' రవి తీవ్రంగా అడిగాడు.

కరుణ జవాబు చెప్పబోయేంతలో రైలు వేగాన్ని అందుకుంది. రవి కనుమరుగై పోయేవరకూ కరుణ చూస్తూనే వుంది. చేయి వూపుతూనే వుంది. రవికీ, కరుణకీ చెయ్యేరు వేంకటేశ్వర స్వామి మాటలు గుర్తు వస్తున్నాయి.

దర్శన్‌కి ఈ మజిలీ గమ్మత్‌గా వుంది. రెండు రోజులు సత్రంలో బస చేసిన యాత్రికుడుకి వున్న అనుభూతి మాత్రం ఆమెకు మిగిలింది.

రెండు రోజుల తరువాత ఢిల్లీ చేరుకున్నారు. టెలిగ్రాం చూసి రామ్‌లాల్ స్టేషన్‌కి వచ్చాడు. షికూర్ బస్తీలో వుండే రామ్‌లాల్ వింతగా కనిపించాడు కరుణ కళ్ళకి. తలకి పెద్ద తలపాగా చుట్టుకుని పంచ కట్టుకున్నాడు అతను. బీడీ కాలుస్తూ తల్లిని సాదరంగా తీసుకు వెళ్ళాడు. చదువుకుని ఖరీదైన బట్టల్తో సంస్కారయుతంగా వున్న కరుణని చూడగానే అతనికి ఏం మాట్లాడాలో తోచలేదు. రెండు నిమిషాలు ఆగి 'నమస్తే బహన్‌జీ' అన్నాడు. దానికి సమాధానం యిస్తూ 'నమస్తే' అంది కరుణ.

ఇంటికి చేరుకున్నాక రామ్‌లాల్ భార్య సంతోష్—పుల్కా, రాజ్‌మా చేసిపెట్టింది. యాపిల్ పళ్ళు కోసి ముందు వుంచింది. అవి తిని నిద్ర పోయింది కరుణ. చాలా రోజుల తరువాత కరుణ వుత్తర హిందూస్థానం తిండి తినడం వల్ల సుఖంగా నిద్ర పోయింది. లేచాక సంతోష్ అక్రూట్, బాదాం కొట్టి పెట్టింది. ఆ మధ్యాహ్నం గడిచి పోయింది. మర్నాడు ప్రొద్దున్న పది గంటలకి కీర్తి వచ్చాడు. అతను వస్తూ వస్తూ కరుణ సర్టిఫికెట్లు ఒరిజినల్వి, తీసుకు రాగలిగాడు.

ఆ సాయంత్రం కరోల్ బాగ్‌లో వున్న కంపెనీకి వెళ్ళింది. పదినిమిషాల్లో ఫలితాలు కూడా తెలిసిపోయాయి. కరుణ సంతోషం నిప్పు మీద నీళ్ళు చల్లినట్లు అయింది. కాళ్ళు ఈడ్చుకుంటూ ఆఫీసు బయటకి వచ్చేసింది.

ఆరాత్రి దర్శన్ పక్కన పడుకుని 'దర్శన్ భయ్యా మనల్ని పోషించగలడా. నాకు వుద్యోగం రాగానే వెళ్ళిపోదాం ఈ మాట నువ్వు చెప్పగలవా?' అని అడిగింది.

కొడుకు దగ్గరకి వచ్చాక దర్శన్‌కి చాలా సంతోషంగా వుంది. పరాయిదేశంలో పరదేశీలా బతికేకన్నా తన స్వంత వూళ్ళో తనవాళ్ళమధ్య కొట్టుకున్నా తిట్టుకున్నా ఫరవాలేదని పించింది ఆమెకు. కరుణని దగ్గరకి తీసుకుని 'ఛ! బెంగపెట్టుకోకు నీకు నేను వున్నాను. తప్పకుండా రామ్‌లాల్ పోషిస్తాడు' అంది ధైర్యం చెబుతూ. కీర్తి రెండు రోజులుండి 'బహన్‌జీ నన్ను మరిచిపోకు. నీకు ఏ అవసరం కావాలన్నా నేను వున్నాను. ఒరిజినల్ సర్టిఫికెట్ తెచ్చుకుందుకు వస్తావు కదా అప్పుడు హరేరాం కొడుకు కీర్తిని మరిచిపోకు' అన్నాడు.

కరుణ అతనికి 'థాంక్స్' చెప్పింది.

రోజులూ వారాలూ గడిచిపోతున్నాయి. కరుణ దురదృష్టం వుద్యోగం దొరకలేదు. ఆవేళ పోస్ట్‌లో వచ్చిన కవరు చూసి ముందు సంతోషించి తరువాత నిగ్రహంగా వుండిపోయింది కరుణ.

'మీ ఫొటో మాకు నచ్చింది — మీ అర్హతలు బాగున్నాయి. మేము కోరిన షరతులకు మీరు అంగీకరించి నట్లయితే మీరు మీ దర్శన్‌తో వచ్చి డ్యూటీలో జాయిన్ కావచ్చును.

—యువర్స్ ఫెయిత్‌ఫుల్లీ,

డబ్ల్యు. డూప్లే. బొంబాయి—14.

కరుణ ఆ వుత్తరం చూపించింది దర్శన్‌కి. దర్శన్ కూడా చాలా సంతోషించింది. అనుకున్నదే ఆలస్యం కాకుండా బయలుదేరారు. రామ్‌లాల్ వాళ్ళు వచ్చినందుకు సంతోషంతో వుక్కిరి బిక్కిరి కానూలేదు. వాళ్ళు వెళ్ళిపోతున్నారని దిగులుతో గోడకు ఆనుకుని కాళ్ళు చాపుకుని కూర్చోనూలేదు. మధ్య తరగతికన్నా ఓ మెట్టు క్రిందవున్న అతనూ భార్యా—అతిథుల విషయంలో అర్భకులు. తల్లిని కూడా పోషించలేనని అతనికి తెలిసిపోయింది. గప్‌చిప్‌గా వూరుకున్నాడు అతను. కరుణ మరో మజిలీ వైపు దారి తీసింది.

పార్సీకాలనీ, డాక్టర్ గంటీరోడ్‌లో వున్న మేడముందు టాక్సీని ఆపి తన దగ్గర వున్న అడ్రసుతో సరిపోల్చుకుంది కరుణ. ఆ అడ్రసే యింటి గోడమీద సిమెంట్ చేయబడిన ప్లేట్‌లూ పాలరాతితో మెరుస్తోంది. అలికిడి విని ఆల్సేషియన్ తెగ మొరగడం ప్రారంభించింది. కరుణని గట్టిగా పట్టుకుంది దర్శన్.

'జూలీ...జూలీ' లోపల్నుంచి ఖంగుమంది స్వరం. ఆ తరువాత అతను బయటికి వచ్చాడు. ఎర్రగా, లావుగా, ఎత్తుగా బలంగా వున్నాడు. ఎర్రగావున్న అతనికళ్ళు అతని మొహానికి మరింత అందాన్ని తెచ్చిపెడుతున్నాయి. వుంగరాలు తిరిగిన క్రాపు దుబ్బుగా వుంది. నీలం రంగు కనుపాపల్లో క్షణం నవ్వు నవ్వినట్లు మెరిసి మాయం అయింది. అతను గంభీరంగా అడుగులు వేస్తూ 'యస్' అన్నాడు.

కరుణ చెప్పింది.

'ఓ' అన్నాడు అతను కనుబొమ్మలు ఎగరేసి. అతన్ని చూడగానే స్పష్టంగా తెలిసిపోతోంది అతనుమిలిటరీనుంచి రిటైర్ అయి వుంటాడని.

కరుణని లోపలికి ఆహ్వానించాడు.

దర్శన్ అక్కడేవున్న బెంచీ మీద కూర్చుంది.

అతని వెనకే కరుణ వెళ్ళింది.

'నేనే డబ్ల్యు డూప్లే వురఫ్ లక్ష్మీనారాయణని. మరోమాట చెప్పాలంటే ఈ అడ్వర్టైజ్‌మెంట్ అరవింద్ అనే పేరుతో

అన్వేషి

— డా॥ సి. నారాయణరెడ్డి

'సౌందర్యాన్వేషీ! నగం
దచ్చావా దిక్కుతోచక?'
'వచ్చాను మొత్తంగా ఆత్మ
సత్యాన్ని చూచలేక'.

'తత్వాన్వేషీ! కొమ్మలు
తట్టావా కొసవేళ్ళతో?'
'అడుగులోనే వున్నాను
అడుసులో దిగిన కాళ్ళతో'!

'హృదయాన్వేషీ! ఏదో
వెదుకుతున్నావు చీకట్లో?'
'మలిగిపోని భానుబింబాన్ని
నిలపాలని వాకిట్లో'.

కూడా నేనే చేశాను. అచ్చా! మీరు యిష్టపడ్డావన్నారు — మా పిల్లను మీరు చూసి వుండరు.'

కరుణ కళ్ళు పైకెత్తి ప్రశ్నార్థకంగా చూసింది.

'యిప్పుడు టైమ్ సరిగా రెండు గంటలు. రాత్రి తొమ్మిదిగంటలవరకూ తల్లి లేని మా డాలీని చూసుకోవాలి. యిదే పర్సనల్ యింటర్వ్యూ. నేను వెడుతున్నాను. మీక్కావలసిన మిగిలిన ఏర్పాట్లు' అని ఆపేసి చప్పట్లు కొట్టాడు.

తలుపు తెరుచుకుని ముప్ఫైఏళ్ళ అతను లోపలికివచ్చి 'సాబ్' అన్నాడు. 'యితను గణేశ్. యితను చూస్తాడు' అని 'జరా ఖ్యాల్ రఖో' అన్నాడు. అని అతను మరోమాట అనకుండా తీవిగా బయటికి వెళ్ళిపోయాడు.

'మీ పేరు' అతను హిందీలో అడిగాడు.


కరుణ జవాబు చెప్పింది.

'యిప్పుడే వస్తాను' అతను లోపలికి వెళ్ళిపోయాడు. పదినిమిషాల్లో అతను 'డాలీ'ని తీసుకువచ్చాడు. ఆ పిల్లకి తొమ్మిదేళ్ళు వుంటాయి. ఎర్రగా తండ్రి మాదిరే వుంది. బాబ్డ్ హెయిర్, మినీ స్కర్ట్ వేసుకుంది. చేతుల నిండా మసి పూసుకుంది. ఆ మసి బుగ్గలకీ, నుదుటికీ అంటించుకుంది.

'బహన్‌జీ కు నమస్తే కరో' గణేశ్‌ని ఒక్కతోపు తోసి తలుపు తెరుచుకుని వెళ్ళిపోయింది డాలి.

కరుణకి క్షణంలో అర్థం అయిపోయింది. ఇల్లుపీకి పందిరి వేసే యీ పిల్లను ఒక దారికితీసుకురావాలన్నమాట. వింటుందా? ఈ వుద్యోగం లేకపోతే ఎలా బ్రతకడం? రెండు పూటలా టిఫిన్ రెండుసార్లు కాఫీ భోజనం కాక ఖర్చుకుగాను మూడు వందలు యిచ్చే యిటువంటి వుద్యోగం తను ఈ జన్మలో సంపాదించగలదా? ఇన్నిటితోబాటు తను అయనకి పర్సనల్‌గా లెటర్ వ్రాయడంతో దర్శన్‌కి తనకీ తేడా చూసుకునేందుకు ఆ యింట్లో స్థానంకూడా యిస్తున్నాడు. కుర్చీ జరుపుకుని తలుపు తెరిచి బయటికి వచ్చింది కరుణ. డాలీ ఆ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా లేదు. కరుణ ఆలోచించి 'గణేశ్' అనిపిలిచింది.

గణేశ్ హాజరుగా నిలబడ్డాడు.



గవర్నెస్ కరుణ

'డాలీ ఏదీ?'

'ముందు మీ యిద్దరూ యిల్లు చూడండి. డాలీ ఎక్కడ వుంటుందో ముందు ముందు మీరు వెతుక్కోండురుగాని' అన్నాడు వ్రమతగా.

ఆ యిల్లు అక్కడున్న యిళ్ళన్నిటికన్నా ప్రత్యేకంగా వుంది. మొజాయిక్ ఫ్లోర్‌తో, విశాలమైన ఆవరణతో యజమాని అభిరుచికి తగినట్లుగా వుంది. దాదాపు పది గదులున్న యిల్లు అది. రెండు బెడ్‌రూమ్‌లున్నాయి. వంట యింటి పక్కనే డైనింగ్ హాల్ వుంది. డ్రాయింగ్ రూమ్ కాక లైబ్రరీ రూమ్ వుంది. వంట యింటి పక్కన వున్న పిట్టగోడ నానుకుని కూర్చుంది డాలీ. ముందు వుల్లిగడ్డలు కొన్ని వున్నాయి. వాటిని తరిగింది. అవి అస్తవ్యస్తంగా వున్నాయి.

దర్శన్‌ని, గణేశ్‌ని వెళ్ళిపొమ్మని సైగ చేసింది కరుణ. డాలీ పక్కకు వెళ్ళి 'నీ పేరు ఏమిటమ్మా', అని అడిగింది.

డాలీ ఒక్కసారి ఆమె వైపు చూసింది. ఆ చూపులో విరసన స్పష్టంగా కనిపిస్తోంది.

'ఏం చదువుతున్నావు?'

డాలీ మాట్లాడలేదు. వుల్లిగడ్డను కోయడంవల్ల కళ్ళు నీరుకారి మంటలు పుడుతున్నాయి. నీరుబడ్డ కళ్ళలో నీళ్ళు అవిరామంగా కారుతూంటే పెద్దగా ఇంటి కప్పు ఎగిరిపోయేలా ఏడవడం మొదలు పెట్టింది. కరుణ ఆ పిల్లని దగ్గరకు తీసుకుంది. కరుణని తోసేయాలని డాలీ చేసిన ప్రయత్నం వృధా అయిపోయింది. కరుణ రెండు చేతులతో ఎత్తుకుని బాత్‌రూమ్ వైపు తీసుకువెళి నీళ్ళతో కళ్ళని కడిగింది. చల్లటి నీళ్ళు కళ్ళమీద పడగానే డాలీకి ప్రాణం లేచివచ్చినట్లయింది. కరుణని విడిపించుకుని తక్కున క్రిందికి దిగిపోయి యింటిలోపలికి పారిపోయింది.

కరుణ అడుగులో అడుగు వేసుకుంటూ డాలీ వెనుక లోపలికి వెళ్ళింది. డాలీ వంటింట్లోకి వెళ్ళి కంచం పెట్టుకుని చపాతీలు వేసుకుంది. కరుణ వచ్చి కూర వేసి తిను అంది.

డాలీ వెంటనే ఆ కంచం తీసేసి వెళ్ళిపోయింది. కరుణ యింక ఆగిపోయింది. ఆ పిల్ల వెనుక పదిహేను నిమిషాలు తిరిగే సరికి ఎక్కడలేని నిస్సత్తువా వచ్చేసి టైఫాయిడ్ వచ్చాక పథ్యం తిన్న రోజుని గుర్తుకు తెస్తోంది. ఒంట్లో దమ్మిడీఎత్తు ఓపిక కూడా లేనట్లు అయిపోయింది కరుణ రెండు మూడుసార్లు 'డాలీ' అని పిలిచింది. కానీ డాలీ పత్తాలేదు.

'ఇది యింటర్వ్యూనా? భగవాన్. ఇది యింటర్వ్యూ కాదు తనపాలిట శాపం' అనుకుంది. డాలీ కోసం బయటికి వచ్చింది.

దూరంగా దర్శన్ హిందీలో గణేశ్‌తో కష్టాలు వెళ్ళబోసుకుంటోంది. ఈ కొద్ది సమయంలోనే వాళ్ళిద్దరూ, చాలా కాలం నుంచి ఎరిగిన వ్యక్తుల్లా కలిసి పోయారు. ఆమె చేతులు వూపుతూ చెప్పే మాటలకి గణేశ్ మొహం వెడల్పయింది. ఆత్మీయులకు మొహంవాచినట్లుందిఅతన్ని చూస్తూంటే.

కరుణ దూరంగా చూసింది. అక్కడ డాలి గోడ ఎక్కుతోంది. 'బాప్‌రే ఈ పిల్లని పట్టుకుని దార్లోకి తీసుకు రావడం కష్టమే', అనుకుంది. మెల్లగా డాలీ దగ్గరకి వెళ్ళి 'మాట చెబుతా, కథ చెబుతా', అంది.

కరుణ వైపు డాలి గమ్మత్‌గా చూసింది. కరుణ ఆపిల్ల కళ్ళకి బహుశా వెర్రి దానిలా అనిపించిందేమో. కరుణ గమనించి నవ్వుకుంది.

[ఇంకా వుంది]

డాక్టరు సలహాలు

కె. ఆర్. డి. - గుంటూరు

మా పాపకి పోలియో డ్రాప్స్ వేసినా పోలియో వచ్చి కాలు వంకరపోయినది బూటు వేస్తున్నాము. డ్రాప్స్ వేసినా పోలియో ఎందుకు వచ్చింది?

పోలియో డ్రాప్స్ క్రమబద్ధంగా వేస్తే పోలియో రావటం అరుదు. ఒకవేళ పోలియో వచ్చినా కాళ్ళు వంకరపోయి బూట్లు వేయడం ఇంకా అరుదు.

అది నిజంగా పోలియో అయ్యుంటే డ్రాప్స్ వెయ్యక ముందే పోలియో క్రిములు శరీరంలో ప్రవేశించివుండాలి. ఎందుకంటే క్రిములు ప్రవేశించటానికి, రోగలక్షణాలు కనపడటానికి దాదాపు వ్యవధి వున్నది.

మరీ అరుదుగా పోలియో వాక్సిన్ సరిగా "స్టోర్" చెయ్యకపోవటం వల్లనూ, వాక్సిన్ తయారీలో అవకతవకలువచ్చినపుడూ, పోలియో డ్రాప్స్ వల్లనే పోలియో రావచ్చును.

కె. ఆర్ ఎమ్. - శ్రీకాకుళం

హైడ్రోజన్ పెరాక్సైడ్ తరచు చెవిశుభ్రం చేసుకోవటానికి ఉపయోగించటం మంచిది కాదు అన్నారు. ఇది ఎంతవరకు నిజం. నేను ప్రతి వారం వాడుతాను.

చెవులు. మిషన్ కాదు తరచు శుభ్రం చెయ్యటానికి. గులిమి చేరినప్పుడు. దానంతట అదే రాలిపోతుంది మీరు సైన్స్ టీచర్ కాబట్టి ఎక్కువ ఆసక్తితో ఇలా చేస్తూవుండవచ్చును వారానికి ఒకమారు హైడ్రోజన్ పెరాక్సైడ్ ఉపయోగించటం అనవసరం.

ఎస్ ఎస్. ఆర్. - మిర్యాలగూడెం

పళ్ళు తెల్లగా మెరవాలంటే ఏమిచెయ్యాలి?

పళ్ళయొక్క తెల్లదనం పళ్ళతోమే పద్ధతులు అలవాట్లు, శుభ్రంచేయటానికి ఉపయోగించే పదార్థములు. అహారంలో కొన్ని పదార్థములు మున్నగు వాటిమీద ఆధారపడి వుంటుంది.

మరీ గరుకుగాని పండ్లపొడి, పేస్టు మున్నగు వాటితో బ్రష్‌తో పైకి క్రిందికి తోముకోవాలి. అనిజ పదార్థములు ఎక్కువగా ఉల పదార్థములు తీసుకున్నప్పుడు, మామూలుగా అహారము తీసుకున్న తర్వాత గూడా పళ్ళను శుభ్రం చేయాలి.

ఇది వరకే పళ్ళు పాచి పట్టివుంటే దంత వైద్యులవద్ద క్లీనింగు చేయించుకోవాలి. తర్వాత పై నియమాలు పాటించాలి.

జి. ఎస్. ఆర్. — సంగారెడ్డి

గోరుచుట్టు ఎందువల్ల వస్తుంది? దీనికి నివారణోపాయం ఏమిటి?

గోరుకి, చర్మానికి మధ్యనున్న స్థలంలోనుంచి సూక్ష్మక్రిములు ప్రవేశించి గోరుక్రింద చర్మంలో చీముకు వున్నప్పుడు గోరుచుట్టు వస్తుంది.

గోరుచుట్టు వున్నప్పుడు వేలు వాయటం ఎక్కువగా నొప్పివుండటం జరుగుతుంది.

గోరుచుట్టు పెద్దదైన తర్వాతనే బయటికి కనబడుతుంది కాబట్టి ఈ సమయంలో మందులు, ఇంజక్షనులు పనిచేయవు.

చిన్న శస్త్రచికిత్సద్వారా చీముని తీసివేయటం వల్ల నొప్పి చేతితో తీసినట్లు పోతుంది.

టిన్ కె. వి. ఆర్ — గూడూరు.

స్మాల్ పాక్స్ వచ్చినపుడు దానంతట అది దిగేలోగా ఇంగ్లీషు మందులు వాడి ఒక రోజులోగా పోగొట్టలేరా?

స్మాల్ పాక్స్ మొదలైనవి వైరస్ వల్లవచ్చే వ్యాధులు వాటికి ఏ శాస్త్రంలోను మందులులేవు. వాటివల్ల రాగల అవాంతరాలకు మాత్రమే మందు లిస్తారు

ఇవి వచ్చినపుడు దానంతట అవే తగ్గిపోతాయి.

అయినా ఈ రోగాలు రాకుండా చూసు కోటానికి వాక్సినేషన్ పద్ధతివుండగా ఒకరోజులో నయమవాలని ఆశపడటం ఎందుకు?

వి. వి. ఆర్. — గోపాలపురం

"ఈసోనోఫీలియా" అంటే ఏమిటి? ఇది ఎందువల్ల వస్తుంది? దీనికి నివారణోపాయము ఏమిటి?

మన రక్తములోని తెల్లకణములలో ఒక విభాగమే "ఈసనోఫిల్స్." ఇవి మామూలుగా ప్రతి నూరు తెల్లకణాలకి 4 నుంచి 10 దాకా వుండవచ్చును. మామూలుగానే కొన్ని సమయాలలో ఇంకా ఎక్కువ వుండవచ్చును

అసాధారణమైన ఈ సంఖ్య పెరుగుదలను "ఈసినోఫీలియా" అంటారు. ఈ కణముల పని శరీర రక్షకమైనది. శరీరంలో క్రిములు ప్రవేశించినపుడు తెల్లకణముల సంఖ్య పెరుగుతుంది (డిఫెన్సు).

చర్మంద్వారా క్రిములు మొదలైనవి శరీరంలో ప్రవేశించి నపుడు మరి కొన్ని ఇతర కారణాల వల్ల ఈ సంఖ్య పెరుగుతుంది. ఇది ఎక్కువగా పెరిగినపుడు శరీరంలో "అలర్జీ" ఏదో కారణం వల్ల వున్నదని అర్థం అలర్జీ వల్లనే దగ్గు వస్తుంది.

ఎస్. కె. కె. — తిరుపతి


పుట్టిన 5, 6 నెలలలోగా చంటిపిల్లలకు అజీర్తి చెయ్యకుండా ఏమివాడాలి? మామూలుగా ఆముదము, గ్రైప్‌వాటర్ వాడకూడదంటారు కదా?

ఆరునెలలలోపు పిల్లలకు పాలే ముఖ్యమైన ఆహారము కనుక క్రమపద్ధతిలో తగుపాళ్ళలో తగినంత నీరు కలిపి పిల్లలకు పాలుఇస్తే పిల్లలకు అజీర్తి చేయదు.

పిల్లలు పుట్టినప్పటినుండి విధిగా గ్రైప్‌వాటర్ వాడటం, అవసరాన్ని బట్టిగాక సాంప్రదాయకంగా తయారయింది.

పిల్లలకు కడుపునొప్పి వున్నప్పుడు డాక్టర్‌కి చూపించాలి. ఆముదం విధిగా వాడటం చాలా ప్రమాదం. పళ్ళరసం రోజుకి రెండుసార్లు, పాలు పట్టేదానికి మధ్య కాచి చల్లార్చిన నీటిలో గ్లూకోజువేసి పట్టటం చాలా మంచిది.

—డా॥ కె. వెంకటేశ్వరరావు





బార్‌లో నిశ్శబ్దంగా వుంది. నాతోపాటు కలిసి నల్గురు మాత్రమే వున్నాము. నా మిత్రులు తాగటంలో మునిగి పోయారు. కొంచెము సేపటికి వాళ్ళకి విసుగు వేసింది.

"ఒరేయి రఘూ...ఏమైన కథచెప్పరా" అన్నాడు శేఖర్.

"నేనా, నేనేమి కథ చెప్పగలను" అన్నాను సిగరెట్టు వెలిగిస్తూ.

"కాదు నీవు కథలు చెప్పటములో ప్రసిద్ధి — పైగా పెద్ద రచయితవి. చెప్పరా నాయన బతిమలాడించుకోకుండా" గ్లా—సు ఖాళీచేస్తూ.

మిగిలినవాళ్ళు సపోర్టు చేశారు.

"అయితే చెబుతాను వినండి" అంటూ సిగిరెట్టు వెలిగించాను. ఏదో జ్ఞాపకం వస్తోంది. నేను నెమ్మదిగా గతంలోకి జారిపోయాను. నా పెదవులు ఏదోచెబుతున్నాయి.

"మా వూళ్ళో మల్లి అనే పిల్ల వుండేది. ఆ అమ్మాయికి జడగంటలు వుండేవి. మల్లి పట్టుపరికిణి మీద తెల్ల వాయిల్ వోణి వేసుకొనేది. తలలో ఎప్పుడు పూలువుండేవి. ఆ అమ్మాయి చక్కని చుక్క. ఆ చుక్కకి నేను మనసు ఇచ్చాను. మల్లి రోజూ గుడిలో పాటలు పాడేది. ఆ పాటలు వినటానికి ఆ గ్రామము ఎంతో సంబర పడేది. నేనంటె ఎంతో ఇష్టం మల్లికి. ఒకరోజు మల్లి దారికి అడ్డంగా నిల్చేను. మల్లి... నాతో ఏదైన మాట్లాడితేనే వెళ్ళనిస్తాను.

ఏం బాబు మీతో నాకేం మాటలు అంది సిగ్గుపడుతు. అలా సిగ్గుపడుతున్న ఆమెని దగ్గరికి తీసుకొని వదిలి వేశాను. రోజు రోజు నాకు మల్లితో స్నేహం ఎక్కువ అయింది. మల్లిని చూడందె నేను వుండ లేను. మల్లి నాకు ప్రాణం. ఆ రోజులలో రెడ్డిగారి అబ్బాయి శంకరము పట్నం నించి వచ్చాడు. మల్లి మీద అతను కన్ను వేయుటం గమనించాను. రబ్బరు బొమ్మ లాంటి మల్లి, ఎప్పుడు అందరితోటి కలిసి మెలిసి నవ్వుతు తుళ్ళుతు తిరిగె మల్లి మీద అతని కన్ను పడటము సహజమే అనుకున్నా. ఆ తరువాత నాకు బాంబేనుంచి మంచి జాబ్ వచ్చింది. అదృష్టం కలిసి వచ్చింది అనుకున్నాను. వెళ్ళిపోయాను." అని కాసేపు ఆగేను. సిగరెట్ పొగ వదులుతు అందరి వంక పరిశీలనగా చూశాను. నేను ఏమి చెబుతానా అని వాళ్ళు కుతూహలంగా చూస్తున్నారు. తిరిగి మొదలుపెట్టాను.

"రెండుసంవత్సరాలు పట్నంలోగడిపాను. తిరిగి మా వూరు బయలుదేరాను. అప్పటికే చీకటి పడింది. పల్లెటూరు కావటంతో ఆ వూరుకి లైట్సు లేవు. ఆ చీకటిలో బస్సు దిగి వేగంగా పొలాల మధ్యగా నడువ సాగాను. ఎటు చూసిన చిక్కని చీకటి ప్రక్కనే పొలాలు. ఇంతలో 'రఘు' అనే పరిచయమున్న గొంతు వినిపించింది. నేను వులిక్కిపడ్డాను. ఆ చీకట్లో మల్లి ఎందుకు వుందో అర్థం కాలేదు. అయినా ఇన్నాళ్ళకి కలుసుకున్న నా ప్రియురాలు గొంతువిని ఆనందముతో పులకరించాను.

! దూరంగా గజ్జెల శబ్దం వినిపిస్తోంది. బాగ్ కిందపెట్టి మల్లి అనే కేకవేశాను. వస్తున్నా రఘు అనే మాటలు వినిపించాయి. మల్లి వస్తున్నది. ఇదివరకులాగా పరికిణీలు కట్టలేదు. తెల్లని చీర, తెల్లని జాకెట్టు, విరబోసివున్న జుట్టు. ఆమెను చూసి నేను జంకేను. ఆమె నా బాగ్ పుచ్చుకొని దొర గారికి ఇన్నాళ్ళకి జ్ఞాపకం వచ్చానా అయినా పట్నం ఆడపిల్లల్ని చూస్తే మల్లి ఏం జ్ఞాపకం వస్తుంది. అని గునుస్తూ నడుస్తోంది."

నేను నవ్వి "లేదు మల్లి. ఆ శ్రీరామ చంద్రుడికి సీత ఎలాగో నాకు కూడ నీవు పక్కదానివే" అని ఆమె భుజాల చుట్టూర చేతులు వేశాను. ఆమె వులిక్కిపడింది.

"నన్ను పెళ్లి చేసుకుంటావా?"


"పిచ్చివానా! ఇంతకథ జరిగాక నిన్ను పెళ్లి చేసుకోకుండా ఎలాగువుంటాను" అని "అయినా ఏమిటి ఈ అవతారము. ఆ తెల్ల చీర ఏమిటి నీలాంటి చిన్న పిల్లకి" అని ప్రశ్నించుకున్నాను దానికిజవాబుగా మల్లి విరగబడి నవ్వింది ఇంతలో ఎవ్వరి వెలుపలికి వచ్చారు.

"చూశావా మల్లి! నీతో కబుర్లు చెబితే నాకు కాలమే తెలియదు" అని చిన్నగా నవ్వేను.

"సర్లే. అదిగో మీ యిల్లు వస్తోంది" అని పిలుస్తున్నా వినిపించుకోకుండా పరిగెడుతూ మాయం అయింది.

మా ఇంట్లో అందరు నన్ను చూసి ఆశ్చర్యపోయారు. తరువాత ఆనందపడ్డారు. నేను జరిగిన కథ అంతా చెప్పాను. అందరు వులిక్కి పడ్డారు.

"మల్లి...మల్లి చనిపోయింది" అన్నాడు నాన్న.



"ఆ...!" అని ఆశ్చర్యపోయాను.

"అవునురా! ఒకరోజు శంకరం చెరిచాడు ఆ అవమానం భరించలేక ఆమె బావిలోపడి చనిపోయింది.. చాలా మంచి పిల్లరా ఆ అమ్మాయి."

"అయితే నాతో వచ్చింది మల్లి దెయ్యమా!" అని అన్నాను. సిగరెట్ వెలిగిస్తూ అందరి వంక చూశాను.

అందరూ విచారుగా అయి నా వంక చూడసాగేరు.

ఆంధ్రపత్రిక
సిద్ధార్థి నామ సంవత్సరాది సంచిక

మనవి

ఎప్పటిలాగే ఆంధ్రపత్రిక ఉగాది సంచిక (సిద్ధార్థి నామ సంవత్సరాది సంచిక) కి తమ రచనలు పంపవలసిందిగా రచయిత (త్రు) లకి మనవి చేసుకుంటున్నాము.

రచనలు జనవరి ఆఖరిలోగా మాకు చేరేట్లు పంపాలని కోరుకుంటున్నాము.

కవరుమీద, వ్రాత ప్రతిమీదకూడా స్పష్టంగా "ఉగాది సంచిక"కి అని రాయాలని మనవి చేసుకుంటున్నాము.

సంపాదకుడు.

వారఫలం

29-12-1978 శుక్రవారం మొదలు

4-1-1979 గురువారం వరకు

మేషం :— ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

వృషభం :— ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. సంతోషకరమైన వార్తలనువింటారు. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. విలాస వస్తువులు కొంటారు.

మిధునం :— రావలసిన డబ్బు అందుతుంది. సాటివారిలో గౌరవం బాగుంటుంది. వారం మధ్యలో ఆందోళన కలుగుతుంది. సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం :— రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

సింహం :— వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. సాటివారితో వాద ప్రతి వాదాలు తగవు. ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

కన్య :— మీ కార్యక్రమాలు అడపుడిగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలుబాగుంటాయి. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. ఇతరుల నిమిత్తం మీరు శ్రమ పొందవలసి వస్తుంది. స్త్రీలకు—దైవకార్యాలు నెరవేరతాయి. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

తుల :— అనుకూలమైన వార్తలను వింటారు. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి. మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధిస్తారు.

వృశ్చికం :— వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. మీ ఆలోచనలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు :— ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలోముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. అధికారులవల్లన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

మకరం :— వ్యతిరేకమైన వార్తలను వింటారు. వ్యాపారంలో శ్రమకలుగుతుంది. వారంమధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

కుంభం :— వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మిత్రులసహాయంలభిస్తుంది. వారం మధ్యలో మీ తాలూకు వస్తువులు పోవచ్చును. శ్రమకలుగుతుంది. వారంఆఖరులో మీ కార్యక్రమాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం :— అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలుబాగుంటాయి. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. వారం ఆఖరులో ప్రయోజనంలేని శ్రమ కలుగుతుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

—మహేష్


వనితలకు మనవి

కొత్తరకం వంటలు
క్లుప్తంగా వ్రాసి పంపితే
త్వరగా పరిశీలించ వీలు —సం.

(గత సంచిక తరువాయి)



[ఇంకా వుంది]



సీరియల్

ఆకర్షణ-వ్యామోహం



కమనశర్మ

(గత సంచిక తరువాయి)

11

కొత్త సంవత్సరం మొదలైంది శంకరరావు కుటుంబంతో సహా ఆస్ట్రేలియా వచ్చి ఒకటిన్నర సంవత్సరాలైంది శంకరరావు ఇండియాలో చాలా సంవత్సరాలుగా లెక్చెరర్ పని చేసివచ్చాడని అతనికి ఆ సంవత్సరం టీచింగ్ ఫెలోగా ఉద్యోగం యిచ్చారు దాంతో అతనికి నెలకి సంపాదన మరో నూటయాభై డాలర్లు పెరిగింది. పార్వతికి ఆరుమైళ్ళ దూరంలో టీచర్‌గా ఉద్యోగం అయింది ఆడ టీచర్లకి మగ టీచర్లకి జీతాలు ఒకటే చెయ్యటంవల్ల తనకి నెలకి మూడువందలపాతిక డాలర్లదాకా నెలకి చేతికి వస్తోంది. ఆర్థికంగా పరిస్థితి మెరుగుపడింది. శంకరరావు ఆ నెల పాత కారమ్మేసి సరికొత్త కారు కొన్నాడు. పొద్దున్నే బాబుని జోన్ దగ్గర దింపేసి పార్వతిని స్కూలు దగ్గర దింపేసి తను యూనివర్శిటీకి వెళ్లిపోతాడు సాయంత్రం పార్వతిని వాళ్ల హెడ్‌మాస్టర్, తన దార్లో పార్వతిని దింపేసి వెళ్లిపోతాడు. పార్వతి పెట్రోల్ ఛార్జెస్ అతనితో కొంతభాగం పంచుకొంటుంది.

ఒకరోజున పార్వతిని దింపి యూనీకి వెళ్తున్న శంకరరావుకి డాండినాంగ్ రోడ్‌మీద పిల కనిపించి కారు ఆపమని సౌంజ్ఞ చేసింది. శంకరరావు కారాపాడు. "ఇవాళ మా ఫ్రెండ్ సెలవు పెట్టింది బస్సు రాలేదు. మా స్కూలు దగ్గర దింపగలరా?" అని అడిగింది

"ఆనందంగా" అంటూ శంకరరావు ఆమెను కారెక్కించుకొన్నాడు.

ఆ దేశపు అలవాటుకొద్దీ ఆమె ముందు సీట్లో ఎక్కి శంకరరావు పక్కన కూర్చుంది.

"ఇవాళ నువ్వు మరీ మెరిసిపోతున్నావ్!"

అన్నాడు శంకరరావు శంకరరావుకి షీల, కృష్ణల కుటుంబంతో క్రిస్‌మస్ సెలవల్లో బాగా పరిచయం ఏర్పడింది క్రిస్ మస్ లో ఆస్ట్రేలియా అంతా వేడుకల్లో పడిపోతుంది కాలేజీలు మూసేస్తారు షాపులు కట్టేస్తారు. ఏదీ పని చెయ్యదు మిత్రులు, బంధువులు కలిసి విందులతోను వినోదాలతోను గడుపుతారు అది హిందువులకి మహా విసుగనిపించే కాలం ఆ పండగ వీళ్ళది కాదు. కనక పెద్దగా ఎవరు వీళ్ళని పిలవరు. చెయ్యడానికి ఏమీ వుండదు. అందుకని ఇండియన్లతో హిందువులంతా కలిసి పిక్నిక్‌లకి పోవడం ఎవరింట్లో అన్నా చేరి భోంచెయ్యటం, పేక ఆడటం చేస్తారు ఆవిధంగా శంకరరావు కారులో సైట్ సీయింగ్‌కి శంకరరావు కుటుంబంతోపాటు శంకరరావు ఆహ్వానంమీద కృష్ణ, షీల కూడా వెళ్ళారు అది పార్వతికి పెద్దగా ఇష్టంలేకపోయినా ఏమీ అనలేక వూరుకొంది అప్పుడు శంకరరావుకి, షీలకి కొంచెం చనువు ఏర్పడింది. ఆ చనువుతో ఈరోజు శంకరరావు షీలకి కాంప్లిమెంటిచ్చాడు స్కూలు దగ్గర కారు దిగుతూ ''రేపు కూడా లిఫ్టు ఇవ్వగలవా ?'' అని అడిగింది.

''ఏమీ ఇబ్బందిలేదు'' అన్నాడు. నిజానికారోజు పెందరాళే వెళ్ళి ఎక్స్‌పరిమెంట్ మొదలుపెడ్దా మనుకొన్నాడు. షీలని డ్రాప్‌చేస్తే, ఎక్స్‌పరిమెంట్ మొదలుపెట్టడం ఆలస్యం అవుతుంది దాంతో కట్టిపెట్టడం, సాయింత్రం ఇంటికి వెళ్ళడం కూడా ఆలస్యం అవుతుంది కాని షీలకి లిఫ్ట్ యిచ్చే అదృష్టం వదులుకోదల్చుకోలేదు

ఆ సాయింత్రం షీల కనిపించిందని ఆరోజు తను అమెను స్కూలు దగ్గర దింపాడని మర్నాడు కూడా దింపమని అడిగిందని శంకరరావు పార్వతితో చెప్పాడు. పార్వతి మింగాలేక కక్కాలేక ఊరుకొంది. తను మరి తన హెడ్‌మాస్టర్ కార్లో వస్తోందికదా!

ఆమర్నాడు షీలే ముందరగా ''శంకూ! నువ్వివాళ హాండ్‌సమ్ ప్రిన్స్‌లా వున్నావ్'' అంది, కారెక్కుతూ

''థాంక్స్'' అన్నాడు శంకరరావు.

''నీకీ విషయం పార్వతి చెప్పుండాలే!''

''లేదు ''

కారు ట్రాఫిక్ లైట్ దగ్గర ఆగింది ''మనకి పెళ్ళిళ్ళు కాకముందు నువ్వు నాకు తగిలి వుండాల్సింది'' అంది షీల నిట్టూరుస్తూ.

శంకరరావు షీల కుడిచేతిని తన ఎడంచేత్తో మృదువుగా నొక్కాడు. షీల స్కూలు దగ్గర దిగుతూ అతని కళ్ళలోకి అభిమానంగా చూస్తూ దిగింది. ఆ చూపందుకొని శంకరరావు ''ఐ లవ్ యూ'' అన్నాడు

''పార్వతి వినగలదు'' అంది షీల.

''ఇక్కడ లేదుగా'' అన్నాడు.

''కృష్ణ కూడా లేదు. అందుకే ధైర్యంగా చెప్తున్నాను. నాకు మూడేళ్ళు ఆలస్యంగా కన్పించావు'' అనేసి షీల స్కూల్లోకి వెళ్ళిపోయింది

కొద్దిరోజుల్లోనే షీలకు, శంకరరావుకి మధ్య చనువు పెరిగింది షీల ''మీరు సిటీకి వెళ్తే నేను వస్తాను'' అనో ''మార్కెటింగ్‌కి మమ్మల్నీ తీసుకువెళ్ళండి'' అనో అడగటం మొదలుపెట్టింది షీలకి కారు లేని లోటులేదు. శంకరరావు ఆమె అడిగినప్పుడల్లా అడిగినచోటుకి తీసుకువెళ్తున్నాడు పార్వతికి ''వద్దు'' అనడానికి తగినంత కారణం కనపడటంలేదు షీలతోపాటు తనూ కృష్ణ కూడా వెళ్తున్నారు కార్లో. ఎప్పుడో స్కూలుకి మాత్రం షీల ఒక్కతే శంకరరావుతో వెళ్తోంది అదికూడా ఏ రెండు మూడుసార్లో వెళ్ళుంటుంది. తను, ఆ మాటకివస్తే రోజూ ఆ హెడ్‌మాస్టర్ కార్లో వస్తోంది, అని పార్వతి సరిపెట్టుకొంది

అయితే అల్లా సరిపెట్టుకోడం ఎక్కువ రోజులు సాగలేదు. ఒకరోజున పార్వతి ఎక్కినవేపు కారు తలుపు సరిగా పడలేదు, ఆమె స్కూలు హెడ్‌మాస్టరు కార్లో వస్తున్నప్పుడు. అప్పుడతను ఆమె మీదుగా వాలి తలుపు తెరిచి మళ్ళీ గట్టిగా వేసాడు అల్లా వేస్తున్నప్పుడు అతని మోచేయి,

జరిగిన కథ - 8. కొత్త జీవితం గడపటానికి స్వదేశం నుండి ఆస్ట్రేలియా వెళ్ళిన శంకరరావుని, పార్వతిని — రంగస్వామి, ప్రేమ బ్రౌన్‌లు సాదరంగా ఆహ్వానించి వాళ్ళ ఫ్లాట్‌కి తీసుకువెళ్తారు. పార్వతి టీచర్ ఉద్యోగానికి ప్రయత్నించి నిరాశ చెందుతుంది తర్వాత కొన్నాళ్ళకు ఒక బట్టల కంపెనీలో ఉద్యోగానికి చేరుతుంది ఉన్నంతలో 'వినాయక చవితి' పండుగ జరుపుకుంటారు శంకరరావు దంపతులు. శంకరరావు పనిచేస్తున్న యూనివర్శిటీలోని విద్యార్థులు తమ జీతాలు తగ్గించాలని ఆందోళన చేస్తుంటారు శంకరరావు, రంగస్వామి కారును కొందామని ప్రయత్నాలు జరుపుతుంటాడు హరే రామ, హరే కృష్ణ సమాజంలో చేరిన హారికి అతని తల్లి 'జోన్' పడే బాధను తెల్పి, ఇంటికి వచ్చేయమంటాడు శంకరరావు స్మిత్‌ల ఇంటికి భోజనానికి వెళ్తారు శంకరరావు, పార్వతి. పాశ్చాత్య నాగరికతా మోజులో పడిన భర్త కోసం వేషధారణ మార్చుకున్నా, షీల వ్యామోహంలో పడిన శంకరం దేశం కాని దేశంలో తనకి అన్యాయం చేస్తాడేమోనని వాపోతుంది పార్వతి.

తప్పుకోవాలనో ఆమె మెత్తటి గుండెలమీద ఆనేయి! అతను తరువాత పార్వతికేసి చూసాడు బహుశః కోపంగావుంటే క్షమాపణ చెప్పుకొందామని, స్పోర్టివ్‌గా తీసుకొంటే సరేసరి ముందుకు వెళ్దామని. అయితే పార్వతి కా సంఘటనతో వేరే ఆలోచనలో పడిపోయింది. శంకరరావు షీలకి లిఫ్ట్ ఇచ్చినరోజున ఎప్పుడైనా షీల వైపు తలుపు పడకపోతే! అప్పుడిల్లాగే జరిగితే! ఇంకేమన్నావుందా? తన సంసారం పాడైపోదు. తన జాగ్రత్తలో తనుండాలి!

ఆ వారంలోనే స్కూలుకి లిఫ్ట్ అడిగిన షీల ''శంకూ! ఈ తలుపు సరిగా పడలేదు'' అంది.

శంకరరావు అటువేపు వాలి తలుపు వేస్తుంటే షీల ఇటువేపుకి గువ్వలా ఒదిగింది

''నువ్వు నన్నిలా రాసుకొని కూర్చుంటే, నిన్ను చూసి ఎవరైనా నా గర్ల్‌ఫ్రెండువి అనుకోవచ్చు'' అన్నాడు శంకరరావు అల్లా అంటున్నప్పుడు శంకరరావు గొంతుక ఉద్రేకంతో వణికింది.

''కానా!'' అంది షీల కాని సరిగ్గా అదే సమయంలో శంకరరావుకి వేరే ఆలోచన వచ్చింది పార్వతి కూడా 'అతని' పక్కన ఇల్లాగే ఒదిగి దగ్గరగా కూర్చుంటుందా? శంకరరావు ఉద్రేకం చప్పగా చల్లారిపోయి అనుమానం మొదలైంది.

షీలను స్కూల్లో దింపి యూనివర్శిటీకి వెళ్ళి తన సీట్లో కూర్చుని ఆలోచనలో పడ్డాడు నెలరోజుల క్రితం జరిగిన విషయాలన్నీ గుర్తుకు రావటం మొదలుపెట్టాయి

ఒకరోజు రాత్రి, వేడిగావున్న రాత్రి చల్లటి బీరు కాన్లతో తాగుతూ టి. వి. చూస్తున్నారు టి వి. లో కార్పెట్ బాగర్స్ సినిమా చూస్తున్నారు. సినిమా చూస్తూ మధ్యలో ఎడ్వర్‌టైజ్‌మెంటు వచ్చినప్పుడు ''జార్జి పెప్పర్డ్ బావుంటాడు కదూ!'' అంది పార్వతి ఆస్ట్రేలియా వచ్చిన ఏడాది అయినప్పటినుంచి వెస్టర్నర్స్‌లోని అందాలు పార్వతికి అర్థంఅవటం మొదలైంది. శంకరరావుకి పాశ్చాత్యుల అందాలఎట్ల ఆకర్షణ ఇండియాలోనే కలిగింది పార్వతి అల్లా అనగానే ''ఇంకా ఎవరు బావుంటారుట ?'' అని అడిగాడు వ్యంగ్యంగా అతని ధోరణిని అర్థంచేసుకొని పార్వతి వెంటనే,

''పాల్‌న్యూమన్ బావుంటాడు'' అంది.

''అమ్మాయిగారికి దొరలు నచ్చుతున్నారే ఈమధ్య!''

అప్పుడు పార్వతికి అర్థమైంది, శంకరరావు మాట.

''మీకు సోఫియాలారెన్, రాకెల్ వెల్ష్, లీజీటైలర్ నచ్చడంలా అంతే!''

శంకరరావులోని మగవాడు బుసలుకొట్టాడు. శంకరరావు దృష్టిలో కామం వుంది. పార్వతికి అందంపట్ల ఆరాధనేనా తనకిలాగా మోహం కూడా వుందా అన్న అనుమానం పట్టుకొంది. అప్పటికింక శంకరరావు మాట్లాడలేదు.

మరో పదిరోజులకి టి వి. లో పాల్‌న్యూమన్ సినిమా చూస్తూ ''మా హెడ్‌మాస్టర్, పాల్‌న్యూమన్‌లా వుంటాడుకదూ!'' అంది.

''ఏమో నాకల్లా అనిపించలేదు అయితే నీ కళ్ళకి మీ హెడ్‌మాస్టర్ చాలా అందగాడులా కనిపిస్తాడన్నమాట.''

''నేనల్లా అనలేదు.''

''ఆమధ్య పాల్‌న్యూమన్ బావుంటాడన్నావు! ఈరోజు మీ హెడ్‌మాస్టరు, అతగాడిలా వుంటాడని అన్నావు! అంటే అర్థం ?''

''అన్నాను. అయితే ?''

''ఏమీలేదు నీ కళ్ళకి మీ హెడ్‌మాస్టర్ పెద్ద హాలీవుడ్ స్టార్‌లా వుంటాడన్నమాట.''

''ఏం మీకు మనింట్లో పన్చేసిన పని మనిషి దుర్గ, జమునలాగా కనిపించలేదూ ?''

ఇండియాలో వుండగా ఒకసారి శంకరరావు అనాలోచితంగా ''ఈ దుర్గకి పన్నుమీద పన్ను

ప్రణయలోకి రాజధాని

—డాక్టర్ దాశరథి

అఖిల జగజ్జనావళికి
హనీమూన్ రాజధాని
నయాగరా జలపాతం
నవ దంపతి తొలి గీతం

అర్ధ చంద్ర రూపం గల
అతి సుందర జలపాతం
ఎగజిమ్మే తుంపరలో
సొగసైన హరిచాపం

జలపాతం, హరిచాపం
కలిసి మెలిసి వుంటాయి
యెండ మాయమవగానే
యెడబాటును పొందుతాయి

యెన్ని జంట లిచట కలిసి
యెన్ని కలలు కన్నారో ?
కలలు నిజము కానప్పుడు
యెంత వ్యధితులైనారో

హిమగీతం పాడుతుంది
ఇక్కడి శీతల వాతం
చలి నెదిరించుటకోసం
చెలి మనసు వెతుకుతుంది

తేనె చందమామ వచ్చి
మౌనంగా నవ్వినపుడు
ఎన్ని తీపి నేరాలో !
ఎన్ని చేదు సత్యాలో !

ప్రతి మాటకు ఈ పూట
ప్రణయమనే అర్థమే;
ప్రతి బాటకు ఈ చోట
హృదయమొక్క గమ్యమే

దూర ప్రాంతాలవారు
చేరువగా వస్తారు,
హృదయాల్లో ప్రమోదాలు
మైమరచిన, ప్రమాదాలు !

రెండు గుండె లొకటిచేయు
దండివాగు, నయాగరా;
అది కన్నుల ముందుంటే
కదలలేము నసేమిరా

మహా ప్రకృతి కావ్యానికి
మరో సిరా నయాగరా
చైతన్య స్వాంతానికి
సంకేతం నయాగరా.

జమునకిలాగా వుందికదూ !'' అన్నాడు పార్వతితో

''దుర్గ మీ కళ్ళకి జమునంత అందంగా వుందా ?''

''అల్లా అనలేదు పన్ను విషయంలో పోలిక చెప్పాను ''

''అల్లా వుండటంవల్లనే జమున చాలా అందంగా వుంటుందన్నారుగా ఓసారి ?''

''అన్నాను ''

''అయితే దుర్గ కూడా వుండివుండాలి మీ కళ్ళకి ''

శంకరరావు జవాబు చెప్పలేదు.

''పని మనిషికి జమునకి పోలికేమిటి నామొహం ?''

''పని మనిషి అందంగా వుండకూడదా ? ఎమ్మేలు బియ్యేలు పాసైతేగాని మనుషులు అందంగా వుండరా ?''

''పని మనుషుల్లో అందాల్ని చూడగలిగే మీ టేస్టుని మెచ్చుకొంటున్నాను. మగవాళ్లకి పనివాళ్ళు, పాకీవాళ్ళు నచ్చుతారు అదేం ఖర్మో !''

''ఆడవాళ్లకి ఎవరు నచ్చుతారుట ?''

''మాకు నచ్చినా మాకంటే గొప్పవాళ్ళు నచ్చుతారు. రాజకుమారుళ్ళు నచ్చుతారు ''

''రాజకుమారుడికి మీరు నచ్చుద్దూ? ఒకవేళ నచ్చితే అతడితో ఎవరైనా రాజకుమార్తె 'ఛీ! ఛీ! మీకు సాధారణపు ఆఫీసర్ల కూతుళ్లలో అందాలెల్లా కనిపిస్తాయి ? అంత ఘోరమైన అభిరుచి ఏమిటి మీది ? మాకైతే ఏ చక్రవర్తి కొడుకోగాని నచ్చడు' అంటారనుకొంటా ''

''మీదంతా వితండవాదం.''

''కాదు పార్వతీ ! నువ్వన్న మాటల్లోనే ప్రశ్నా జవాబు కూడా వున్నాయి. ఆడదెప్పుడు పైకి చూస్తుంది మగవాడెప్పుడు కిందకి చూస్తాడు ఆడపిల్ల పై అంతస్తువాడిని పెళ్లి చేసుకోవాలనుకొంటుంది మగపిల్లాడు తనకంటే కింది అంతస్తు పిల్లయితే అణుకువగా వుంటుందని అనుకొంటాడు. ఇది సాధారణం. ఆడది

ఆకర్షణ - వ్యామోహం

ఆరాధించేవాడికి తనని అర్పించుకొంటుంది మగవాడు తనకి లభ్యమౌతుందనుకున్న స్త్రీ చుట్టూ తిరుగుతాడు. తనకంటే అధికురాలైన స్త్రీ ఆమె కంటే అధికుడైన పురుషుడ్ని తప్ప మరొకడిని గమనించదన్న విషయం అతనికి గుర్తుంటుంది. అందుకే తనకంటే కిందంతస్తులో వున్న స్త్రీలే తనకేసి చూస్తూవుంటారనికూడా అతనికి తెలుసు దుర్గకేసి నేను చూసినా, నీకేసి రాజకుమారుడు చూసినా అందుకే !''

''మీవన్నీ నీచ భావాలు. అన్నింటికి అసహ్యమైన అర్థాలు చెప్తారు. మీతో మాట్లాడటం నాదే తప్పు'' అంది

ఈరోజు ఇవన్నీ శంకరరావుకి గుర్తు వస్తున్నాయి. స్కూల్లో పనిచేస్తున్న పార్వతికి, హెడ్ మాస్టరు పై స్థానంలో వున్నవాడు పార్వతి చూపుల కోణంలో అతనుంటాడు. అతను పార్వతితో చొరవ తీసుకోడం మొదలుపెడ్తే పార్వతి అభ్యంతరం చెప్పకపోవచ్చును. ఈ దేశంలో భార్యాభర్తలు విడిపోడం అంత తప్పుగా పరిగణించరు. విడిపోకపోవడం గొప్పగా భావించినా ! అవకాశాలు మనుష్యుల్ని మారుస్తాయని అంటారు భారతదేశంలో తప్పటడుగు వెయ్యడానికి జంకే స్త్రీకి విదేశాల్లో మారిన వాతావరణంలో జంకు కొంచెం తగ్గవచ్చు. అందరు అంత మారకపోవచ్చు! కాని కొంత మారవచ్చు. కనీసం సతీసావిత్రిని ఆరాధించని దేశంలో, ఆ విలువలు వినిపించని దేశంలో పాతివ్రత్యం జీవితానికో పరమావధికింద అనిపించకపోవచ్చును. షీల తనతో ఇండియాలో ఆవిధంగా మాట్లాడివుండేదికాదు ! పార్వతిని ఓ కంట కనిపెట్టాలి. ఇవాళ వాళ్ల హెడ్మాస్టర్ పార్వతిని డ్రాప్‌చేసే జంక్షన్‌లో నిలబడి వాళ్ల మధ్య ఎంత చనువుందో గమనించాలి !

శంకరరావు నిర్ణయించుకొన్నాడు !

శంకరరావు ఆరోజు సాయంత్రం రోజూ హెడ్మాస్టర్ పార్వతిని దింపే చోటుకి చేరుకొన్నాడు కొంచెం దూరంలో షాపుల దగ్గర నిలబడ్డాడు వాళ్లిద్దరు తనక్కడ ఉంటాడని ఊహించరు అందుకని శ్రమపడి మీసాలు గడ్డాలు పెట్టుకోవాల్సిన అవసరం లేకుండానే వాళ్లని గమనించవచ్చు

శంకరరావు కారు దూరంగా పార్క్ చేసి పైపు కాలుస్తూ నిలబడ్డాడు సిగెరెట్లు, చుట్టలు ఖరీదని శంకరరావు పైపు అలవాటు చేసుకొన్నాడు ''మీరు పైపు కాలుస్తుంటే డిటెక్టివ్ పుస్తకాల్లో వచ్చే డిటెక్టివ్‌లలాగ అనిపిస్తారు'' అని పార్వతి వేళాకోళం చేస్తూ ఉంటుంది. ఇవాళ తను స్పైయింగ్ నిజంగానే చేస్తున్నాడు

హెడ్మాస్టర్ కారు వచ్చి ఆగింది పార్వతి సీటు బెల్టులు విప్పుకొంటుంటే హెడ్మాస్టర్ ఆమె మీదుగా వాలి తలుపు తెరిచాడు పార్వతి దిగి నవ్వుతూ ఏదో అంది. హెడ్మాస్టర్ నవ్వుతూ కారు తలుపు వేసుకొన్నాడు. అతను పార్వతి చెయ్యి, తను షీల చెయ్యి నొక్కినట్టు నొక్కాడో లేదో శంకరరావుకి కనిపించలేదు.

పార్వతిని కొంచెం ముందుకు సాగనిచ్చి వెనక నుంచి కారులో బయల్దేరి ఆమెను కలుసుకొన్నాడు. పార్వతి పక్కగా కారు ఆపి ఎక్కమన్నాడు.

''ఇల్లా వచ్చారేం ?'' అని అడిగింది పార్వతి

''పనుండి'' అని శంకరరావు ముక్తసరిగ సమాధానం ఇచ్చాడు

ఇటువేపు షీలకు ఏదైనా పనుంటే శంకరరావు షీలను తీసుకువచ్చాడా ? అని ఆలోచించటం మొదలుపెట్టింది పార్వతి.

తను వాళ్లిద్దరి భాగవతం చూసుంటాడా చూసుండడా అని పార్వతి సతమతమౌతోంది అనుకొన్నాడు శంకరరావు.

ఇద్దరి మనస్సుల్లోను ఎదుటివారిని గురించిన అనుమానమే ! అవతలవాళ్లకి, తనమీద అనుమానం కలిగి ఉండవచ్చునని ఇద్దరికి తట్టలేదు

12

ఆకర్షణ - వ్యామోహం

శంకరరావుకి చికాకులెక్కువయ్యాయి. వచ్చి రెండేళ్లయింది రిసెర్చి మానుకొని వెనక్కు పోదామా అనుకొన్నాడు బేబీసిట్టర్ కొడుకు హరీ పుణ్యభూమిలో జీవితం గడపాలనుకొని కొద్దిగా డబ్బు కూడబెట్టుకొని ఇండియా వెళ్లిపోయాడు

"ఉన్న డబ్బు కాస్త ఖర్చయితే వీడి మొహం ఎవరు చూడరు. డిసిప్లెన్ వాత వీడు పడ్డప్పుడు ఈ హరేరామ హరేకృష్ణ గురువులెవ్వరు మావాడి సంగతి పట్టించుకోరు. డబ్బులేని విదేశీ శిష్యులు పబ్లిసిటీకి కూడా పనికిరారు అప్పుడు అమ్మా నాన్నా అంటూ కేబుల్ యివ్వకపోడు ఇండియన్ లంటే ఏమిటో అనుకొంటున్నాడు. సంజయ్‌ని చూస్తే చాలు మీ నేషనల్ కారెక్టర్ తెలుస్తుంది తిరిగినన్నాళ్లు మరియన్‌తో తిరిగి, తన కంపెనీ పూర్తిగా ఎంజాయ్‌చేసి, పెళ్లి చేసుకోడానికి వర్జిన్ తప్ప పనికిరాదుట ఇండియా వెళ్లాడు చదువుకొన్న మీ దేశీయులే అంత వక్రంగా ఆలోచించేవాళ్లయినప్పుడు, అంతమంది ఇల్లిటరేట్, బార్బరిక్ పీపుల్ మధ్య హరీ గడ్డి తింటాడు అప్పుడు నా మాటలు గుర్తుకువస్తాయి శంకూ! అయామ్ సారీ! మీమాట కాదు. మిగిన ఇండియన్ల మాట మీలాంటివాళ్లు అరుదు మీరు బాబుకి వేరే బేబీసిట్టర్‌ని చూసుకోండి! కొన్నాళ్లపాటు నాకు విశ్రాంతి కావాలి" అంది జోన్.

కొత్త బేబీసిట్టర్ దగ్గర మాలిమి అవక వెళ్లనని పేచీపెట్టడంతో మధ్యలో పార్వతిగాని శంకరరావుగాని సెలవుపెట్టి బాబుని చూసుకోవాల్సి ఎస్తోంది అవతలివాళ్లు "ఇవాళ నాకు కుదరదు" అన్నప్పుడు ఇవతలవాళ్లు అనుమానాల్లో పడుతున్నారు

"ఇవాళ శీలని డ్రాప్‌చెయ్యాలి కాబోలు!" లని పార్వతి, "ఇవాళ హెడ్‌మాస్టర్‌తో ఎంగేజ్‌మెంట్ వుందన్నమాట" అని శంకరరావు అనుకోడం మొదలుపెట్టారు

ఎవరి దృష్టిలో వాళ్లు అవతలవాళ్లకంటే తాము పవిత్రులమే ననుకోడం మొదలుపెట్టారు. దూరంగ వున్నటువంటి ఇక్కడ ఎవరూ పట్టించుకోని వెంకటేశ్వరస్వామి, విఘ్నేశ్వరుడు మొదలైన ముక్కోటి దేవతలమీద నమ్మకం పోయిందిద్దరికీ. చిన్నప్పటినుంచీ తమ జీవితాన్ని ఏవిధంగా తీర్చిదిద్దని యెహోవా యేసుక్రీస్తుల మీద గురి ఏర్పడలేదు. దాంతో వారిలో ఒక విధమైన నాస్తికత్వం చోటుచేసుకొంది ఎప్పుడైతే దేవుడిమీద నమ్మకం పోయిందో నీతిమీదా పోయింది. పాపభీతి పోయింది భయంవల్ల ఏర్పడే నమ్మకాలన్నింటిలాగానే భయం పోగానే నమ్మకం పోయింది. పాత విలువలు కొట్టుకు పోయాయి. నాస్తికత్వం ఒక ఆచరణ విధానంగా చేసుకొనేవాళ్లు ప్రతిపాదించే కొత్త విలువలు ఏవో తెలియవు అంచుకని అవి అంటుకోలేదు. నాస్తికత్వానికి దేవుడిమీద నమ్మకం పోడం సంపూర్ణ నిర్వచనం కాదని, నా జీవితానికి నేనే కర్తను అనుకొని సంపూర్ణ ఆత్మ విశ్వాసంతో, అన్నిటికి వాడే ఉన్నాడనే స్తబ్దతనుంచి తేరుకొని, జీవితంపట్ల శ్రద్ధతో మసులుకోడంగా నాస్తికులు తీసుకొంటారన్న విషయం అతనికి తెలియదు.

శంకరరావుకి దేవుడిమీద నమ్మకం పోగానే అవినీతిపట్ల ఆసక్తిని అరికట్టే బలం తగ్గిపోయింది. అయితే పురుషులు, స్త్రీలు కలిసి మాత్రమే కొన్ని అవినీతి పనులు చెయ్యగలరు విడిగా చెయ్యలేరు తను పురుషుడు. తను వ్యభిచరించడానికి మరో స్త్రీ కావాలి! వేశ్యలతో వ్యభిచరించాలని అనిపించడంలేదు తనకి. రోగాల పట్ల భయంవల్ల కావచ్చు. మరో స్త్రీ అంత సులభంగా దొరకదు. అంటే పురుషుడు కోరుకొన్నా అంత సులభంగా అతని కోరిక తీరదు. అదే స్త్రీకి పరపురుషుడిమీద కోర్కె కలిగితే, కోర్కె తీర్చుకోడం చాలా సులభం అడది అడగాలేగాని... అడగను కూడా అక్కర్లేదు... ఏమాత్రం సూచించినా చాలు ముందుకు వచ్చే మగవాళ్లు చాలామంది... తనలాంటివాళ్లు అంటే ఏమిటి తేంది? పార్వతి చెడిపోవడం, తను చెడిపోడంకంటే చాలా తేలిక! పార్వతి ఏమాత్రం అవకాశం ఇచ్చినా హెడ్‌మాస్టరో మరోడో తీసుకోడం తథ్యం కాని తను పార్వతి గురించి అంత నీచంగా ఆలోచిస్తున్నట్టు, పార్వతికి తెలియనివ్వలేదు! పార్వతి 'అదంతా మీ మనసులోని మలినం నేనేమి ఎరగనంటే' తనేం చెయ్యలేదు. తనకి ఋజువు లేదు, నమ్మకం తప్ప

తను శీలకి కాంప్లిమెంట్స్ ఇవ్వడం తప్ప ఇంతవరకు ఏమీ చొరవ తీసుకోలేదు. శీలతన్ని నిజంగా కోరుకొంటే ఏమో! లేకపోతే కొంప లంటుకుపోతాయి తన పరువు బజార్లోపెడ్తుంది తను శీల మనస్సు తెలుసుకోవాలి. పార్వతికి వాళ్ల హెడ్‌మాస్టరంటే ఉన్నట్టుగా శీలకి తనంటే ఎడ్మిరేషన్ ఉంటే మిగతాదంతా చూసుకోవచ్చు! ఈ విధంగా శంకరరావు ఆలోచనలు పరి పరి విధాల పోతున్నాయి.

పార్వతికి కూడా ఈమధ్య అనుమానపు ఆలోచనలు ఎక్కువయ్యాయి. ఈ ఆస్ట్రేలియాలో తామిద్దరు విడిపోరుకదా! మగవాళ్లు చెడిపోదల్చుకొంటే ఎవరాపగలరు? ప్రకృతి వాళ్లమీద ఏవిధమైన ముద్ర వెయ్యదు. సంఘం కూడా వాళ్ల తప్పుల్ని సులభంగా క్షమిస్తుంది ఈ పాశ్చాత్య దేశాల్లో కూడా, ఇతర స్త్రీల మోజులో పడ్డ భర్త కొన్నాళ్లకి తప్పయి పోయిందంటూ లెంపలు వేసుకొంటే భార్య చేతులు జాపి ఆహ్వానిస్తుంది ఇక్కడ స్త్రీలు తప్పు చేసినా భర్తలు క్షమిస్తారేమోకాని స్త్రీలు సాధారణంగా తప్పులు చెయ్యరు.

ఈయన శీల మోజులో పడ్డాడు శీల ఈయనతో బహుశః కొన్ని హద్దులుదాటి ప్రవర్తించదు. కాని ఈయన దాటి శీలను బలవంతంచేస్తే శీల ఆ క్షణంలో అడ్డుకోగలదా? కృష్ణ చూస్తూ ఎందుకు ఊరుకొంటున్నాడు? ఇందులో కృష్ణ భాగం ఏమన్నా వుందా? ఈయన్ని శీలతో తప్పటడుగు వెయ్యనిచ్చి బ్లాక్‌మెయిల్ చేస్తాడా? చేస్తే ఏవిధంగా చేస్తాడు? తనని కృష్ణ కోర్తాడా? అయినా ఇదంతా తన ఊహేనేమో శీలను కృష్ణ కేకల వేస్తూనేవున్నా శీల వినకుండా అల్లా ప్రవర్తిస్తుందేమో!

తనతో ఎవరైనా ఎందుకు మిస్ బిహేవ్ చెయ్యరు? ఇండియన్ విమెన్ చాలా పవిత్రంగ వుంటారని వాళ్లు చాలా వినివుండి ధైర్యం చెయ్య రేమో! లేక ఇండియన్ ఆడవాళ్లు వాళ్లకి నచ్చరా! అయినా వాళ్లకేం ఖర్మ! ఆస్ట్రేలియన్ పురుషులకి వాళ్లవాళ్లే బోలుడుమంది దొరుకుతారు తనెందుకు వాళ్లకి? ప్రాబ్లెమ్స్ క్రియేట్ అవడానికి తప్పించి! పోతే ఇండియన్ మగవాళ్లెవరైనా తనతో స్మార్ట్‌గా బిహేవ్ చేస్తే చెయ్యవచ్చు. కాని ఇక్కడున్న ఇండియన్సులోకి శంకరరావే బావుంటాడు. కృష్ణ ఫరవాలేదు.

ఏమైనా తనకి చెడిపోయే అవకాశం తక్కువ శంకరరావుకి ఎక్కువ ఇద్దర్లోను అతను చెడిపోయి తను మంచిగా వుండి, అతనిని తిరిగి చేతులుచాచి తను ఆహ్వానించాల్సివచ్చే పరిస్థితి, రానీయకుండా జాగ్రత్తపడాలి తను.

ఆవిధంగా శంకరరావు, పార్వతి ఒకపక్కన సంసారాన్ని నిలబెట్టుకోడానికి ప్రయత్నం చెయ్యసాగారు.

పార్వతి శంకరరావులు ఒకరిమీద మరొకరు నిఘా ఉంచడం మొదలుపెట్టారు. ఇంట్లో శాంతి కరువైంది. శంకరరావు తనకి శీలకి మధ్య ఏమీ జరగలేదని, ఏమీ జరగనిదానికి తను చెల్లిస్తున్న మూల్యం చాలా ఎక్కువని అనుకోడం మొదలుపెట్టాడు. అశాంతి ఎల్లాగో ఉంది! ఏమైనా ప్రతిఫలం పొందాలి. అన్న నిర్ణయానికి వచ్చాడు.

ఒక రోజు శీలకి "నీతో కొంచెం ఏకాంతంగా మాట్లాడాలి ఎక్కడకి రాను?" అంటూ ఫోను చేసాడు.

"మనిద్దరికి అంత వ్యక్తిగతమైన విషయాలే మున్నాయి? ఫోనులో చెప్పు శంకూ!" అంది శీల

"ఫోనులో చెప్పను!"

"నేనెక్కడకి రాను కృష్ణకి తెలిస్తే ఇంకేమన్నా ఉందా?"

శీల విషయం తేలిపోయింది. శీల తనతో ఆడుకొంది. తను వెర్రివెధవయ్యాడు ఇల్లా అనుకొని శంకరరావు, పార్వతితో మళ్లీ అభిమానంగా ఉండటం మొదలుపెట్టాడు. ఒక రోజున సాయింత్రం, శీల వచ్చింది శంకరరావుని చూసేందుకు. అవీ ఇవీ మాట్లాడుకొన్నాక, "నన్ను కొంచెం ఇంటి దగ్గర దింపుతావా?"అని అడిగింది.

శంకరరావు ఇప్పుడిప్పుడే తనపట్ల చికాకు తగ్గించుకొని సరదాగా ఉంటున్నాడు. మళ్లీ ఈ రోజు ఈ మహాతల్లితో శంకరరావుని ఒంటరిగా వదిలేస్తే మళ్లీ మొదటికి వస్తుంది అనుకొని "నేను వస్తాను అక్కడ మిల్క్‌బార్‌లో బ్రెడ్ అవీ కొనుక్కోవాలి" అంది. అని శీల మొహంలో అసంతృప్తి చూసి తృప్తిగా నవ్వుకొని బాబుని తీసుకొని బయల్దేరింది. శంకరరావు కారు తీసాడు అందరు కారెక్కారు కారు రోడ్డెక్కింది

[ఇంకా వుంది]

సినిమా విశేషాలు

జనవరి 14న రావణుడే రాముడయితే

లక్ష్మి ఫిలిమ్స్ కంబైన్స్ శ్రీ అక్కినేని ... శ్రీ దాసరి కాంబినేషన్‌లో రూపొందిస్తున్న "రావణుడే రాముడయితే" స్కోప్ వర్ణ చిత్రం... సంక్రాంతి శుభదినాన విడుదల కాగలదని, నిర్మాత ఎస్ ఆర్ అనురాధాదేవి తెలిపారు.

సాఫ్ట్ మరియు సటిల్ పాత్రలలో అద్వితీయుడు అనిపించుకుంటున్న శ్రీ అక్కినేని యీ చిత్రంలో "అగ్రసిల్" పాత్రను పోషించారు

"అక్కినేనిగారి పాత్రలో ఎంత కొత్తదనం కానవస్తుందో, 'షావుకారు' జానకిగారి పాత్రలో అంత వైవిధ్యం వుంటుంది", అన్నారు దర్శక... కథకుడు శ్రీ దాసరి

"రావణుడే రాముడయితే" స్కోప్ వర్ణ చిత్రంలో జయచిత్ర, లత నాయిక పాత్రలను పోషించారు తతిమ్మా పాత్రలను మోహన్‌బాబు, అల్లురామలింగయ్య, ప్రభాకరరెడ్డి, మాడా, కె వి చలం మరియు మురళీమోహన్ పోషించారు

ఈ చిత్రానికి జి. కె వెంకటేష్ సంగీతాన్ని, కె. ఎస్. మణి ఛాయాగ్రహణాన్ని, బాలు కూర్పును, శాస్త్రి .. రాధాకృష్ణ సహకార దర్శకత్వాన్ని నిర్వహించారు

కన్నడంలో....
తెలుగులో చిత్ర నిర్మాణం

లక్ష్మి సినిమాస్ కంబైన్స్ అధినేత శ్రీమతి అనురాధాదేవికి మరో కొత్త కోరిక ఉదయించింది అదేమిటన — కన్నడంలో. .తెలుగులో ఒక చిత్రాన్ని శ్రీ దాసరి దర్శకత్వంలో నిర్మించడం.

మైసూరు "లలిత మహల్"లో ఒకే షెడ్యూలులో రెండు భాషల చిత్ర నిర్మాణాన్ని పూర్తిచెయ్యడానికి, శ్రీ దాసరి అంగీకరించినట్టు తెలిసింది.

"బీస్‌సాల్‌బాద్" వంటి చిత్రాన్ని తీస్తే ఎలా వుంటుందని, శ్రీ దాసరి అడిగారట. "వెరీగుడ్ ఆయిడియా" అని శ్రీ విజయకుమార్ సమర్థించారట.

అక్కినేనితో
విశ్వదాభిరామ వినురవేమ

1979 ఆగస్టు .. సెప్టెంబరు మాసాలలో శ్రీ అక్కినేని కథానాయకుడుగా, శ్రీ దాసరి దర్శకత్వంలో "విశ్వదాభిరామ వినురవేమ" రూపొందగలదని, లక్ష్మి ఫిలింస్ కంబైన్స్ నిర్మాత తెలిపారు.

జనవరి 7న "ముద్దుల కొడుకు"

మంచి చిత్రాలు కావాలి అని ఆశించే ప్రేక్షకులకు.. పటిష్టమైన కథాబలం వున్న చిత్రాన్ని... జగపతి అధినేత శ్రీ వి బి. రాజేంద్ర ప్రసాద్ రూపొందిస్తున్నారు

చిత్రం పేరు "ముద్దుల కొడుకు "మకుటమే ఎంత తియ్యగా వుందో చూశారా!

ఈ వర్ణ చిత్రంలో శ్రీ అక్కినేనికి రొమాన్సుతోబాటు "పెర్‌ఫారమెన్స్" కూడా వుంది. జయసుధ ... శ్రీదేవి అక్కినేనిగారి సరసాంగులు. మురళీమోహన్ . . గుమ్మడి ప్రధాన పాత్రధారులు

జనవరి 7న ప్రారంభమయ్యే "ముద్దుల కొడుకు" వర్ణ చిత్రానికి మహదేవన్, సత్యానంద్, సెల్వరాజ్, కృష్ణారావు, సంజీవి ముఖ్య సాంకేతిక సారధులు

మార్చి 15తో షూటింగు పూర్తిచేసుకునే "ముద్దుల కొడుకు" చిత్రాన్ని... ఏప్రిల్‌లో అన్నపూర్ణా ఫిలింస్ విడుదల చేస్తుంది.

జగపతి రాజేంద్రప్రసాద్
నిర్మిస్తున్న తమిళ చిత్రం

తెలుగులో అఖండవిజయాన్ని చవిచూస్తున్న "కటకటాల రుద్రయ్య" చిత్రాన్ని, జగపతి శ్రీ వి. బి. రాజేంద్రప్రసాద్ తమిళంలో నిర్మిస్తున్నారు

శివాజీగణేశన్ ప్రధాన పాత్రను పోషించే తమిళ ప్రతికి "పట్టాకత్తి భైరవన్" అని పేరిడినట్టు దర్శక...నిర్మాత శ్రీ రాజేంద్రప్రసాద్ తెలిపారు.



'ఆడదంటే అలుసా?'లో జయమాలిని, కె వి. చలం



సినిమా

శ్రీదేవి కథానాయికగా నాలుగు తెలుగు చిత్రాలు

తమిళంలో ''నెంబర్ వన్'' స్థానాన్ని అనుభవిస్తున్న శ్రీదేవి ... యిప్పుడు తెలుగు రంగంలో కూడా అగ్రశ్రేణి స్థానాన్ని ఆర్జించగల వాతావరణం కనిపిస్తోంది.

కొత్త సంవత్సరంలో ప్రారంభం కానున్న నాలుగు పెద్ద సంస్థలలో... శ్రీదేవి నటించడం, గమనార్హం.

జగపతి ఆర్ట్ పిక్చర్స్ నిర్మిస్తున్న ''ముద్దుల కొడుకు'', సురేష్ ప్రొడక్షన్స్ నిర్మించనున్న చిత్రం, విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ ప్రారంభిస్తున్న కొత్త చిత్రం, జయప్రద కంబైన్స్ తలపెట్టిన చిత్రం.

''అంగీకరించినవి నాలుగు; చేస్తానని మాట యిచ్చినది మరో ఆరుగురికి'' అంది, తమిళంలో మూడు షిప్టులు పని చేస్తున్న శ్రీదేవి.

తమిళ చిత్ర రంగంలో శివాజీ... రజనీ... కమల్ వంటి వుత్తమశ్రేణి కథానాయకులతో నటించడంవల్ల... శ్రీదేవి నటన చిత్ర చిత్ర ప్రవర్ధమాన మవుతున్నది.

''పుత్తడిబొమ్మ'' లాంటి శరీరసోయగం వున్న శ్రీదేవికి... తమిళంలోవలె... తెలుగులో కూడా ప్రేక్షకాదరణ లభించాలని, యీ కలం కోరుతూంది.

గోవాలో మురళీ లతల ప్రేమవిహారం

విఖ్యాత దర్శకుడు శ్రీధర్ రంగులలో రూపొందిస్తున్న శృంగార చిత్రం ''ఊర్వశీ ... నీవే నా ప్రేయసీ''కి గోవాను అవుట్‌డోర్ వెన్యూగా ఎంపికచేశారు, నిర్మాత శ్రీ భరణిరెడ్డి.

యువ హృదయాలను ఆకర్షించే అన్ని అంశాలు గల యీ వర్ణ చిత్రానికి ఇళయరాజా సంగీతాన్ని, వసంతకుమార్ రచనను సమకూర్చారు.

డిశంబరు 4 నుంచి 10 రోజులపాటు గోవాలో జరిగే షెడ్యూలుతో చిత్ర నిర్మాణం పూర్తి అవుతుందని, దర్శక ... కథకుడు శ్రీధర్ తెలిపారు.

గోవాలో కొన్ని పాటల చిత్రీకరణ ... పతాక సన్నివేశ చిత్రీకరణ జరుగుతుంది.

గోవా షెడ్యూలులో పాల్గొనే నటీనటులు :- మురళీమోహన్, లత, సుభాషిణి, శరత్‌బాబు, నాగేష్, రావికొండలరావు, గోకిన రామారావు.

శోభన్ చిత్రానికి బోయిన దర్శకత్వం

''మొనగాడు'' చిత్రాన్ని అందించిన, ''పా. పున్నమ్మ'' చిత్రాన్ని సమర్పించిన విశాఖపట్నం వాస్తవ్యులు శ్రీ టి. త్రివిక్రమరావు... యీసారి ఒక వుత్తమ కథాబలం వున్న చిత్రాన్ని నిర్మించడానికి నిర్ణయించారు.

తమిళంలో ''శివాజీ ... సుజాత'' నటించిన ''అన్నన్ వొరు కోయిల్'' చిత్రాన్ని, శోభన్ ... జయసుధలతో తెలుగులో తలపెట్టి... డిశంబరు 16న ముహూర్తం నిశ్చయించారు.

సురేష్ సంస్థ తయారుచేసిన యువ తేజస్వి శ్రీ బోయిన సుబ్బారావును, విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ అధినేత దర్శకుడుగా ఎంపిక చేశారు.

''అన్నయ్యను దేవుడుగా ఎంచిన ఒక చెల్లెలు; చెల్లెలి సుఖ సంతోషాల కోసం అనుక్షణం ప్రార్థించిన అన్నయ్య''— ఈ అంశంపై అల్లబడిన ''అన్నా చెల్లెలు'' కథే, శ్రీ త్రివిక్రమరావు చిత్ర కథ. ఈ కుటుంబగాథా చిత్రానికి సత్యానంద్ రచనను, మహదేవన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

లక్ష్మి ఫిలింస్ ద్వారా విడుదలయ్యే విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్‌కు...సెంటిమెంటల్ కథ లభించడం, శుభసూచకం.


పెరుగుతున్న సంవత్సరాలు

కాల్షియం-శాండోజ్®

సంవత్సరాలు








పాప పుట్టక ముందు నుంచే, పాప యొక్క పళ్ళూ ఎముకలూ రూపొందటం మొదలెడతాయి. పసిదనం నుంచీ, పెరిగే వయస్సులో అంతా కూడా కాల్షియం ఎంతో కీలకమైనది.

మీ పాపకి గనక, పెరుగుతూన్న ఏ దశలోనైనా సరే, అవసరమైనంత కాల్షియం లభించకపోతే, తరవాత ఎంత యిచ్చినా ప్రయోజనం ఉండదు. అందుకే నేడే మీ పాపకు కాల్షియం-శాండోజ్ యివ్వడం మొదలెట్టండి. రోజుకు నాలుగు కాల్షియం-శాండోజ్ బిళ్ళలు గనక యిస్తే, అవి పెరిగే దశలోని ఆ ఏళ్ళలో అత్యవసరమైన కాల్షియంను సమకూర్చి, గట్టిపళ్ళనూ, పటిష్టమైన ఎముకలనూ రూపొందిస్తాయి. విటమిన్ సి, డి మరియు బి[12]తో పటిష్టం చేయబడిన కాల్షియం-శాండోజ్ బిళ్లల్లో, పిల్లలకి యిష్టమయ్యే రుచిగల వెనీలా సువాసన ఉంది.


కాల్షియం-శాండోజ్ స్విట్జర్‌లాండ్‌లోని శాండోజ్ వారు రూపొందించినది, ప్రపంచంలోని అత్యుత్తమమైన కాల్షియం.




కాల్షియం-శాండోజ్®

గట్టిపళ్ళు, పటిష్టమైన ఎముకల కోసం

SANDOZ


అద్వితీయ
విమల్ సూటింగ్ లోని
నాణ్యతకు, ఆకర్షణకు
మూలకారణం -
క్వాలిటీ యార్న్ దగ్గర్నుంచి
తయారైన సూటింగ్ వరకు
అడుగడుగునా అనేకమైన
కఠిన పరీక్షలకు గురవుతుంది
విమల్ సూటింగ్.
విమల్ సూటింగ్‌ను
మీరు పరీక్షించి చూడండి,
మీకు నచ్చుతుంది.
VIMAL®
A RELIANCE PRODUCT
సూటింగ్స్
భారత దేశంలోని అత్యంత ఆధునికమైన
టెక్స్‌టైల్ మిల్లు వారి ఉత్పాదన



విమల్

సినిమా

కవిత ఎంత పెరిగింది ?

కవిత ఆర్ట్స్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న '(ప్రెశిడెంటు పేరమ్మ'' వర్ణ చిత్రం ... రెండవ షెడ్యూలును ప్రవేశించింది

రాజమండ్రిలో జరిగిన తొలి షెడ్యూలును... మదరాసులో ముఖ్యులు కొందరు చూశారు కవిత నటిగా ఎంత పెరిగింది అని ఆశ్చర్యాన్ని ప్రకటించారు ఆమెకు రాజయోగాన్ని ప్రసాదించగల పాత్రగా పేర్కొన్నారు కొన్ని సన్నివేశాలలో ''అగ్రనటి''వలె వుందని ప్రశంసించారు

పైన ఉదహరించిన వాక్యాలను 'పేరమ్మ''తో చెప్పాను. ఆమె కళ్లంట ఆనందబాష్పాలు వచ్చాయి నిర్మాత శ్రీ డి. వి. ఎస్ రాజుకు, దర్శకులు శ్రీ విశ్వనాధ్‌కు కృతజ్ఞత తెలిపింది

నిర్మాతగా విజయకుమార్

లక్ష్మి ఫిలింస్ కంబైన్స్ నిర్మాతలకు ఆత్మబంధువు వారి చిత్రాల నిర్మాణంలో తోడ్పాటు నిచ్చే శ్రేయోభిలాషి అయిన శ్రీ విజయకుమార్, కొత్త సంవత్సరంలో కొత్త పదవిని చేబూనారు.

శివకామేశ్వరి ప్రొడక్షన్స్ అనేడి చిత్ర నిర్మాణ సంస్థను నెలకొలిపిన శ్రీ విజయకుమార్, విక్టరీ మధుసూదనరావుగారిని దర్శకుడుగా ఎంపిక చేశారు.

జనవరి నుంచి మూడు మాసాలలో చిత్రం పూర్తిగావడానికి వీలుగా కాల్‌షీట్లు ఎవరిస్తారో... వారు పాత్రధారులుగా వుండగలరని శ్రీ విజయ కుమార్ తెలిపారు

ఒకే చిత్రంలో నలుగురు అగ్రనటులు?

హిందీ చిత్రరంగంలో మల్టీ స్టార్స్ పాల్గొనే చిత్రాలు, అత్యధిక సంఖ్యలో నిర్మాణం అవుతున్నాయి ఈమధ్య ఒక నిర్మాత నలుగురిని తన చిత్రంలో ఎంపిక చేశారు చిత్రం పేరు ఏక్ ... దో ... తీన్ నటిస్తున్న అగ్రనటులు . దేవానంద్, శశికపూర్, ధర్మేంద్ర, రిషికపూర్ ఇలాంటి సంఘటన తెలుగులోకూడా జరిగే అవకాశం లేకపోలేదు.

కాషాయిదుస్తుల్లో మోహన్‌బాబు

ఆ రోజు శుక్రవారం, నవంబర్ 24వ తేదీ మోహన్‌బాబుగార్ని కలుద్దామని డేనియల్ స్ట్రీట్‌లో వుంటున్నవారి ఇంటికి వెళ్లాను ఇంట్లోకి అడుగు పెట్టగానే కాషాయి దుస్తుల్లో ఓ భారీ మనిషి నా కంటపడ్డాడు. వెనకగుండా చూడడంతో మనిషిని గుర్తుపట్టలేకపోయాను మోహన్‌బాబుగారు వున్నారా అని ఆ మనిషినే అడిగాను ''హలో రండి, రండి'' అంటూ ఆ మనిషే నన్ను పిలిచేసరికి, కాషాయ దుస్తుల్లో వున్నది మోహన్‌బాబే అని అప్పుడర్థమైంది. ''ఏమిటి ! కొత్తగా ఈ వస్త్రధారణ'' అనడిగాను. ''ఈసారి శబరిమలై వెళ్తున్నాను తొలిసారిగా చాలా కాలంగా వెళ్లాలనుకుంటుండగా, ఈరోజ కుదిరింది అందుకే ఈ వేషం'' అని నవ్వుతూ చెప్పారు మోహన్‌బాబు హిందీలో వినోద్‌ఖన్నా స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు మీరుకూడా ''నేను త్వరలో సన్యాసం పుచ్చుకుంటున్నాను'' అని అంటారేమో అనే కంగారు కలగడంతో ఈ ప్రశ్న అడిగాను ''మంచిపనే చేస్తున్నారు అయ్యప్ప ఆశీర్వాదం పొందిరండి'' అని చెప్పి వచ్చేశాను

వాహినీలో

6 గంటల తర్వాత శోభన్‌బాబు !

హీరో శోభన్‌బాబు రూజ్ ఎ ప్రిన్స్‌పుల్డ్ మాన్ కాలానికి, కర్తవ్యానికి ప్రాముఖ్యతనిస్తారు శోభన్ సాధారణంగా సాయంత్రం 6 గంటల తర్వాత ఏ షూటింగ్‌లోనూ పాల్గొనరు శ్రీ శోభన్‌బాబు నవంబర్ 23వ తేదీ వాహినీ స్టుడియోలో 7 గం ల ప్రాంతంలో శోభన్‌బాబుగారు కన్పించారు నాకు రోజ్ మిల్క్ కలర్ ఫుల్‌స్లాక్, బ్రౌన్ కలర్ ఫాంట్‌తో టక్ చేసుకుని, ధవళ వస్త్రాల్లో మెరిసిపోతున్న జయమాలినితో డాన్స్ చేస్తూ కన్పించిన శోభన్‌బాబుగార్నే అడిగేశాను నా సందేహాన్ని గూర్చి. ''యు ఆర్ రైట్ మై డియర్ ఫ్రెండ్ ఈ రోజు కరెంటు ఇస్తున్న ట్రబుల్ అంతా ఇంతా కాదు సాంగ్ పూర్తి కాలేదు సో ది కన్‌టిన్యువేషన్'' అన్నారు శ్రీ శోభన్‌బాబు.

సారథీ చిత్రం సాంగ్స్ ప్రొజెక్షన్

వాహిని "సి" థియేటర్లో తమ "ఇద్దరూ అసాధ్యులే" స్కోప్ కలర్ చిత్రం ప్రొజెక్షన్ వుందని ఆహ్వానం పంపారు శ్రీ సారథీ స్టూడియోస్ సంస్థ అధిపతులు శ్రీ జి. డి. ప్రసాదరావు, శ్రీ పి. శశిభూషణ్ నవంబర్ 23వ తేదీ, కరెక్ట్‌గా సాయంత్రం 6 గంటలకు ప్రొజెక్షన్ స్టార్ట్ చేసారు. "ఈ బ్రతుకే ఒక ఆట. ఇది దేవుడు ఆడే పిల్లాట, ఈ ఆటలో మనుషులు, మాకులు, పక్షులు బొమ్మలట" అనే టచింగ్ సాంగ్‌తో ప్రారంభమైన ప్రొజెక్షన్ "కూరకు తాళింపు, చీరకు జాడింపు" అనే హుషారు గీతంతో ముగిసింది. మధ్య, మధ్యలో పాడు కరెంటొకటి పానకంలో పుడకలా ఆగిపోయి, ఇన్‌స్పైరింగ్ మూడ్‌ను కాస్త ఇబ్బంది పెట్టిందనే చెప్పాలి. పాటల్లో సంక్రాంతి పాటకు ఎక్కువ ఓట్లు వెయ్యాలి. "చినుకు, చినుకు పడుతూ వుంటే" అనే కృష్ణ, గీత పాడే డ్యూయెట్టు టీనేజర్స్‌కు ఒక ప్రత్యేక ఆకర్షణ.

నావల్టీని చూపెట్టాలని ఆశించే నిర్మాతల్లో శ్రీ జి. డి. ప్రసాదరావు, శ్రీ పి. శశిభూషణ్‌లు కూడా ప్రముఖులు అనడానికి "ఇద్దరూ అసాధ్యులే" చిత్రంకోసం వారు నాగార్జునసాగర్ వద్ద నిర్మించిన కాస్ట్‌లీ బ్రిడ్జి ఒక్కటిచాలు. పులి, ఏనుగు, గుర్రం, కుక్క చేసిన సాహసాలు పదే పదే గుర్తుకొచ్చేవిధంగా వాటిని వాడుకున్నారు దర్శకుడు శ్రీ కె. ఎస్. ఆర్. దాస్.

హీరో కృష్ణ, రజనీకాంత్ యిద్దరు అసాధ్యులుగా నటిస్తున్న ఈ స్కోప్ వర్ణ చిత్రంలో గీత, మాధవి, కవిత, రాజీ, షావుకారు జానకి, గిరిబాబు, నాగభూషణం, అల్లు రామలింగయ్య తదితర తారాగణం. యస్. యస్. లాల్ (కెమెరా), మహారథి (రచన), సత్యం (సంగీతం) వెంకటేశ్వరరావు (కూర్పు), వి. కృష్ణమూర్తి (కళ) ఈ చిత్రానికి తెర వెనుక సాంకేతికబలం. ఈ చిత్రం జనవరిలో నవయుగ ద్వారా విడుదల.

నాయుడుబావ మైసూర్ ప్రయాణం

"నాయుడుబావ" శ్రీ శోభన్‌బాబు నవంబర్ 25వ తేదీ మైసూర్ బయల్దేరి వెళుతున్నట్టు తెల్సి, విశేషమేమిటని విచారించగా ఈ క్రింది విషయం బయటపడింది. జయమాలినితో నృత్యహేలలో పాల్గొనే నిమిత్తం వెళ్లారని, నవంబర్ 28న తిరిగివస్తారని తెల్సింది. శ్రీ శోభన్‌బాబు, జయమాలిని పాల్గొన్న ఆ నృత్యహేలను అతిత్వరలో వెండితెరమీద చూస్తారు మీరు. వెంకటేష్ ఎంటర్‌ప్రైజస్ నిర్మిస్తున్న "ఎంకి-నాయుడుబావ" స్కోప్ వర్ణ చిత్రంలోని ముఖ్యమైన సన్నివేశాల్లో పై సన్నివేశం కూడా ఒకటి. శ్రీ డి. రామానాయుడు సమర్పణలో తయారవుతున్న ఈ చిత్రం బోయిన సుబ్బారావు దర్శకత్వంలో తుది మెరుగులు దిద్దుకుంటూంది. ఎంకిగా కళాభినేత్రి వాణిశ్రీ నటిస్తూంది.

ఇది విన్నారా?

★ హిందీ "షోలే" చిత్రం 1975వ సంవత్సరం ఆగస్టు 15వ తేదీ బొంబాయిలోని మినర్వా థియేటర్లో విడుదలైంది. దాదాపు 150 వారాలుగా అదే థియేటర్లో అదే చిత్రం యింకా ఆడుతూవున్నదట సుమారు 75 వారాల వరకు ఆ థియేటర్లో కౌంటర్లు ఓపెన్ చేయలేదట. అంటే అంతవరకూ అన్నీ అడ్వాన్స్ బుకింగులే. దీన్నిబట్టి "షోలే" చిత్రం ఎంత కలెక్ట్ చేసివుంటుందో వూహించవచ్చు. "ఎ రికార్డ్ ఇన్ ది సినిమా ఇండస్ట్రీ ఇన్ ఇండియా" అనుకోవచ్చు. ఇటీవలకాలంలో మన తెలుగులో "అడవిరాముడు" చిత్రం కూడా ఒక వూపు వూపింది.

★ హిందీ నటి షబ్నాఅజ్మీ నటి శ్రీవిద్య ఫాన్ అట. ఆమె శ్రీవిద్య నటించిన ప్రతి చిత్రాన్ని చూస్తూందట. ఆమె నటనలోని తప్పొప్పులను శ్రీవిద్యతోనే చెబుతూందట. అంటె షబ్నా ఒక క్రిటిక్ అనేగా అర్థం. మరి క్రిటిక్స్ చేసే కామెంట్స్‌ను షబ్నా ఈజీగా తీసుకుంటోందా! అనేదే ప్రశ్న.

★ మొన్నటి శృంగార తార దీపను గూర్చి రకరకాల విమర్శలు, విసుర్లు కన్పిస్తున్నాయి పత్రికల్లో. ఏమిటీ విపరీతం అని దీప నడిగితే "పైకొచ్చేవాళ్లను చూస్తే కొందరికి మంట. ఆ మంటను మంతనాలరూపంలో వెల్లడి చేస్తున్నారు పాపం" అంటూంది. ఇలాంటి చిక్కుప్రశ్నలేవైనా అడిగితే సింపుల్‌గా యిలాంటి సమాధానాలే యిస్తారు తారలు.

★ కమల్‌హాసన్ శ్రీమతి వాణీగణపతికి పురాతన వస్తువులను కలెక్ట్ చేయడమంటే బలేసరదా అట. కమల్‌హాసన్‌గారి గెస్ట్‌రూమ్‌లో ఇలాంటివి మనం బోలెడన్ని చూడవచ్చుట. వాణీ ఆశ బాగానేవుంది. పురాతన వస్తువులమీద వున్న ఆశ, పురాతన ఆచారాలపై కూడా వుంటే బాగుండేదేమో!

— శ్రీనివాస్

'ఇద్దరూ అసాధ్యులే'లో గీత, కృష్ణ



"ప్రెసిడెంట్ పేరమ్మ"లో సగం పిచ్చి బైరాగి

నేటి గ్రామీణ రాజకీయాలపై చక్కని సెటైర్‌గా "ప్రెసిడెంట్ పేరమ్మ" వర్ణచిత్రాన్ని కవితా ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంలో డి. వి. ఎస్. రాజుగారు నిర్మిస్తున్న విషయం పఠితలకు విదితమే. డైరెక్టర్ కె. విశ్వనాథ్ ఎప్పుడూ ఉషారుగా ఉంటూ — నటీనటులకు, సాంకేతిక నిపుణులకు ఛలోక్తులతో ఉత్సాహం కలిగిస్తూంటారు. బైరాగి (రాజ్‌బాబు) మీద లొకేషన్‌లో పాట చిత్రీకరించేముందు ఆ సందర్భాన్ని నాకు విశదీకరించారాయన. ప్రెసిడెంట్ (గోకిన రామారావు)కు ఎదురుతిరిగిన పంచాయతీ బోర్డు మెంబర్లు, పనిమనిషి పేరమ్మ (కవిత)ను ప్రెసిడెంట్ చేస్తారు. గ్రామాభివృద్ధికి ఆమె చేసే ప్రయత్నాలకు మాజీ ప్రెసిడెంట్ ఆటంకాలు కలిగిస్తూంటాడు. అతని కుట్రలవల్ల కూలీ నాలీ లేక బీదా బిక్కీ అల్లాడిపోతూంటే, పంచాయతీ బోర్డు మెంబర్లు మళ్ళీ మాజీ ప్రెసిడెంట్‌కు దాసోహం అవుతారు. పేరమ్మను గద్దె దించాలని కుయుక్తులు పన్నగా, ఆమె సునాయాసంగా ఎదుర్కొంటూంటుంది. అప్పుడు 'సగం పిచ్చి' బైరాగి పాడే పాట...



'సొమ్మొకడిది సోకొకడిది'లో కమల్, రోజా



'శివ కేశవులు'లో ప్రభ

జి. వి. జి. పేజీ

"కూతు కూతు కూతు కూతు కుక్కపిల్లలు
రొట్టెముక్క చూపిస్తే, లొట్టలేశాయి.
కావు కావు కావు కావు కాకిమూకలు
చుట్టముక్క చూపిస్తే, చుట్టూ చేరాయి.
ఎత్తమంటే సెయ్యి ఎత్తేవోళ్ళు
ఏ ఎండకా గొడుగు పట్టేవోళ్ళు
ఎంగిలి మెతుకులు కతికేవోళ్ళు
ఏబరాసి బతుకులు బతికేవోళ్ళు!
కలిసికట్టు లేనోళ్ళు నాయాళ్ళు
గొలుసుకట్టు మతలబోళ్ళు నాయాళ్ళు
ఈళ్ళంతా మన ఊరు ఏలేవోళ్ళు!
నెగ్గిందా మాట ఇచ్చేవోళ్ళు
నెగ్గినాక ప్లేటు మార్చేవోళ్ళు
పొట్టలు కొట్టే గొట్టంగాళ్ళు
పొదుగులు కోసే కసాయివోళ్ళు
గోడమీద పిడకలు నాయాళ్ళు
గోతికాడ నక్కలు నాయాళ్ళు
ఈళ్ళంతా మన ఊరు ఏలేవోళ్ళు".

ఈ పాటను ఈ చిత్రానికి కథ, మాటలు సమకూర్చిన దాసం గోపాలకృష్ణ రాశారు. వేటూరి రాసిన జావళిని ప్రెసిడెంట్ ఉంపుడుకత్తె (మంజుభార్గవి) మీద కాతేరు గ్రామంలో చిత్రీకరించారు. ప్రెసిడెంట్ భార్య (రమాప్రభ) పరమ చాదస్తురాలు. పేరమ్మ మేనత్త కొడుకు పెద్దిరాజు (నూతన్‌ప్రసాద్) కూరగాయలమ్ముకునే మనిషి. అతనే హీరో. పంచాయతీ బోర్డు సభ్యులు — మంగలి బుర్రయ్య (కె. వి. చలం), చాకలి సర్రప్ప (అప్పారావు), వడ్రంగి డముకులు (సుబ్బారావు), హరిజన సభ్యుడు (సూర్యచంద్రరావు), గుమాస్తా (సాక్షి రంగారావు), బడిపంతులు (రమణమూర్తి), మంజుభార్గవి సోదరుడు (సి హెచ్. కృష్ణమూర్తి).

రాజమండ్రికి సమీపాన గల తొర్రేడు, కాతేరు, మిర్తిపాడు గ్రామాలలో షూటింగ్ జరిగిన అనంతరం బెంగళూరు, మైసూరు ప్రాంతాలలో చిత్రీకరణ జరుగుతూన్న ఈ చిత్రానికి చక్రవర్తి సంగీత దర్శకుడు. ఛాయ, శిల్ప, కూర్పు శాఖలను జి. కె. రాము, కళాధర్, జి. జి. కృష్ణారావు నిర్వహిస్తున్నారు. సహ దర్శకుడు : రామారావు. సహకార దర్శకుడు : నండూరి విజయ్. నిర్వహణ : గోపాలకృష్ణ.

విజయ

"బొమ్మరిల్లు"కు మల్లెనే విజయా బాపినీడు కొత్త చిత్రానికి తను వెలువరించే మరో పత్రిక పేరు పెట్టారు "విజయ" అని. (తదుపరి చిత్రం పేరు 'సిరిమ' అవుతుందా?) ఇదివరకటిలాగే మరో కొత్త దర్శకునికి అవకాశం కలిగిస్తున్నారు నిర్మాత మాగంటి రవీంద్రనాధ చౌదరి. ఆ దర్శకుడు దుర్గా నాగేశ్వరరావు. ప్రముఖ నటుడు స్వర్గీయ సి. ఎస్. గారి అల్లుడు. తొలుత పలు దర్శకులవద్ద సహకార దర్శకుడుగా, పెక్కు చిత్రాలకు దాసరి వద్ద సహదర్శకుడుగా పని చేశారాయన. డిసెంబర్ 9 న చాటపర్రు వద్ద షూటింగ్ ప్రారంభమయ్యే ఈ శ్యామ్‌ప్రసాద్ ఆర్ట్ ప్రొడక్షన్స్ కొత్త చిత్రంలో మురళీమోహన్, సరిత, మోహన్‌బాబు, రావుగోపాలరావు, అల్లు రామలింగయ్య, ఛాయాదేవి ఆదిగా గల వారుంటారు. జంధ్యాల రచయిత. ఆరుద్ర, వేటూరి, వీటూరి పాటలకు చక్రవర్తి బాణీలు కూర్చారు. ఛాయ : రామ్ చౌదరి. శిల్పం : కళాధర్. ఏలూరు పరిసరాలలో జనవరి 10 వరకు జరిగే షూటింగ్‌తో చిత్రీకరణ పూర్తవుతుంది.

అంతులేని వింత కథలో

ఆదర్శం - ఆచరణ

"పెద్దవారు ఎవరన్నా వెనకుంటేతప్ప — సీటు దొరకదన్నమాట? అబద్ధమాడరాదు, అన్యాయం చేయకూడదు, అధర్మాన్ని సహించరాదు — అని బోధించే పాఠశాలలు, కాలేజీలలోనే న్యాయం, ధర్మం, చట్టం ఎందుకు నశించిపోతున్నాయి, సార్?" అని ఆవేశంతో అడిగాడు సాగర్.

"ఆదర్శం వేరు, బ్రతుకుతెరువు వేరు," అని క్లుప్తంగా సమాధానమిచ్చాడు ప్రిన్సిపాల్ వర్మ.

"ఆ బ్రతుకుతెరువే నేర్పించవచ్చుగా? అబద్ధమనేదే మనిషి పీల్చే గాలయితే, మోసం అనేదే మనిషి తాగే నీళ్ళయితే, లంచాలూ — లావాదేవీలే నిత్యావసర వస్తువులైతే, నిజాన్ని మాకెందుకు నేర్పిస్తారు? న్యాయాన్ని మాకెందుకు నూరిపోస్తారు?"

"ఎక్కడ ఏది చెప్పాలో అదే చెప్పాలి. పైగా ... పుస్తకం, జీవితం - చెవీ, కన్నూ లాంటివి ఒకదానికి కనిపించకపోయినా, మరొక దానికి వినిపించకపోయినా — మనిషికి రెండూ అవసరమే!"

"కాని, ఒకటే రెండు పనులు చేస్తోంది అదికూడా విరుద్ధమైనవి చేస్తోంది ప్రాణం పోయినా అబద్ధాలాడవద్దని నేర్పిస్తారు. ప్రాణాపాయస్థితిలో అబద్ధాలాడవచ్చని సూచిస్తారు .. ఇలా చెప్పేదొకటి, చేసేదొకటి అవుతుంది. ఎందువల్ల? వీటన్నిటికి మూలం ఏది? ఈ లోపం ఎక్కడుంది?"

"నీ ప్రశ్నలకు సమాధానమే మీ నాన్నగారు!" అని ప్రిన్సిపాల్ (హనుమంతరావు) అనేసరికి అవాక్కయిపోయాడు సాగర్ (నరసింహరాజు).

మోహన్‌దాస్ కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వంలో కె రాఘవ నిర్మిస్తున్న ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్ "అంతులేని వింత కథ" వర్ణ చిత్రం తుది ఘట్టంలో పడింది.

హెల్త్ ఈజ్ వెల్త్

"ఎండలో ఎండి, వానలో తడిసి, లైట్ల ముందు వాడిపోయి — రోజుకు రెండు మూడు చిత్రాలలో రకరకాల జీవితాలు ధరించి, ఇంతకాలంగా నేను బావుకున్నదేమీలేదు. నా హెల్త్ మాత్రం ఖరాబైపోయింది," అన్నది రేఖ. పచ్చకామెర్లతో కొంతకాలంగా బాధపడుతోందామె. బొంబాయిలో అలోపతీ, హోమియోపతీ అన్ని వైద్యాలూ ప్రయత్నించి చూసి ఫలితం లేకపోగా ఓ పదిహేనురోజులపాటు విశ్రాంతి తీసుకోడానికి మద్రాసుకు వచ్చింది. "అమితాబ్‌బచ్చన్‌కు కూడా పచ్చకామెర్లటగా?" అన్నాను. "జర్నలిస్ట్ ధిమాక్ పని చేయడం ప్రారంభించిందా? నేను జర్నలిస్ట్‌ను చూసిపోడానికి రాలేదు. బచ్‌పన్‌సే ఎరిగిన జి. వి. జి. గారిని చూసిపోడానికి వచ్చాను... అన్నట్టు — బి. ఎన్. రెడ్డిగారు పోయారటగా, పాపం!" అంది "ఏడాదికి పైగా అయింది," అన్నాను. "రంగులరాట్నం" చిత్రంలో చిన్న వాణిశ్రీ పాత్రకు ఆమెను రెడ్డిగారికి నేను పరిచయం చేశాను. అప్పుడామెకు ఇవ్వబడిన పారితోషికం అయిదువందలరూపాయలే. ఇప్పుడు లక్షలు తీసుకుంటోంది కాని, ఆ మనశ్శాంతి ఏదీ? "పోనీ, నాటుమందులు ప్రయత్నించి చూడకపోయావా? ఇక్కడ హీరో కృష్ణంరాజు గారు, మ్యూజిక్ డైరెక్టర్ వేణుగారి భార్య పచ్చకామెర్లకు మంచి మందిస్తారు," అన్నా. "అదే పోతుందిలెండి. మళ్ళీ వచ్చి కలుస్తా," అని వెళ్లిన రేఖ వారంరోజుల తర్వాత కనిపించి, "ఇప్పుడు జాన్‌డిస్ లేదు. కేవలం డయట్‌తో కంట్రోల్ చేశాను. పళ్ళు, లిక్విడ్ డయట్ — అంతే నో సాలిడ్ ఫుడ్ ... తెలుగు పిక్చర్లు చూసి చాలాకాలమైంది ఇక్కడేం మంచి పిక్చర్లు ఆడుతున్నాయి?" అంది "చిల్లరకొట్టు చిట్టెమ్మ" సత్యం థియేటర్‌లో వుందన్నాను. వెళ్లిందటకాని, టిక్కెట్లు దొరకలేదట "నౌ అయామ్ ఆల్‌రైట్. రేపే బొంబాయికి వెళ్తున్నాను. హియరాఫ్టర్ ఎక్కువ చిత్రాలు ఒప్పుకోను," అంది. "కరెక్ట్. హెల్త్ ఈజ్ వెల్త్," అన్నాను. "ఠీక్‌హై జర్నలిస్ట్‌సాబ్!" అని చెప్పి వెళ్లింది.

[34 వ పేజీ చూడండి]


'ఎంకి—నాయుడుబావ'లో వాణిశ్రీ, శోభన్‌బాబు

హైద్రాబాద్ సినిమా

1977 ఉత్తమ చిత్రం
చిలకమ్మ చెప్పింది

1977లో వచ్చిన తెలుగు చిత్రాలలో ఉత్తమమయినదిగా గోపీకృష్ణా ఇంటర్నేషనల్‌వారు శ్రీ ఈరంకి శర్మ దర్శకత్వాన తీసిన 'చిలకమ్మ చెప్పింది' ఎంపిక అయింది. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాదీ ఇటువంటి చిత్రానికి ఇచ్చే బంగారునంది ఈసారి ఈ చిత్రానికి లభిస్తుంది. దీనితర్వాత రెండు స్థానాలకు అంటే వెండి, కాంస్య నందులను బహుమతిగా పొందటానికి శ్రీ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన 'తరం మారింది', శ్రీ మృణాళ్‌సేన్ దర్శకత్వం వహించిన 'ఒక ఊరి కథ' ఎంపిక అయ్యాయి.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఆవుల సాంబశివరావు అధ్యక్షతను ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'శిష్టుల' సంఘం ఎంపికలు ఇవి. ఈ సంఘంలోని ఇతరులు శ్రీ నండూరి రామమోహనరావు, ఆంధ్ర విశ్వవిద్యాలయ రంగస్థల కళల శాఖ అధిపతి శ్రీ అత్తిలి కృష్ణారావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం సాయం కళాశాల రీడరు శ్రీమతి యశోదారెడ్డి, వాస్తు శిల్పి బి. ఎన్. రెడ్డి, సమాచార శాఖ డైరెక్టరు జనరల్ డాక్టర్ ఎ. ఆర్. బాజి.

ఈ సంఘం చేసిన మిగతా ఎంపికలు: ఉత్తమ కథ ఇదెక్కడి న్యాయం — రచయిత శ్రీమతి ఐ. వి. ఎస్. అచ్యుతవల్లి. ద్వితీయ ఉత్తమ కథ 'తరం మారింది'. రచయిత శ్రీమతి మాదిరెడ్డి సులోచనాదేవి. ఉత్తమ నటుడు — శ్రీ కృష్ణంరాజు — అమరదీపం; ఉత్తమ నటి — శ్రీమతి లక్ష్మి — పంతులమ్మ. ఉత్తమ బాల నటి — బేబీరోహిణి — పంతులమ్మ. ఉత్తమ ఛాయాగ్రాహకుడు — శ్రీ విన్సెంట్—అడవిరాముడు. ఉత్తమ స్క్రీన్‌ప్లే — శ్రీ ఈరంకి శర్మ. ఉత్తమ పాట రచయిత — శ్రీ వేటూరి సుందరరామమూర్తి — మానసవీణా మధుగీతం — పంతులమ్మ ఉత్తమ నేపథ్యగాయకుడు — శ్రీ రమేశ్‌నాయుడు— 'తల్లి గోదారికే ఆటుపోటుంటే' — విల్లరకొట్టు చిట్టెమ్మ. ఉత్తమ నేపథ్యగాయని — శ్రీమతి పి. సుశీల — 'ఏ తల్లి కన్నదో' — దాన వీర శూర కర్ణ. ఉత్తమ సంగీత దర్శకుడు — రాజన్ నాగేంద్ర — పంతులమ్మ.

ఈ ఎంపికలు మొత్తం మీద ప్రజల ఆమోదాన్ని పొందినవనే చెప్పాలి. మిగతా విషయాల మాట ఎట్లా వున్నా ఉత్తమ చిత్రాల ఎంపిక మాత్రం నిర్దుష్టంగా జరిగిందని చెప్పక తప్పదు.

నవంబర్‌లో సందడి

నవంబర్ నెల ఇక్కడ బహుసందడిగా, సంచలనంగా గడిచింది. అరడజన్ చిత్రాల ప్రారంభోత్సవాలు, ఒక స్టూడియోలో 'విమర్శకుల విడిది' గృహప్రవేశం, ఒక చిత్రం ప్రశంసోత్సవం, మరో చిత్రం విజయోత్సవం, గత సంవత్సరం వచ్చిన చిత్రాల తాలూకు 'ఉత్తమస్థాయి' బహుమతుల ప్రకటన, ఆరున్నొక్క తెలుగు చిత్రాల విడుదల — జరిగాయి.

చిత్ర ప్రారంభోత్సవాలలో 2వ తేదీన జరిగిన 'హేమాహేమీలు' చిత్రం గురించి ఇదివరకే వ్రాసివున్నాను. 5న అన్నపూర్ణా స్టూడియోలో వీనస్ కంబైన్స్ నాల్గవ చిత్రం షూటింగు ప్రారంభమైంది. 19న ఆ కంపెనీవారు ఒక పత్రికాగోష్ఠి ఏర్పాటుచేసి చిత్రం వివరాలు తెలియజేశారు. 'అండమాన్‌కాదలి' అనే తమిళ చిత్రాన్ని వీరు తెలుగులో తీస్తున్నారు. దర్శకుడు— వి. మధుసూదనరావు. రచన — ఆత్రేయ. సంగీతం — మహదేవన్, ఛాయాగ్రహణం — బాలకృష్ణ, శబ్దగ్రహణం — కృష్ణంరాజు, కళ— జి. వి. సుబ్బారావు, నృత్యాలు — చిన్ని, కూర్పు— ఎన్. శంకర్, స్టిల్స్ — ఎం. వి. రాఘవయ్య, సహదర్శకుడు — కోదండరామిరెడ్డి, నిర్మాత — టి గోవిందరాజన్, సహనిర్మాత — టి. వి. ఎస్. శాస్త్రి.

లక్ష్మీశ్రీ, అనే కొత్తతార ఒక ముఖ్యపాత్రలో పరిచయం కాబోతున్న ఈ చిత్రంలో వాణిశ్రీ, రమాప్రభ అన్నపూర్ణ, జేబివరలక్ష్మి, నాగేశ్వరరావు, చంద్రమోహన్, ప్రభాకరరెడ్డి, రామలింగయ్య, రాళ్ళపల్లి, పొట్టిప్రసాద్, సంజీవి నటిస్తున్నారు.

ఆరు పాట లుంటాయనీ, అన్నీ రికార్డింగు అయాయనీ చెబుతూ వాటిని వినిపించారు. 'వేస్తాను పొడుపుకథ వేస్తాను, చూస్తాను విప్పుకో చూస్తాను'; 'చిత్ర చిత్రాల బొమ్మ పుత్తడిపోత బొమ్మ'; 'ఎందు దాగినావురా, నందకిశోరా, నవనీతచోరా'; 'ఈ కోవెల నీకై వెలసిందీ, ఈ వాకిలి నీకై తెరిచిందీ'; 'అండమాన్ అమ్మాయి, ఇండియా అబ్బాయి'; 'లల్లీ పప్పీ, లిల్లీ, మల్లీ' — పల్లవులతో వున్న ఈ పాటలు వినటానికి ఇంపుగానే వున్నాయి. ఈ చిత్రానికి ఇంకా పేరు పెట్టలేదు.

నగ్నసత్యం

నవంబరు6 మధ్యాహ్నం శ్రీ సారథీ స్టూడియోస్‌లో దీప్తి ఇంటర్నేషనల్ 'నగ్నసత్యం' షూటింగు నిరాడంబరంగా ప్రారంభం అయింది. ఈ చిత్రం ఇతివృత్తం, సాంకేతికవర్గం గురించి సెప్టెంబరులోనే ఈ శీర్షిక కింద చదివి వుంటారు. నటీనటవర్గం — శ్రీమతి మహేశ్వరి, కుమారి కృష్ణవేణి, విజయ్, రామప్రసాద్, పి. పుల్లయ్య, కె. బి. తిలక్ వగైరా. ఇద్దరు దర్శకులను నటులుగా పెట్టుకోవటం ద్వారా విశ్వేశ్వరరావు దర్శకులకు దర్శకుడవుతున్నారు. సర్వ సంసిద్ధులై నిర్మాణానికి ఉపక్రమించినందున ఎడాతెరపీ లేకుండా షూటింగు సాగిస్తున్నారు.

నన్ను చూసి నవ్వకండి

బాబు చిత్ర మూవీస్ 'నన్ను చూసి నవ్వకండి' చిత్రం షూటింగు, అక్టోబరులో అనుకున్నది, నవంబరు 7—న ఈ సమీపంలోని మేడ్చల్‌లో ప్రారంభం అయింది. నిర్మాత డాక్టర్ ఎస్. ఎ. ఎన్. బాబు కుమార్తె చిన్నారి అతియా కామెరా స్విచ్ ఆన్ చేయగా, తండ్రి డాక్టర్ ఎస్. ఎఫ్. ఎన్. బాబు తొలి క్లాప్ ఇచ్చారు. మమత, విజయలక్ష్మిపై తొలి దృశ్యం తీశారు. అంతకుముందు బేగం ఎస్. ఎఫ్. ఎన్. బాబు లక్ష్మి, వేంకటేశ్వర, శివపార్వతీ గణపతుల పటాలకు పూజ చేశారు.

శ్రీ శ్రీపతి కథ, మాటలు, కొన్ని పాటలు, స్క్రీన్‌ప్లే వ్రాసి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్ర సాంకేతికవర్గం గురించి కూడా అక్టోబర్‌లో తెలిపి వున్నాను. నటీనటవర్గంలో హలం, మంజుభార్గవి, శశిరేఖ, బెజవాడ చంద్రకళ, రాజ్యలక్ష్మి, శ్రీనాథ్, జయదేవ్, కృష్ణమూర్తి, రమేష్‌బాబు, రాజు, రవి, నాగేశ్, వీరభద్రాచారి, ప్రకాశరావు, జగదీశ్, శ్రీనివాస్, శేషగిరిరావు వున్నారు.

సాలూరి రాజేశ్వరరావు శిష్యుడు వి. సత్యారావు బాణీలు కట్టి, రికార్డు చేసిన 5 పాటలను వినిపించారు. 'పిల్లా నీ అందం చూసి'; 'మంజుల నాదాలు పలికే కరకంకణాలు, మంగళ భావాలు తెలిపే హస్తభూషణాలు', అనే పాటలు శ్రావ్యంగా వున్నాయి.

'నన్ను చూసి నవ్వకండి'లో వీణావతి, యం. విజయలక్ష్మి, బెజవాడ చంద్రకళ, మమత, శశిరేఖ, కృష్ణమూర్తి



డి.రామానాయుడు

సమర్పించు

వెంకటేష్ ఎంటర్‌ప్రైజెస్







ఎంకి నాయుడుబావ

సినిమా స్కోప్ ఈస్ట్‌మన్ కలర్

నిర్మాత: డి.వెంకటేష్ దర్శకత్వం: బోయిన సుబ్బారావు

కథ: మాటలు: పినిసెట్టి పాటలు ఆచార్య ఆత్రేయ సంగీతం: కె.వి.మహదేవన్

ఆంధ్ర-సీడెడ్: నవయుగ నైజాం విజయా సురేష్ పిక్చర్స్



'మరో చరిత్ర' విజయోత్సవం

'మరో చరిత్ర' నిర్మాతలు ఆండాళ్ ప్రొడక్షన్స్, పంపిణీదారులు నవయుగ ఫిలింస్ కలిసి నవంబర్ 25, 26 తేదీలలో ఇక్కడ ఆ చిత్ర విజయోత్సవం జరిపారు. మొదటి రోజు పాత్రికేయులకు, పరిశ్రమలోని ప్రముఖులకూ 'సరోవర్' హోటల్‌లో షడ్రసోపేతమైన విందు చేశారు. రెండవ రోజు గాంధి భవనంలోని ప్రకాశం హాలులో చిత్ర విజయానికి కారకులైన దర్శకుడు, తదితర సాంకేతికవర్గానికీ, తారాగణానికీ సత్కారం చేశారు. ఈ ఉత్సవానికి అధ్యక్షత వహించేందుకు తమిళనాడు ప్రముఖ ఫిలిం నిర్మాత, ప్రస్తుతం సమాచారశాఖమంత్రి అయిన శ్రీ ఆర్. ఎం.వీరప్పన్ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి జి. రాజారామ్ బహుమతులను పంచిపెట్టారు.

నిర్మాత రామ అరంగణ్ణాల్, దర్శకుడు బాలచందర్, మంత్రి వీరప్పన్, దక్షిణ భారత ఫిలిం వాణిజ్యమండలి అధ్యక్షుడు ఎస్. కృష్ణమూర్తి ప్రభృతుల ప్రసంగాల సారాంశం: కళకు హద్దులు



కళ్యాణ చిత్రవారి తొలి చిత్రం పాటల రికార్డింగ్‌లో ఎస్ పి. బాలసుబ్రహ్మణ్యం. మురళీమోహన్. కోవూరి వెంకట సుబ్బారావు రాజశేఖర్. పి. పి. అబ్దుల్లా.

లేవనేది ఈ చిత్రం చాటింది. నిర్మాత, దర్శకుడు, నాయక పాత్రధారి తమిళులే అయినా, చిత్రంలో తమిళ, ఆంగ్ల సంభాషణలు వున్నా, ఆంధ్ర ప్రజలు ఆదరించారంటే వారి విశాల హృదయానికీ, కళా రసికతకూ అది ప్రబల నిదర్శనం. దేశ సమైక్యతకు దోహదం చేసే ఈ విధమైన విశాల భావాలు పెంపొందించే చిత్రాలు విరివిగా రావాలి. ఫిలిం పరిశ్రమకు సంబంధించినంతవరకూ తమిళులూ, తెలుగువారూ అన్నదమ్ములవంటివారే. ఈ చిత్ర దర్శకుడు బాలచందర్ ఇప్పుడు తెలుగు చిత్రాలకు దర్శకత్వం వహిస్తున్నారు. కె. రంజిత్ కుమార్ తీయబోయే చిత్రానికి కూడా ఒప్పుకున్నట్లు తెలిసింది. ఇది చూసి ఈయన 'తెలుగు దర్శకుడు' అయిపోతున్నారని తమిళ నిర్మాతలు భయపడుతున్నారు !

ఆండాళ్ ప్రొడక్షన్స్ తెలుగులో మళ్లీ చిత్రం తీయటానికి ఇంకా రెండేండ్లు పడుతుందని శ్రీ అరంగణ్ణాల్ చెప్పారు. ఈలోగా 'మరో చరిత్ర'ను తమిళంలో 'అలైగళ్ ఎళుదియకవితై' అనే పేరిట తీస్తారట. అందులో కొత్త తెలుగు అబ్బాయిని నాయకుడుగా, తమిళ అమ్మాయిని నాయికగా పరిచయం చేస్తారట.

— ఎం. ఎస్ శర్మ

చక్కటి తారురోడ్డుమీద నా ఎంబాసిడర్ కారు నున్నగా జారిపోతోంది. మస్తిష్కంలో అనేక రకాల ఆలోచనలు సాగిపోతున్నాయి. చలికాలం అప్పుడప్పుడే ప్రవేశిస్తూండటంవల్ల చలిగాలి ఎముకలని కొరికేంత సాహసం చేయటంలేదు కానీ ఒకసారి వాటిని తాకి వెళ్ళిపోతోంది. నాకు కారు గ్లాసెస్ వెయ్యటం ఇష్టం ఉండదు. అందుకని అలానే పోనిస్తున్నాను కారుని. రోడ్డు కిరువైపులా మైదానాలు తప్ప మరేమీ లేవు వాటిలో రాత్రి సమయం కావడంవల్ల చిక్కని చీకటి రాజ్యమేలుతోంది సిగరెట్ వెలిగించుకుని గుండెనిండా పొగ పీల్చి రిలీఫ్‌గా బయటికి విడిచాను. రోడ్డు కొంచెం ఊరుకి దూరంగా వచ్చేసిన కారణంగా రోడ్డుమీద జనసంచారం బొత్తిగాలేదు. టైము తొమ్మిది కావస్తోంది. ఇంతలో హఠాత్తుగా నా ఆలోచనలకి బ్రేకులు పడ్డాయి. ప్రక్కనున్న మైదానంలోంచి ఒక స్త్రీ ఏడుపు హృదయ విదారకమైన ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి. ఎవరో ఏవిటో అనుకుంటూ కారు రోడ్డుకి అడ్డం తిప్పి హెడ్ లైట్లు తిన్నగా మైదానంలోకి ఫోకస్ చేసాను. ఒక బలిష్టమైన పురుషుడు ఒక స్త్రీమీద పడి ఆమెను బలాత్కరించబోతున్నవాడల్లా కారు లైట్లు తనమీద పడగానే చటుక్కున లేచిపోయాడు. నాకు అంతా అర్థమైపోయింది. ఒక అబలని అన్యాయంగా అనుభవించాలని ఆ నీచుడు చూస్తున్నాడు. వీడు బహుశా ఇక్కడ రోడ్డు కాసి ఇలా ఎంతమందిని పాడుచేసాడో. ఈ ఆగడాన్ని ఇంతటితో ఆపాలి. వీడ్ని చితకతన్ని ఆ స్త్రీని రక్షించాలి అనుకుంటూ వాడివైపు అడుగులు వేసాను. కానీ నాకు కాస్త భయంగానే ఉంది. వాడు చూస్తే మోటు మనిషి. నేనా ఇంట్లో నాలుగ్గోడల మధ్య అపురూపంగా పెరిగినవాడ్ని నేను వాడ్ని కొట్టగలనా. అన్యాయంగా వాడి చేతిలో పచ్చడి అయిపోతానేమో హుం అయితే అవ్వనీ భగవంతుడనే వాడుంటే నేనే నెగ్గుతాను. ఇప్పుడు ఈమెని వాడికి వదిలేసి ఇంటికి నా దారిన నేను చక్కాపోతే ఆ తరవాత ఇదే దృశ్యం కంటికి కనపడుతూ నాకు నిద్రపట్టదు. మనశ్శాంతి ఉండదు. ఏమయితే అదేకానీ అనుకుంటూ వాడివైపు పరుగెత్తాను నేను వాడివైపు రావడం చూస్తూనే వాడు గబుక్కుని ఆ అమ్మాయిని తీసుకు భుజంమీద వేసుకుని మైదానానికి అడ్డం పరిగెత్తసాగాడు. "నీడి దౌర్జన్యం కూలా", అనుకుంటూ గబగబా అడ్డంగా పరిగెత్తి వాడి చెయ్యి దొరకపుచ్చుకుని గట్టిగా మెలిపెట్టి శక్తికొద్దీ వాడి వీపుమీద నాలుగు గుద్దులు వేసాను. వాడు అంత బలవంతుడూ కూడా మరి ఏమను కున్నాడో ఆమెని క్రిందపడేసి కాలికి బుద్ధి చెప్పాడు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అంత బలవంతుడు అసలు నన్ను ప్రతిఘటించే ప్రయత్నం చేయకుండా ఎందుకు పారిపోయాడు అని. అసలు వాడు ఎదురుతిరిగితే నా పని సఫా. హుం బహుశా పిరికివెధవ అయివుంటాడు. అంతేకావాలి లేకపోతే వాడి బలం వాడికి తెలీదేమో ఆంజనేయుడిలా ఛీ... ఛీ వాడ్ని ఆయనతో పోల్చడం ఏవిటి పొరబాటు అనుకుంటూ వెనక్కి తిరిగాను.

ఆమె మవునంగా తల వొంచుకుని ఉన్నదల్లా నా వైపు కృతజ్ఞత నిండిన కళ్ళతో చూసింది నెమ్మదిగా తలెత్తి.


"మీ పేరు" నెమ్మదిగా అడిగాను.

"నీరజ" వీణలా పలికింది ఆమె మధుర కంఠం.

చాలా అందంగా ఉంది. ఆమెకు అంతకన్నా అందమైన పేరు పెట్టచ్చుకూడా.

"మీరు ఈ వేళప్పుడు ఇలా ఒక్కరూ ఎందుకొస్తున్నారు" కొంచెం మందలింపుధోరణిలో అడిగాను.

"ఆఫీసు నుంచి వస్తున్నాను. పాత బజారు దగ్గర మా ఇల్లు. సిటీబస్సు దొరకలేదు. తరతరాలుగా స్త్రీకి జరుగుతున్న అన్యాయమే ఇది. ఇవ్వాళ మీ దయవల్ల నా మానం కాపాడుకో



గలిగాను. మీ మేలు జన్మలో మరిచిపోను మీ పేరు — ?"

"శశికాంత్. అంతంత మాటలనకండి నా ధర్మం నేను నెరవేర్చాను సాటి మానవునిగా అది నా కర్తవ్యంకూడా" అంటూ ఆమె వైపు పరీక్షగా చూసాను. ఇంతకుముందు వాడు చేసిన అఘాయిత్యానికి గుర్తుగా చీర నలిగిపోయి, మట్టి అంటుకుంది. తల్లో పూలు నలిగిపోయాయి, జాకెట్టు అక్కడక్కడ పిట్లిపోయింది. జాలిగా ఆమె వైపు చూస్తూ అన్నాను.

"మీ ఇల్లెక్కడో చెబితే డ్రాప్ చేస్తాను. ఓ...సారీ! అన్నట్లు పాత బజారు దగ్గర అన్నారు కదూ, రండి. కారు ఎక్కండి" అంటూ వెళ్ళి కారు డోరు తీసి పట్టుకున్నాను. ఆమె మాట్లాడకుండా కారు ఎక్కి కూర్చొంది. అటు ప్రక్క డోరు తీసుకుని డ్రైవింగు సీట్లో కూర్చుని సిగరెట్టు వెలిగించుకుని కారు స్టార్టు చేసాను. పాత బజారు దగ్గరపడుతోంది. ఆమెతో ఇంక మాట్లాడాలనిపించి అడిగాను "మీరు ఏం చేస్తూంటారు — ?"

"నేను చెప్పకుండానే మీకు తెలుస్తుంది లెండి" అందామె.

"అంటే", ఆశ్చర్యంగా చూస్తూ అడిగాను.

"మిష్టర్ శశికాంత్, నీ వాచీ, ఉంగరాలూ, ఆ మెడలో ఉన్న పులిగోరు పతకం తీసి నా చేతికివ్వండి", కర్కశంగా ఆమె కంఠం ధ్వనించింది— ఆమె కంఠంలో ఇంతక్రితం మార్దవం లేదు.

"ఏమిటి... ఏంటి మీరనేది — ?" నాకు మాటలు తడబడుతున్నాయి.

"ఏం, అర్థం కావడంలేదా, మర్యాదగా మీ దగ్గరున్న వస్తువులు నాకు స్వాధీనం చెయ్యమంటున్నాను."

"చెయ్యకపోతే", కోపంగా ఆమెవంక చూస్తూ అన్నాను.

"చెయ్యకపోతేనా, అరుస్తాను గట్టిగా. ఏడుస్తాను నువ్వు నన్ను బలాత్కరించటానికి ప్రయత్నించి నేను లొంగకపోయేసరికి కార్లో ఎక్కించుకుని ఎక్కడికో తీసుకుపోతున్నావంటాను."

"అదిరిపడ్డాను ఆమె మాటలకి. ఇదన్నమాట ఆమె చేస్తున్న ఉద్యోగం. మైగాడ్ ఇంత మోసమా... అంటే ఆమె ఒక ముఠాలో మనిషి అన్నమాట. ఇందాక ఆమెను బలాత్కరించబోయిన వాడూ ఆ ముఠాలోవాడే నన్నమాట. వాళ్ళు దారినపోయే అమాయకుల్ని మోసంచేసి ఈ విధంగా డబ్బు గడిస్తున్నారు. ఇప్పుడు ఆమె చెప్పినట్లు అరిచి, గోల చేసిందంటే, మైగాడ్... నా పరువు ప్రతిష్ఠ గంగపాలు. ఆమె బట్టలు చిరిగి నలిగిపోయి ఉన్నాయి. జుట్టు చెదిరిపోయింది ఆమెను చూడగానే ఎవ్వడయినా ఆమె ప్రక్కన ఉన్న నేనే ఆమెను బలాత్కరించబోయాను అనుకోవచ్చు. ఇందాక ఆ ముఠావాడితో పోరాడినందుకు నా బట్టలూ నలిగిపోయి క్రాపు చెదిరి ఉంది. ఆమె ఆడది అందునా అందంగా కూడా ఉంది లోకులు ఆమె మాటలు ఈజీగా నమ్మేస్తారు. ఇటువంటి విషయాల్లో ఆడదాని మాటే నమ్ముతారు. అందులో ఆమె చూడ్డానికి చదువుకున్నదానిలాగ కూడా కనిపిస్తోంది. ఆమె ముఖం చూస్తే మోసం చేసేదాన్లా కనిపించడంలేదు. కానీ పచ్చి మోసకారి. గాంగ్ లీడర్! మైగాడ్! ఇప్పుడేం చెయ్యాలి. ఆమె అన్నంతపనీ చేయడానికి సిద్ధంగా ఉంది. ఆపదలో ఉన్న ఒక అబలగదా అని జాలిపడితే, ఇదన్నమాట ప్రతిఫలం ఉపకారికి అపకారం!

"ఏమిటి మిష్టర్ ఆలోచన. మీరు తప్పించుకోలేరు. మీ మాటలు ఎవ్వరూ నమ్మరు. మర్యాదగా నేను చెప్పినట్లు చేసి మీ మర్యాద కాపాడుకోండి. డబ్బు మళ్ళీ వస్తుంది కానీ పోయిన పరువుప్రతిష్టలు రావుకదా. ఇదిగో బజారు వచ్చేసింది. తక్షణం కారు ఆపండి. కారు ఇంకొక్క

జి. వి. జి. పేజీ

[29వ పేజీ తరువాయి]

ఇంటింటి రామాయణంలో ఒక ఇంటి రామాయణం

రిక్షావాలా లింగడు (నూతన్ ప్రసాద్) ముక్కుదాకా తప్పతాగి తూలుతూ ఇంటికొచ్చాడు. అతగాడి భార్య — కూరలమ్ముకునే రత్తి (రమాప్రభ) "యియ్యాళగూడా తాగొచ్చావా ?" అంది.

"అబ్బే, లేదే! అట్టాంటి అబాండాలెయబాక నామీద — బుద్దిమంతుడ్ని," అన్నాడు లింగడు.

"బండి తొక్కిన డబ్బులన్నీ రోజూ ఇట్టా తాగేస్తే, ఇల్లెట్టా గడుస్తుందసలు ?"

"నా సంపాదన. తాగుతాను. తగలేస్తాను. నా ఇష్టం. ఇల్లు గడవడానికి నీకు కూరలబండి కొని పెట్టాను గదా — కూరలమ్మిన డబ్బులు ఏ రంకుమొగుడికి యిత్తున్నావే ?"

"నన్నింత మాటంటావా? నీ బండి సెక్రం యిరిగిపోనూ. నీ హ్యాండిల్‌బారు వొంగిపోనూ."

"నీ కూరలబుట్ట ముక్కలవ్వ. నీ కూరలన్నీ పుచ్చిపోనూ. యేందే నన్నే తిడతావ్ ?"

రోజూ కుడితి తాగినట్టు సారా తాగితే, గుండె సిల్లడిపోతాది. ఆడదాన్నిట్టా ఉసురు పెడితే, ఏ లారీనో గుద్దుకుని ఎగిరిపోతావ్, జాగ్రత్త !"

"యేందే కూత్తున్నావ్?" అంటూ రత్తిని కొట్టడానికి లింగడు చెయ్యెత్తాడేగాని, అంతలో కారు దిగుతూన్న డాక్టర్ జయకృష్ణ (రంగనాథ్), విజయ (ప్రభ)ను చూసి ఆగిపోయాడు.

జయసుధ, చంద్రమోహన్‌లతో పర్వతనేని సాంబశివరావు దర్శకత్వంలో ఎన్. కృష్ణంరాజు నిర్మిస్తున్న వర్ణచిత్రం "ఇంటింటి రామాయణం" నవత ఆర్ట్స్ వారి 4వ కానుక.

గంధర్వకన్య

"జగన్మోహిని—కన్నా చాలా తమాషా కథ," అన్నారు విఠల్ ప్రొడక్షన్స్ పతాకంలో "గంధర్వకన్య" వర్ణచిత్రాన్ని త్వరలో ప్రారంభించే దర్శక నిర్మాత బి. విఠలాచార్య. మూడు పాటలు రికార్డు చేశారు. ప్రభ, జయమాలిని, నరసింహరాజు, త్యాగరాజు, సారథి ఇంతవరకు ఎన్నికైన తారాగణం. జి. కె. మూర్తి, ఆంజనేయులు స్క్రిప్టు రాశారు. విజయా కృష్ణమూర్తి సంగీత దర్శకుడు. హెచ్. ఎస్. వేణు ఛాయాగ్రాహకుడు. గోఖలే శిల్ప దర్శకుడు.

శ్రీ విజయ రాజేశ్వరీ ప్రొడక్షన్స్

తడ సమీపాన గల కీకారణ్యంలో గగుర్పాటు కలిగించే ఓ వర్ణచిత్రాన్ని శేఖర్ కథ, దర్శకత్వంలో బాలాంకిరెడ్డి తెలుగు, కన్నడ భాషల్లో నిర్మిస్తున్నారు. "మురిపించే తెలుగింటి చిలుకా — ముద్దుగా పాడవే" (బాలు — జానకి) అనే వేటూరి గీతాన్ని నాయికా నాయకులు హలం, ఈశ్వరరావులపై ఇటీవల చిత్రీకరించారు. ఇంకా — హరనాథ్, కె. వి. చలం, మనోహర్, రామచంద్ర, కృష్ణమోహన్, ఫణీంద్ర, రవి, సుజాత, ఎం. విజయలక్ష్మి పాల్గొంటున్న ఈ చిత్రానికి మాటలు, సంగీతం, ఛాయ, శిల్పం, కూర్పు, ప్రొడక్షన్ శాఖలను భరత్, సత్యం, పి. సాయి ప్రసాద్, రంగారావు, ఎ. మోహన్, గాడి సత్యం నిర్వహిస్తున్నారు.

సంచలన చిత్రం

"తొలుత సెన్సార్ సర్టిఫికేట్ నిరాకరింపబడి, ఆ తర్వాత కొద్ది సవరణలతో ఆమోదింపబడి, చివరికి 'ఎ' సర్టిఫికేట్ పొందిన మా 'ఆడదంటే అలుసా ?' వర్ణచిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేయాలనుకుంటున్నాం" అని తెలియజేశారు ప్రముఖ పంపిణీదారులు బాబూరావు. ఎం. మల్లికార్జునరావు దర్శకత్వంలో ఆయన నిర్మించిన ఈ చిత్రంలో మురళీమోహన్, నరసింహరాజు, గిరిబాబు, ఈశ్వరరావు, హరిబాబు, గోకిన రామారావు, ప్రభ, జయలక్ష్మి, జయశ్రీ టి., జయమాలిని, హలంతోపాటు సత్యనారాయణ, త్యాగరాజు, మాడా, కె. వి. చలం, కొమ్మినేని శేషగిరిరావు, వంకాయల, జగదీశ్, కాంచన, జి. నిర్మల, పి. ఆర్. వరలక్ష్మి పాల్గొన్నారు. త్రిపురనేని మహారథి రచయిత. సి. నా. రె., వేటూరి గీతాలకు జె. వి. రాఘవులు స్వరకల్పన చేశారు. లక్ష్మన్‌గోరే ఛాయాగ్రాహకుడు. శిల్పం, కూర్పు శాఖలను కొండపనేని రామలింగేశ్వరరావు, కోటగిరి గోపాలరావు నిర్వహించారు

'ఊర్వశీ నీవే నా ప్రేయసి'లో లత



వాశిరాజు చిత్రంలో చంద్రమోహన్ హీరో

"మా చిత్రానికి కొమ్మినేని శేషగిరిరావు డైరెక్టరు. చంద్రమోహన్ హీరో. మిగతా కళాకారులను ఎన్నుకున్న వెంటనే మార్చి, ఏప్రిల్ నెలల్లో ఒకే షెడ్యూల్‌లో మన రాష్ట్రంలో షూటింగ్ జరిపి, పూర్తిచేస్తాం" అన్నారు అప్సర ఆర్ట్స్ పతాకంలో "బొమ్మల కొలువు" వర్ణచిత్రాన్ని నిర్మించే వాశిరాజు ప్రకాశం.

"ఐ లవ్ యు"

"మా పిక్చర్‌కు 'ఐ లవ్ యు' అని పేరు పెట్టాం. జనవరి 1న బెంగళూరులో షూటింగ్ ప్రారంభమౌతుంది. మహారాజా పేలస్‌లో, బిర్లా సన్‌ఫ్లవర్ గార్డెన్స్‌లో, హోటల్ అశోక్‌లో చాలా భాగం చిత్రీకరింపబడుతుంది" అని తెలియజేశారు శ్రీ గౌరీ కంబైన్స్ పతాకంలో తెలుగు, కన్నడ భాషల్లో ఈస్ట్‌మన్ కలర్ చిత్రాన్ని సమర్పించే సరిదె భావనారాయణ. ఆయన పుత్రుడు ఎస్. వి. నరసింహారావు నిర్మాత. సి. ఎస్. రావ్ దర్శకత్వంలో శరత్‌బాబు, గీతాప్రసాద్, సత్యేంద్రకుమార్, సాక్షి రంగారావు, కాకరాల, పి. ఎల్. నారాయణ, పురుషోత్తం, ఫణికుమార్, సువర్ణ, పల్లవి, సరోజ, జయవాణి, సత్యకళ వగైరా తారాగణం. గొల్లపూడి సంభాషణలకర్త. సంగీతం, ఛాయ, కూర్పు, ప్రొడక్షన్ శాఖలను సత్యం, రామారావు, రాజగోపాల్, సుందరం నిర్వహిస్తారు. గురుదేవ్ సహ దర్శకుడు.

మంచి అన్నది పెంచుమన్నా

అడుగు ముందుకు వెళ్ళిందా నేను అన్నంత పనీ చేస్తాను. ఊఁ స్టాపిట్ !"


హఠాత్తుగా కారుకి బ్రేకులు పడిపోయాయి. ఆమె ఉచిత సలహాలకి నాకు తిక్కరేగిపోతోంది. కానీ ఏం చేస్తాను ఆపదలో చిక్కిన అమాయకుడ్ని పోలీసులుకి ఫోన్ చేసే అవకాశం కూడా లేదు. ఈ అబలలు ఇంత 'సబల' లయిపోతారనుకోలేదు. కోపం, ఉక్రోషం, కసి, దుఃఖం ముప్పిరిగొని వస్తూండగా వాచీ ఉంగరం, చైనూ, ఒక్కొక్కటీ తీసి ఆమె చేతిలో పెట్టేసాను. "ఇది నా మంచితనానికి నీవు ఇచ్చిన కృతజ్ఞత అన్నమాట కానీ ఒక్క మాట గుర్తుంచుకో! నేను మళ్ళీ నువ్వెక్కడ ఉన్నా నిన్ను పట్టుకోగలను" అన్నాను.

ఆమె ఫకాలున నవ్వింది "మిష్టర్! మీకు అట్టే తెలివితేటలు లేనట్లున్నాయి. అందుకే మా ఉచ్చులో పడ్డారు. ఇలాటి పన్లకి ఒక ఊళ్ళో ఒక ఆడదాన్ని ఒక్కసారే ఉపయోగిస్తారు. ఇంకో ఊళ్ళోనైనా మీరు నన్ను ఏమాత్రం గుర్తుపట్టలేరు, అనేక ఊళ్ళలో ఇలాటి మోసాలు ఒక్కసారే జరుగుతాయి మా ముఠా ఆధ్వర్యంలో. మీరు ఈ విషయం పోలీసుల దృష్టికి తెచ్చేసరికి మా పద్ధతి మారిపోతుంది. ఇంకో రకంగా మొదలుపెడతాం. మమ్మల్ని పోలీసులు పట్టుకోరు, పట్టుకోలేరులెండి. డియర్ శశికాంత్ ! అయినా మీ ప్రయత్నంలో మీరు ఉండండి. విష్ యు బెస్ట్ ఆఫ్ లక్, గుడ్ నైట్" అంటూ ఆమె చటుక్కున దిగిపోయి చీకటి సందుల్లో కలిసిపోయింది.

నేను చేష్టలుడిగినవాడిలా స్టీరింగ్ పట్టుకుని అలాగే కూర్చుండిపోయాను. నా కార్లోంచి ఎవరో అందమైన యువతి దిగి చీకటి సందుల్లోకి పోవడం ఆశ్చర్యంగా గమనిస్తూన్నారు అక్కడి కిళ్ళీ కొట్లవాళ్ళు. "మంచిని పెంచిన మానవుని ఏ వంచన ఏమీ చేయదని" కిళ్ళీ కొట్టు రేడియో లోంచి ఘంటసాల పాట మృదుమధురంగా వినిపిస్తూండగా ఉసూరుమంటూ కారు స్టార్టు చేసాను బోసిపోయిన వేళ్ళు చూసుకొంటూ.



చేదునిజం



విమలారామం

"ఏమమ్మో శారదా !... మీ మాణిక్యం ఏంచేసిందో విన్నావా ?"

పరుగు పెట్టినట్టు వచ్చిన వర్ధనమ్మ వైపు ప్రశ్నార్థకంగా చూసింది శారద.

వర్ధనమ్మకి వాళ్ళమీద వీళ్ళమీద చాడీలు చెప్పటమంటే మహాయిష్టం! అక్కడ కబుర్లిక్కడికి యిక్కడి కబుర్లక్కడికి చేరవేయటం వింతో సరదా! విన్నదానికి పదింతలు చేర్చి చెప్పటమంటే మంచినీళ్ళ ప్రాయం.

ఏవరయినా ఆమె చెప్పిందాన్ని ఖండిస్తే —మరింత పేట్రేగి పోతుంది. అందుకనే, ఆమె యేంచెప్పినా ఊకొట్టి ఊర్కోవటం అలవాటు చేసుకుంది శారద.

'మీ మాణిక్యం...' అంటూ మాణిక్యం చేసే పనులన్నిటికీ శారదదే బాధ్యతయి నట్టు మాట్లాడు తూంటుంది వర్ధనమ్మ ... కారణం, మాణిక్యాన్ని తన దగ్గర మొదట పనిలో పెట్టుకొని తర్వాత నాలు గయిదిళ్ళ వాళ్ళకి పనిలో కుదిర్చి పెట్టినది శారదే! వర్ధనమ్మ ఎలాంటి వ్యంగ్యాలు విసురుతూ వచ్చినా యింతవరకు శారదకి ఏలాంటి మాటా తీసుకురాలేదు మాణిక్యం! 'అందుకనే, మాణిక్యం ఏదో చేసిందని చెప్పటానికి వచ్చిన వర్ధనమ్మ వైపు మొదట ప్రశ్నార్థకంగా చూసినా తర్వాత నిర్లిప్తంగా చూసింది.

ఇన్నాళ్ళ యిలాంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్న దానిలా వ్యంగ్యంగా నవ్వింది వర్ధనమ్మ. "నేను చెప్పేది నమ్మ టానికి నువ్వు సిద్ధంగా ఉన్నట్టులేవు కాని ...నిజం ఎంతకాలం దాగుతుంది? ఊరు ఊరంతా కోడయి కూస్తోంది..."

ఈమాటు ఏదో జరగకూడనిది జరిగి వుంటుందని శారదకి అనిపించింది. ఆత్రుతగా "ఏంజరిగిందండీ ?" అని అడిగింది.

"అయితే, నీకింకా తెలియదన్న మాట ! ..." తెలియదని శారద ముఖం చెపుతున్నా - ఆమెకి తెలియదని తెలిసి తను వచ్చినా - ఊరించి ఊరించి సాగదీసి సాగదీసి నాన్చినాన్చి చెప్పింది. "షాప్సెషాపులోంచి ఏదో పట్టుకు పారిపోతోంటే దాన్ని పట్టుకుని జైల్లోకి తోసార్ట !"

శారదకి షాక్ తగిలినట్టయింది.

"పాపం... మాణిక్యం అక్షరాలా మాణిక్యం లాంటిదని నువ్వుచెప్పుకు మురిసి పోతుం టావు కాని..."

శారదకి ఒక్కసారిగా కోపం ముంచుకు వచ్చింది. "... అలాగని మీతో నేనెప్పుడు చెప్పానండీ! అదేమన్నా నాకు తోడబుట్టిన చెల్లెలా, మేనత్త కూతురా ?"

ఎప్పుడూ లేనిది శారద ఒక్కసారిగా యిలా ఎదురు తిరిగే సరికి వర్ధనమ్మ గతుక్కుమంది. అయినా, అలవాటు పడిన నోరు యిట్టే స్వాధీనంలోకి తీసుకుంది. "మా మాణిక్యం... మా మాణిక్యం అంటూ చెప్పుకుంటున్నావుగా అందుకని.."

"మా మాణిక్యం అంటే మా యింటి చుట్టమనా!... మా పనిమనిషిని మా అనక మీ అంటానా? మీ పనిమనిషి రంగమ్మని.. మీ రంగమ్మని అంతా అనటం వినటం లేదా?... అలాగే యిదీను."

"నేననేది అందుక్కాదు. అక్కడికేదో మీ మాణిక్యం మహా బుద్ధిమంతురాలయి పోయినట్టు...మా పనిమనుషులంతా ఉత్త దొంగముండ లయి పోయినట్టు కబుర్లు చెప్పేదానివి కదాని..."

"అలాగని నే నెక్కడన్నానండీ? ఏదో మాటలో మాటొచ్చి మా పనిమనిషి మంచిదని అన్నానేమో! అంత మాత్రాన మీ పనిమనుషులంతా దొంగలని నేనన్నట్టవు తుందా?"


"...మాణిక్యం మంచిదంటూ నాలు

బ్రూ-కమ్మని రుచికి, సువాసనకి మొదటి రకము

దక్షిణ భారత దేశంలోని కాఫీ అభిమానులను అడగండి. మీ పొరుగు వారిని అడగండి.



సుశీలా రవీంద్రనాథ్, ఇల్లాలు.
మా కుటుంబం బ్రూ కు అలవాటుపడింది. అందుకే గాక నా బడ్జెట్ కు కూడా సహకరిస్తుంది.




విజయ కుమార్ రావు, క్రికెట్ ఆటగాడు.
గ్రౌండు కాఫీ సువాసనను మరేదీ ఎదిరించ లేదు, అందుకే బ్రూను కోరుకుంటాను.



శ్రీ మరియు శ్రీమతి హరిశంకర్, నూతన దంపతులు.
మేము ఇష్టపడేది సారమైన కాఫీ అయితేనే —బ్రూ అనుకూలమైనది కూడా.



శ్రీ. కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్.
దబరాలో పోసుకున్నా రుచికరమైన, సారవంతమైన కాఫీనే ఇష్టపడతాను.



బ్రూ—దాని వెల ఎంతో ఆకర్షణీయమైనది
ఏ కాఫీ అభిమానిని అయినా అడగండి

OBM 5708A 1 TEL

ఇళ్లల్లో పనికి కుదిర్చి పెట్టింది నువ్వే కదా!"

"అవును. మంచిది కనుక చేర్పించాను. ఇంతకాలం మా యిళ్లల్లో మంచిగానే పని చేసింది. ఇవేళ దానికేదో పెడబుద్ధి పుట్టి జైలుకి వెడితే దానికి బాధ్యురాల్ని నేనా?..."

"నువ్వు బాధ్యురాలివని నే ననటం లేదమ్మోయ్! ఇప్పటికయినా మాణిక్యం కూడా దొంగముండేనని ఒప్పుకుంటావా లేదాని." ఒప్పుకోనిదాకా అక్కడ్నుంచి కదలను- అన్నట్టు నేలమీద చతికిలబడింది వర్ధనమ్మ.

అప్పటికే విన్న విషయంతో శారద మనస్సు కలగిపోయింది. వర్ధనమ్మ మాటలింకా కలత పెడుతున్నాయి. సరిగ్గా అదే సమయంలో శాంతమ్మ, రాజేశ్వరి వచ్చారు.. "...ఏమిటి శారదా?" అంటూ.

వాళ్ళకి ముందరే చెప్పి వచ్చింది వర్ధనమ్మ. మాణిక్యం ఏఏ యిళ్లల్లో పని చేసేదో వాళ్లంతా సరాసరివించి ఆనందించాలని ఎన్నాళ్ళనుంచో మహా యిదిగా వుంది వర్ధనమ్మకి కారణం... తను అవనమ్మ కంతో వద్దు పొమ్మన్న మాణిక్యాన్ని నమ్మి మొదట పనిలోకి తీసుకున్నది శారద! అంతే కాకుండా నాలుగయిదు యిళ్ళల్లో పని కూడా కుదిర్చింది. అదేం చిత్రమో... ఒక్కళ్లంటే ఒక్కళ్లు మాణిక్యం మీద చెడ్డమాట చెప్పకున్న వాళ్లే 'కరువయి' పోయారు! పైగా మా మాణిక్యం- అంటూ గర్వంగా చెప్పకున్నారు. అందుకే వర్ధనమ్మకి మాణిక్యంమీద... మాణిక్యాన్ని పనిలో పెట్టుకున్న వాళ్ళమీద మహామహా కసిగా వుంది... ఇదిగో యిన్నాళ్ళకో అవకాశం వచ్చింది. అందుకే, అందరిమీద యిలా విరుచుకుపడి వికృతానందం అనుభవిస్తోంది.

"మీ కెంత తెలుసో నాకూ అంతే తెలుసు!" అంది శారద పొడిగా.

"అది కాదు శారదా! మన మాణిక్యం యిలాంటిపని చేసిందంటావా అని" అంది రాజేశ్వరి.

"...మన మాణిక్యం! మన మాణిక్యం! మళ్ళీ వస్తే పనిలో పెట్టుకుంటావేమో కూడా!" అంది వర్ధనమ్మ వ్యంగ్యంగా.

"నువ్వుండవమ్మా! మాణిక్యం గురించి నీకేంతెలుసు?" అంది శాంతమ్మ చిరాకు పడుతూ.

"తెలుస్తూనేవుంది... నీ వళ్ళ కెంత తెల్సో!..." అని నిక నిక నవ్వింది వర్ధనమ్మ.

ఆమె నవ్వుకి శారదకి ఒళ్ళు మండి

పాపం, దీనికి అమ్మా నాన్నాలేరు, మనం పెంచుకుందామా!



Rediffusion D/767e/TL/R

చేదు నిజం

పోయింది. "మీకేం తెల్సు? అది షాపు లోంచి పట్టుకు పోతుంటే మీరక్కడుండి చూసారా? ఎవరెవరో చెప్పిన మాటలు పట్టుకుని ఒకళ్ళననటం మంచిది కాదు..."

"నేను కల్పించి అన్నానంటావా? అయితే, దాన్ని జైల్లో ఎందుకు పెట్టారు? ...అంతగా నా మాట అనుమాన మయితే— నా రంగమ్మ నడగండి... వెంకట రంగం గారి పెళ్ళాన్నడగండి. శేషాద్రిగారి భార్య నడగండి ... ఈ పేట పేటంతా చెపుతారు!..."

"జైల్లో పెట్టాలంటే ఈరోజుల్లో దొంగతనాలే చెయ్యనక్కర్లేదు. పోలీసు వాళ్ళతో పేచీ వచ్చినా—గొప్ప గొప్పవాళ్ళతో గొడవ వచ్చినా పేదవాళ్ళకి ముందు దొరికేది చావుదెబ్బలు— తర్వాత జైలు!" అంది రాజేశ్వరి.

"నువ్వన్నది నిజం! ఎవరో అన్యాయంగా కేసుపెట్టి మాణిక్యాన్ని జైల్లో పెట్టించి వుంటారు!... ఏమంటావ్ శారదా!" అంది శాంతమ్మ.

"అవునండీ! మాణిక్యం దొంగతనం చేసిందంటే నేనూ నమ్మలేను. మాయింట్లో దాదాపు యేడాది పని చేసింది...ఏదిపట్టుకు పోవాలన్నా దానికి కష్టంకాదు. అయినా, ఏదీ పొరపాటున కూడా ముట్టుకొని యెరుగదు."

"... మీరెంత దాచుకున్నా నాకూ తెల్సులే!" అంది వర్ధనమ్మ చేతులు త్రిప్పుకుంటూ.

"ఏమిటండీ మేం దాచుకున్నదీ మీకు తెల్సిందీను?" అంది రాజేశ్వరి తనూ చేతులు త్రిప్పుతూ.

"నాల్గు రోజుల్నుంచి మీ యింట్లో నాంచారి, శాంతమ్మింట్లో అప్పులమ్మా పన్లోకి వస్తున్నారు. ఈ శారదమ్మ సీతని పన్లోకి పెట్టుకుంది ... ఒక్కసారిగా మాణిక్యం మీ యిళ్ళల్లో పనెందుకు మానేసింది?... మీ యిళ్ళల్లో ఏదో దొబ్బుకు పోబట్టే కదా అంతా గప్‌చిప్‌గా దాన్ని మాన్పించేసారు?..."

"ఓహోహో ఎంత గొప్ప నిజం తెల్సుకున్నారు వర్ధనమ్మగారూ! ఈ వార్త యిప్పటి కెన్నిళ్ళల్లో చెప్పివచ్చారు?" అంది శాంతమ్మ వ్యంగ్యంగా నవ్వుతూ.

"ఆవిడకి అభాండాలు వేయటం అలవాటే కదా!" అంది రాజేశ్వరి పెదవి విరుస్తూ.

వర్ధనమ్మ వైపు నిరసనగా చూసింది శారద. "ఎందుకు పని మానేసావని మాణిక్యాన్నడిగినా, మాణిక్యం ఎందుకు పని మానేసిందని మాలో ఎవర్నడిగినా మీకు వెంటనే నిజం తెల్సిపోయేది కదండీ!"

"ఒక పనిమనిషి ముందకి వకల్తా పుచ్చుకొని మీరంతా నా మీద విరుచుకు పడుతున్నారు— ఏమిటమ్మా యింకో కేసి నిజం!..." అంది వర్ధనమ్మ గొంతు చించుకుంటూ.

"మీ కళ్ళెదుట కనిపిస్తున్నదేనండీ..!" అంది రాజేశ్వరి గట్టిగా.

"అంటే, నాకు కళ్ళు కనపడ్డంలేదం టావా! కొంచెం మాటలు జాగ్రత్తగా రానివ్వు రాజేశ్వరమ్మా!..."

వర్ధనమ్మ నోరు గట్టు తెగిన యేరు కావటం యిష్టంలేక సమయానికి శారద అడ్డుకట్ట వేసింది. "మిమ్మల్ని కించ పరచాలని మా ఉద్దేశ్యం కాదండీ! జరిగింది చెపుతున్నాము. మాణిక్యం కడుపుతోవుంది. ఎంత పని మనిషయినా అదీ మన తోటి ఆడదేకదా! తొమ్మిదోనెల వచ్చినా యింకా చాకిరీ చేస్తుంటే చూస్తూ ఎలా వుండ గలం? ఒకటి రెండు నెలలు మే మెలాగో తంటాలు పడతాం... సుఖంగా పురుడో సుకురావే పిచ్చిదానా అని చెపితేకాని పని మానింది కాదు. అలాగని తన స్థానాన తను పోయిందా? నాంచారిని, సీతని, వాళ్ళని వీళ్ళని బతిమాలి తను వచ్చేదాకా మా యిళ్ళల్లో పనిచేయమనిచెప్పి మరీ వెళ్ళింది. అలాంటి మంచి మనిషిని గురించి చెడుగా అనుకోవటం మనకేమన్నా భావ్యమేనా? మీరే చెప్పండి..."

అప్పటికీ వర్ధనమ్మ ఓటమి నంగీకరించ లేదు. "సరే, మాణిక్యం మహా పుణ్యాత్మురాలు!... మరయితే షాపులో దొంగతనం మాటేమిటి?"


"అదే మా కర్థం కావటంలేదు" అంది శారద తనలో తను అనుకున్నట్టు.

"నా కర్థమయింది. నేను చెపుతాను వినండి... అది ఏడాది నుంచి మీ యిళ్ళల్లో పనిచేస్తూ మంచిదాని క్రింద చెలామణి అయింది. ఒక్కసారిగా మిమ్మల్నందర్నీ మోసంచేసింది. పురిటి కెడుతున్నానని వంకపెట్టి అక్కడ యిక్కడ దొంగతనాలు చేసి చేతికి చిక్కింది పట్టుకు పారిపోతోంది. దొరికింది చాలక షాప్సీషాపులో కూడ ఘోరానికి ఒడిగట్టింది. అక్కడ కర్మకాలి దొరికిపోయింది. ఎందుకయినా మంచిది మీ యిళ్ళల్లో ఏవేం పోయాయో—యిప్పుడయినా చూసుకోండి"

"మీకా భయం లేదు... మా యిళ్ళల్లో ఏవీ పోలేదు!" అంది రాజేశ్వరి.

"మీ ఆయన లాయరు కదా! ఆ చేతా యీ చేతా సంపాదిస్తున్నాడు. నీకు పోయినా లెక్కేమిటిలే!"


చీదరించుకుని లేచిపోయారు రాజేశ్వరి, శాంతమ్మాను... మరి కొంతసేపు అదే





మా కుటుంబానికి,
ఎన్నో కప్పుల కమ్మని
చిక్కని టీ--రుబికి
మా కృతజ్ఞలు !





లిప్టన్
రుబి
డస్ట్

LRDC/CAS-1/78 TEL

చెదు నిజం

తరహాలో వాగివాగి వర్ధనమ్మ కూడా వెళ్ళిపోయింది.

కాని, ఆమె చెప్పిన విషయాలతో మనసు చెదిరిపోయింది శారదకు! మాణిక్యం దొంగతనం చేసిందా?

అసంభవం! మాణిక్యం నిప్పులాంటి మనిషి. నిజాయితీకి మారు పేరు. ఆ విషయం శారదకు తెల్సినంత బాగా మరెవ్వరికీ తెలియదు.

"...నువ్వెవరోనాకుతెలియదు. తెలియని వాళ్ళని పనిలో పెట్టుకోవటం ఎలా?" అని శారద మొదటి రోజున అన్న మాటకు "పొట్ట సేత పట్టుకుని వొచ్చినామమ్మా! ఈ వూల్లో అందర్కీ నాను క్రొత్తే!... ఎవరో వొకరు నమ్మి పనియ్యకపోతే నాను బతికే దెట్టాగమ్మా!... మీ ముఖంచూస్తే మంచి మనసున్న తల్లి వనిపిత్తున్నాది. అందుకే నోరు తెరిసి అడిగినాను. తమ దయ..." అంది మాణిక్యం.

ఆ మాటలకి మనస్సు కరిగి పని యిచ్చింది శారద... అయినా, మాణిక్యాన్ని ఓ కంట కనిపెడుతూనే వచ్చింది. చెప్పిన పని శుభ్రంగా, నీటుగాచేసే మాణిక్యం త్వరలోనే ఆమె మనస్సు నాకట్టుకుంది. అయితే అవకాశం వస్తే మాణిక్యం ఏం చేస్తుందో అన్న అనుమానం ఆమెను పట్టి వదల్లేదు. అందుకనే, ఒకసారి పనికట్టుకుని పదిరూపాయల నోటు భర్త చొక్కాజేబులో పెట్టి ఉతకటానికి వేసింది. కాని ఐదు నిమిషాలయినా కాకుండా "... తమరు సూడ్లేదనుకుంటాను" అంటూ నవ్వి ఆ నోటు తెచ్చిచ్చింది మాణిక్యం. మరోసారి ముందే లెక్కపెట్టుకుని చిల్లరనోట్లు కొన్ని కనిపించేలా మంచంమీద పడేసింది శారద. ఇల్లు తుడవటానికి గదిలోపలికి వెళ్ళిన మాణిక్యం మరుక్షణంలో బయటికి పరుగెత్తివచ్చి శారదని పిల్చుకొని వెళ్ళి "...చూసారా అయ్యగారెలా డబ్బు పడేసి వెళ్ళిపోయారో! తమరేనా సూస్కోపోతే ఎట్టాగమ్మా!" అంది. అటువంటి మంచి మనిషిని అంతకాలం అనుమానించినందుకు నొచ్చుకుంది శారద.

ఆ తర్వాత అనేక సార్లు బజార్నించి ఆసామానూ ఈసామానూ తెచ్చి పెట్టింది

మాణిక్యం. ఏప్పుడూ డబ్బు కాజేయలేదు సరికదా— తను తెచ్చుకునే దానికంటే చవగ్గా సరుకులు తెచ్చిపెట్టేంది... ఆరా తీస్తే "గొప్పింటోళ్ళని సూత్తే ధరలలాగే సెప్తారమ్మా! ఇక మేమున్నామా— సగానికి సగం అడిగేత్తాం... అల్లు తిట్టుకున్నా పర్లేదు..." అని నవ్వింది మాణిక్యం.

"ఈ పనిమనుషులంతా దొంగముండలే! అవకాశం రావాలేకాని... అందినకాడికి బొక్కటానికి ఎవళ్ళూ వెనుదీయరు" అని వర్ధనమ్మే కాదు అనేకమంది అనటం వింది శారద. కాని, శారద ఎన్నో అవకాశాలు కల్పించింది. కాని, ఒక్కసారంటే ఒక్కసారి మాణిక్యం తప్పటడుగు వేయలేదు. అయితే, కేవలం మాణిక్యం మాత్రమే అసాధారణమైన మనిషా? అంత పేదరికంలో కూడ ఇంత నిగ్రహంతో ఎలా వుండగలుగుతోంది?

ఉండబట్టలేక ఒక రోజున మాణిక్యాన్నే అడిగేసింది శారద. మాణిక్యం మొదట తెల్లబోయింది. "...నా వొక్కసారి కూడ దొంగతనం సెయ్యలేదని చిత్రంగుందమ్మా! అసలు నా నెందుకు దొంగతనం సెయ్యాల? అడిగిన జీతమిత్తన్నారు. అడక్కుండానే అదీయిదీ తింటానికి పెడతన్నారు. ఈ సీర సానా బావుంది. జాగత్తగా కట్టుకోండి పాతపడిపోయాక నాకే యియ్యాలమ్మగోరూ అని నాను పరాసికానికంటే— నాల్రెల్లు తిరక్కుండా కటుకోమని యిచ్చేసినారే! మీ కొడుక్కి బిస్కత్తు పెడితే—నాకొడుక్కి పెట్టకుండా వుండరే! మమ్మల్నింత బాగా సూత్తారే... మీ యింటో దొంగతనం సేత్తానా అమ్మ!... అలాంటి యెదవ పన్జేస్తే నాకు పుట్టగతులుంటయ్యా! పురుగులు పడి సచ్చిపోనా?..." అంది కన్నీళ్ళు పెట్టుకుంటూ.

అయ్యో, ఒక మంచి మనిషిని నొప్పించానే అని ఆవేళ ఎంతో బాధపడింది శారద. ఆ తర్వాత... తన మంచితనం తాను ఋజువు చేసుకుంటూ నాలుగయిదిళ్ళల్లో మాణిక్యాన్ని పనికి కుదిర్చింది. ఎవళ్ళు చూసినా సుఖపడ్డామన్న వాళ్ళేకాని ... తప్పులెన్నేవాళ్ళు లేకపోయారు.

కాని, అర్ధాంతరంగా ఈ దుర్వార్త యేమిటి?...వర్ధనమ్మ చేరవేసిన కబురు నిజమేనని, ఆ సాయింత్రమే తెల్సిపోయింది శారదకి.

ఆఫీసు నుంచివస్తూనే భార్యముఖం చూసి "ఏమిటలా వున్నావు?" అని అడిగాడు కృష్ణారావు.

విన్నది వివరంగా చెప్పింది ఆమె.

"ఛ! మాణిక్యం దొంగతనం చేసిందా? ...ఎవళ్ళో దాని మీదకి అన్యాయంగా నేరం త్రోసేసుంటారు!"

శారదకి ఎక్కడలేని ధైర్యం వచ్చింది. "అవునండీ! నా మనసులోని మాటే మీరూ చెప్పారు...అసలేం జరిగిందో మనం తట మనమే తెల్సుకుందాం. అవసరమయితే దానికి సాయం చేద్దాం."

కృష్ణారావు తెల్లబోయాడు. "అంటే, జైలుకివెళ్ళి కల్సుకుందామనా?"

"అవునండీ! తప్పేముంది? ఒకమంచి మనిషికి అన్యాయం జరిగిందని తెల్సికూడా మనం నిమ్మకి నీరెత్తినట్లుండ గలమా?... మీరే చెప్పండి."

"సరే, ముందు దానిమొగుడ్ని కల్సుకొని ఏంజరిగిందో తెల్సుకుంటే?..."

"అలాగే, మీరెలా అంటే అలా! ... ఇప్పుడే వెడదాము!"

"నీకు వాళ్ళుండే చోటు తెలుసా మరి!" అని నవ్వుతూ అడిగాడు కృష్ణారావు.

"ఫలానా యిల్లని తెలియదు కాని ... వాళ్ళ గుడిసెలుండే చోటు తెల్సు. ఓసారి బజార్నించి వస్తుంటే మాణిక్యం చెప్పింది..."

వాళ్ళిద్దరూ మురికిపేట చేరుకునేసరికి కనుచీకటి పడుతోంది. చుట్టూ తొమ్పు గుంటలు, అడుగు పెట్టటానికి అసహ్యంగా ఉంది.

"ఛ! ఇలాంటి చోటా వాళ్ళుండేది!" అన్నాడు కృష్ణారావు బాధగా.

"అవును. వాళ్ళేకాదు ... మనమెక్కిన రిక్షా తొక్కినవాడు, మనకి కూరలమ్మే ముసలమ్మ... వీళ్ళంతా వుండేది యిక్కడే! ఎంతోమంది యిక్కడే బ్రతుకుతున్నారు" అంది శారద ఉద్వేగ పూరిత స్వరంతో.

ఎవర్నో "వెంకటస్వామి ఉండేదెక్కడ?" అని అడిగాడు కృష్ణారావు.


ఒకరేమిటి- ఆ చుట్టుపట్ల నలుగురయిదుగురు వెంకటస్వాములున్నారు. కాని, జైలుకి వెళ్ళిన మాణిక్యం మొగుడు వెంకటస్వామి ఎక్కడుంటాడో యిట్టే తెల్సిపోయింది.

వాళ్ళను చూస్తూనే వెంకటస్వామి ఆశ్చర్యపోయాడు. "దణ్ణాలు బాబూ! తమరు ... తమరంత దూరం నుంచి వచ్చారా?"

వాడు నమస్కారం చెయ్యటానికి వీల్లేకుండా చేతికట్టు అడ్డు వచ్చింది.

"నీ చేతికేమయింది?" అని ఆత్రంగా అడిగింది శారద.

వెంకటస్వామి ఏదో గోడౌన్‌లో కూలిపని చేస్తున్నాడు. బరువయిన బస్తా దొర్లి మీదపడి చెయ్యి విరిగిపోయింది. తప్పు వాడిదేనని తమకేం బాధ్యత లేదని తప్పించు



ధర్మపథం

పుత్రులలోని మూడువిధాలు

ఉత్తమ తమ యోగ్యతలను బట్టి, అయోగ్యతలనుబట్టి పురుషులలో ఉత్తములు, మధ్యములు, అధములు అనే వ్యత్యాసం ఉన్నట్లు చాలామందికి తెలుసును. ఆ విధంగానే పుత్రులలో కూడా వ్యత్యాసాన్ని చూప వచ్చును.

ఈ పుత్రులలో ఉండే భేదాలను వివరిస్తూ ఉన్న ఒక పెద్దల సూక్తి ఉన్నది —అది —

> "ఆత్మనా జ్ఞాయతే ధన్యః
> మధ్యమః పితృ పితామహైః,
> మాతృ పక్షేణ మాతాచ
> ఖ్యాతి మేతి నరాధమః"

ఇతరుల గౌరవ మర్యాదల పైని ఆధార పడకుండా స్వయంగా కీర్తి ప్రతిష్ఠలు సంపాదించిన కుమారుడు ధన్యుడు అతడు ఉత్తముడు. అలా కాకుండా తండ్రి తాతల కీర్తి ప్రతిష్ఠలపైని, పలుకు బడిపైని ఆధారపడి ప్రజలవల మర్యాదలు పొందేవాడు మధ్యముడు. తనలో ఏవిధా చేవలేక పోయినా తల్లి చేతను, మాతృవంశీయుల చేతను పొగడ్త పొంది తగు మనిషిగా చెలామణి అవుతున్నవాడు అధముడు — అని ఈ శ్లోకానికి అభిప్రాయం.

తన కుమారుడు యోగ్యుడయినా, అయోగ్యుడయినా, తల్లికి వానియందు అభిమానం ఎక్కువ. "కుపుత్రోజాయేత క్వచిదపి కుమాతాన భవతి". ఆమె యెప్పుడూ వాని మేలుకే ప్రయత్నిస్తుంది. అందువల లేని గుణాలను కూడా ఆరోపించి పొగడుతుంది. అందువల్ల, తనలో యోగ్యత లేక పోయినా పుత్రుడు తల్లి మూలంగా నలుగురిలోనూ పేరు తెచ్చుకుంటాడు. తల్లి వంకవారూ కూడా అలాగే భావిస్తారు వారి మూలంగా ప్రసిద్ధికి వచ్చినవాడు అధముడు మాత్రమే అవుతాడు.

తండ్రి, తాతలు విద్యావిషయంగా గాని, ధనం వల్లగాని రాజకీయంగా గాని సుప్రసిద్ధులై ఉన్నప్పుడు, కుమారుడు, వారి పేరు చెప్పకొని గౌరవ మర్యాదలు సంపాదించ వచ్చు. తండ్రి తాతలతో కలిసి వెళ్ళినా — తాను ఒంటరిగా ఎక్కడికి పోయినా ప్రజలు గౌరవిస్తారు. కుమారుని యోగ్యతా యోగ్యతలతో నిమిత్తం లేదు. ఇలా పేరు తెచ్చుకున్న వాళ్ళు మధ్యముల్లోకి లెక్కకు వస్తారు.

ఇతరుల పైని ఆధార పడకుండా స్వప్రయత్నం వల్ల కీర్తి ప్రతిష్ఠలు, గౌరవ మర్యాదలు సంపాదించాలంటే పుత్రుడిలో యోగ్యత ఉండాలి. విద్యలోనూ, ప్రవర్తనలోనూ, పరోపకారంలోనూ, ఇతర విధాలనూ యోగ్యుడనిపించుకోవాలి. అట్టివానికి తండ్రి, తాతలను బట్టి కాకుండా — స్వతంత్రంగా — కోరకుండానే గౌరవం లభిస్తుంది. అతడు ఉత్తముడు. అతడే ధన్యుడు. అతడే కాదు — అతనివల్ల తండ్రి కూడా ధన్యుడు కాగలడు.

— బులుసు వెంకటరమణయ్య

కున్నారు గోడౌన్ ఓనర్సు. గవర్నమెంటు హాస్పటలుకి వెడితే మూడు రోజులు పడిగాపులు పడినా కట్టుకట్టిన పాపాన పోయారు కాదు ఆ ఘనాత్ములు. మొగుడి బాధ చూడలేక...కూలిపని చేసుకునే వాడికి చెయ్యే ఆధారమని — ఆ చేతి నెలాగయినా కాపాడుకోవాలని...రంగారావు గారి హాస్పటలుకి తీసుకుపోయి కట్టు కట్టించింది మాణిక్యం !

"...ఏదో పురిటి కెడుతోంది కందా! కొత్త తిండి తింటుందని నాల్గురూపాయి లెక్కిచ్చారు తమరు. ఆ యమ్మా యిచ్చినదంతా నా రోగానికే సరిపోయిందమ్మా!" అన్నాడు వెంకటస్వామి దిగులుగా.

"అదిసరే, మాణిక్యం ఏది? ఎక్కడికి వెళ్ళింది?" అని అడిగింది శారద

"మాణిక్య మండి ... మా వూరు ... మా వూరెళ్ళిందండి !" అన్నాడు వాడు తల దించుకుంటూ.

"నువ్వు చెప్పకపోయినా మాకూ కొంత నిజం తెల్సిందోయ్ ! జరిగింది తెలిస్తే సాయం చేద్దామనే వచ్చాముకాని...మిమ్మల్ని తిడదామని కాదు." అన్నాడు కృష్ణారావు.

చేదు నిజం

వెంకటస్వామి వెంటనే జవాబు చెప్పక పోయేసరికి "ఊరంతా మాణిక్యం జైలుకి వెళ్ళిందని చెప్పకుంటున్నారు. నిజమేనా?" అని అసహనంగా ఆవేశంతో అడిగింది శారద.

"నిజమే నండమ్మా! కాని,..."

"అది దొంగతనం చెయ్యలేదు. ఆ సంగతి నాకు భాగా తెల్సు. కాని, ఆ నేరం దాని మీదకి ఎవరు తోసారు? ఆ సలా షాపుకి ఎందుకు వెళ్ళింది? వున్నది వున్నట్టు నిజంచెప్పు..."

వెంకటస్వామి మాట్లాడలేదు.

"చూడు వెంకటస్వామీ! అవసరమయితే లాయర్ని పెట్టించి కేసు గెలిపించేలా చేస్తామేకాని ... మాణిక్యానికి అన్యాయం మాత్రం జరగనివ్వం. నువ్వుమాత్రం నిజం దాచకుండా చెప్పు" అంది శారద.

"కేసంటే మాటలా అమ్మగోరూ! అంతడబ్బు నాకెక్కడుంది—ఓమూల ఒంటి సెయ్యి. కూలి సెయ్యలేను. నా తిండి నాకే దొరకటంలేదు..."

"అంత మాత్రాన దాని కర్మాన దాన్ని జైల్లో వదిలేస్తావా? అప్పు చేసయినాసరే కేసు నడిపించాలి!"

వెంకటస్వామి నవ్వులో జీవంలేదు. "అప్పు! మాలాటోళ్ళకి అప్పులిచ్చే వాళ్ళెవరుంటారు అమ్మగోరూ!..."

"నే నిస్తానోయ్! ఎంత కావాలో చెప్పు..." అన్నాడు కృష్ణారావు ఉద్రేకంగా.

"తమరు మంచోరు బాబా! కనుకనే యిందూరం వొచ్చి యింత యిదిగా మాటాడుతున్నారు. కాని, ఎంతడబ్బవుద్దో ఏమో! అప్పు తీర్చటం మాటలు కాదుగా! ఒక్క తప్పొప్పుకుంటే రెండు మూడు నెలేత్తారు. ఆ తర్వాత అదే బయటి కొచ్చేత్తది..."

"చెయ్యని తప్పు అసలది ఎందుకొప్పుకోవాలి?" అని అడిగింది శారద కోపంగా.

"...ఇంక తమరికాడ అబద్దం సెప్పి నాబంనేదు. నిజమే సెప్పేత్తానమ్మగోరూ!"

"చెప్పు!"

"మాణిక్యం దొంగతనం చేసినమాట నిజమే! కాని, వస్తువుకోసంకాదు జైలుకి వెళ్ళాలని!"

శారదా కృష్ణారావులు తెల్లబోయారు. "జైలు కెళ్ళాలనా?"

తల వూపాడు వెంకటస్వామి.

మొదటికాన్పు మరో వూళ్ళో గవర్నమెంటు హాస్పటల్లో పోసుకుంది మాణిక్యం. కాని, అక్కడెవరూ పట్టించుకున్నవాళ్ళు లేకపోయారు. పుట్టిన పిల్లాడికి ఏదో జబ్బుచేసి చచ్చిపోయాడు... రెండో కాన్పుకి అసలు హాస్పిటల్లో ఖాళీలేదు పొమ్మన్నారు. ఆ గుడిసెలోనే ఏలాగో బిడ్డని కన్నది. కాని పురిటి రోజుల్లో వర్షాలు, వరదల్లో వాళ్ళకి బ్రతకటమే కష్టమైపోయింది. ఏదో ఆయువు వుండబట్టి పిల్లాడు బ్రతికాడు. ఇప్పుడిది మూడో కాన్పు. మళ్ళీ వర్షాలు

చేదు నిజం

రోజులు. గవర్నమెంటు హాస్పిటల్లో చేర్చుకుంటారో లేదో నమ్మకం లేదు. ఒకవేళ చేర్చుకున్నా 'ఎలా ఆదరిస్తారో' ఇదివరకే ఒకసారి 'రుచి' చూసింది.

ఏ వూళ్ళో అయినా గవర్నమెంటు హాస్పటలు పద్ధతి ఒక్కటే అని చెప్పటానికి కాబోలు వారం క్రితం వెంకటస్వామి విషయంలో ప్రాణాల మీదకి తెచ్చినంత పని చేసారు!

తన తిండి తనే సంపాదించుకోలేని స్థితిలో వున్నాడు అతను ఇంక భార్యా బిడ్డల్ని ఎలా పోషిస్తాడు? పురుడెలా వెడుతుంది?

"...మా సోమయ్య పెళ్ళాం జైల్లోనే పురుడోసుకుంది అమ్మగోరూ! దానికి రెండు పూటలా తిండి పెట్టేవారంట. వోరం వోరం వచ్చి డాక్టరుబాబు సూసే వోడంట..."

శారదకి కడుపులో ఏవరో దేవినట్లయింది

పూరిగుడిసెలో రక్షణ లేదు. గవర్నమెంటు హాస్పటల్లో వైద్య సదుపాయం దొరకదు... కనీసం సంపాదించి తిండి పెట్టే మొగుడికి చెయ్యి స్వాధీనంలో లేదు. ఇంత కాలం పనికి పెట్టుకున్నవాళ్ళు అతనికర్మకి అతన్ని వదిలేసారు. ఈ పరిస్థితుల్లో మాణిక్యం ఏం చేస్తుంది?

"జైల్లో తిండేనా పెడతారమ్మగోరూ! అందుకనే, ఇదొరకు సోమయ్య పెళ్ళాం పుర్టిరోజుల్లో జైలు కెళ్ళింది. ఈడకన్న ఆడనే మెరుగని సెప్పింది... నిజం అమ్మగోరూ..."

దేశంలో జైళ్ళలో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని పత్రికల్లో వ్రాస్తున్నారు. కాని, బయట పరిస్థితుల కన్న జైళ్ళే నయమని చెపుతున్నారట చూసి వచ్చినవాళ్ళు!

ఇంకా వెంకటస్వామి మాటలు వింటూ అక్కడ నిలబడ గలిగే శక్తి లేక పోయింది శారదకు. "...వెళ్ళిపోదాం పదండి!" అని భర్త చెయ్యి పట్టుకుని లాగింది.

ఆమె చేతులు వణకటం, ఆమె గొంతు గాద్గదికమవటం గుర్తించి ఆమె బాధ నర్థంచేసుకున్నాడుకృష్ణారావు. చటుక్కున జేబులో చెయ్యి పెట్టి చేతికి వచ్చిన నోట్లనో వెంకటస్వామి చేతుల్లో కూరి... గబగబా ఆమె వెంట అడుగులు వేసాడు!

27 పార్టు ఓటమి !

మొన్న జరిగిన చిక్కమగళూరు ఎన్నికలలో ఒక పూరు నుంచి నిలబడ్డ హాస్యాస్పద రంగస్వామి తాను గెలక నెగ్గకపోయినా. ఇందిరా గాంధి నెగ్గినా తాను సన్యాసులలో కలిసిపోతానని ప్రతిజ్ఞ చేశారట. ఆయనింతవరకూ ఇరవై మూడు పార్టు నిలబడి అన్నిసార్లూ. యీ సారితో సహా ఓడిపోయారట-మరయితే కలిశారో లేదో-సన్యాసులలో.

ఆర్మ్‌స్ట్రాంగ్‌కి లారీ ప్రమాదం

చంద్రమండలంలో మొట్టమొదట కాలుపెట్టిన మానవుడు ఆర్మ్‌స్ట్రాంగ్ ఓ లారీ ప్రమాదంలో ఆ లారీలోంచి దూకే సరికి కుడి చేతి వుంగరం తలుపు సందులో యిరుక్కుని, అది లాగేసరికి వేలే వూడి పోయిందట. అనక ఆయనా వేలును చేత్తో పట్టుకు వెళ్ళి ఓ డాక్టరుకిస్తే ఆ డాక్టరు వేలును యధాస్థానంలో కుట్టేశాడట. ఇంతకూ ఆ వేలుకున్నదాయన పెళ్ళివుంగరమట.

కింది పదవి కోసం ఆందోళన !

జీవితభీమా సంస్థ క్లాస్‌వన్ వుద్యోగులంతా చేరి తమ కంతంత జీతాలు వద్దని, తమ జీతాలు క్లాస్ టూ వుద్యోగస్థుల జీతాలతో సమానం



చేయమని సుమారో నాలుగు వేలమంది చేరి కోరారట. దీనిక్కారణమేమిటబ్బా అనాలోచిస్తే క్లాస్‌వన్నాఫీసరన్న పేరు వల్ల వారికి చాలా నష్టాలున్నాయట. క్లాస్టూ ఆఫీసర్లకన్నా వీరికి నెలకు పందనుంచీ మూడొందల వరకూ తక్కువ రాడమేగాక వారుపొందే నాలుగు వేలరూపాయల బోనస్సూ పొందలేక పోతూన్నారట-మరిహానేం!

అత్యధిక వ్యాపార సంస్థ !

ప్రపంచంలో కల్లా వ్యాపారంలో ఎక్కువ పేరు కన్నది. అధిక వ్యాపారం చేసే సంస్థా అమెరికాలో వున్న జనరల్ మోటార్స్ కంపెనీ అట. ఈ సంస్థ సంవత్సరానికి సలభై నాలుగు వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూందట. టర్నోవర్బిజినెస్సన్నమాట.

దురాక్రమణ - అఘాయిత్యం

బొంబాయికి చెందిన ఓ యాభై యేళ్ళాయన జైలులో యావజ్జీవశిక్ష అనుభవించి తిరిగి తన యింటికి వచ్చేసరికి ఆ యిల్లు దురాక్రమణ చేసినవారు "నువ్వెవ"రనడిగితే తన విలాసం చెప్పాడట దాంతో వారు నలుగురూ ఒక్కసారాతని మీదబడి. చంపేశారట. పాపం ఆ యావజ్జీవశిక్ష యావజ్జీవితముండుండినా బోసు.

శతవృద్ధుని చాపల్యం !

కొచ్చిన్‌కు చెందిన 22 ఏళ్ళ బాలన అనే అమ్మాయికి ఆరునెలల క్రితం పెళ్ళయిందట. అత్తారింట్లో వున్న ఆమెను, ఆమె భర్త తాతయ్య 90 ఏళ్ళ యువకుడు తన మనవడింట్లో లేనప్పుడామెను బలాత్కారం చేయబోయాడట. ఆమె వొప్పలేదట. ప్రాధేయపడినా వొప్పలేదట. దాంతో ఆయన కోపం వచ్చి ఆ రాత్రి నిద్రపోతున్న ఆమెను పొడిచి చంపేశాడట-దార్ణీ.

ఉద్యోగుల సమయస్ఫూర్తి

ప్రపంచ బ్యాంకు ప్రెసిడెంటు రాబర్టు మెక్‌నమీరా భారతదేశం వచ్చినపుడు కేంద్ర ఆర్థిక మంత్రి ఆయన గౌరవార్థం ఢిల్లీలోని అశోకా హోటలులో ఓ డిన్నరు పార్టీ యిచ్చారట. ఆ పార్టీ ప్రారంభానిక్కొన్ని నిముషాల ముందు ఆ హోటలు పనివారంతా సమ్మె చేశారట. అనుకోని యీ విపత్తును ఎలా ఎదుర్కోవాలా అని యోచించి, ప్రభుత్వ ఉద్యోగులే గమ్మున వడ్డనల్లోకిదిగి పని పూర్తి అయ్యిందనిపించేశారట ★

హైదరాబాద్ నోట్ బుక్

రెండు సంస్కృత కావ్యాలు :—

సురభారతీ సమితి యాజమాన్యాన సమితి భవనంలో రెండు సంస్కృత లఘు కావ్యాలు—కులదేవతా ప్రపత్తి, శ్రీనివాస శతకం—ఆవిష్కరణ నవంబరు 26వ తేదీన జరిగింది. శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి ఆవిష్కరించారు. కులదైవత ప్రపత్తి అనేది నక్షత్ర మాలిక. హిందీ మహా విద్యాలయం ఆంగ్ల శాఖాధ్యక్షుడు శ్రీ కె. ఆర్. సుబ్రహ్మణ్యం దీనిని రచించారు. శ్రీనివాస శతకం నూరు వసంత తిలకావృత్తాల కావ్యం. దీనిని సంస్కృత అకాడెమీ పరిశోధకులు శ్రీ వి. సుందరశర్మ రచించారు. రెండూ వేంకటేశ్వర వైభవ సంకీర్తనలని, మధురరమణీయంగా కవిత సాగిందని. శ్రీ సుందరశర్మ "హే శ్రీనివాస పరిపాలయమాం విభోత్వం" అనే మకుటంతో శతకం రచించి, సంస్కృత వాఙ్మయంలో నూతన శతక సంప్రదాయాన్ని ప్రవర్తింపజేశారని శ్రీ లక్ష్మణశాస్త్రి ప్రశంసించారు. శ్రీ కె. రాజన్న శాస్త్రి శ్రీ శ్రీనివాస శతకంలోని విశేషాలను వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత రీడరు, సమితి కార్యదర్శి డాక్టర్ పుల్లెల శ్రీరామచంద్రుడు కులదైవత ప్రపత్తిలోని విశేషాలు వివరించారు. రచయిత ప్రతి శ్లోకంలోను ద్రవిడ భాషలకు సహజమైన ద్వితీయాక్షర ప్రాసను, ద్వ్యక్షర, త్ర్యక్షర ప్రాసను పాటించారని ఆయన అన్నారు. సంస్కృతంలో మకుటంతో శతకాలు లేకపోయినా శ్రీ గుదిమెళ్ళ వరదాచార్యులు తెలుగు శతకాలను మకుటంతోనే సంస్కృతంలో అనువదించి ఒక విధంగా మకుట సహిత శతక రచనకు శ్రీకారం చుట్టారని డాక్టర్ రామచంద్రుడు అన్నారు. అకస్మాత్తుగా విచ్చేసిన శ్రీ గుదిమెళ్ళ వరదాచార్యులు—90 ఏళ్ళ వృద్ధులు—కవులిద్దరిని ఆశీర్వదించారు. కవులిద్దరూ కృతజ్ఞత తెలిపారు.

సంచార కళా ప్రదర్శనం :—

కేంద్ర లలితకళా అకాడెమీ ఆయా రాష్ట్రాలలో జరిపే కళా ప్రదర్శనాలకు పూరకంగా జరిపే సంచార కళా ప్రదర్శనలలో పదవది నవంబర్ చివరివారంలో కళా భవన్‌లో జరిగింది. దీనిలో 30 చిత్రాలు, 15 గ్రాఫికులు—డ్రాయింగులు, ఏడుశిల్పాలు ఉన్నవి. ఈ ప్రదర్శనకు మున్నుడిలో శ్రీ ఎస్.ఎ. కృష్ణన్ అన్నట్లు ఈ కళా ఖండాలను



తల్లీ పిల్ల —రామ్‌కింకర్

ఎన్నుకోడంతో "నేటి మన కళాకారుల కృషిలో పరిభావనా సాంకేతిక స్థాయిలు రెండింటి వేద్యములగు వివిధ వైఖరులకు, నడవడులకు తగిన ప్రాతినిధ్యం కల్పించడానికై సముచిత యత్నం జరిగింది."

ప్రాచీనకుడ్య చిత్రాన్ని పోలిన తుషారం (గౌతమ వాఘేలా), వంతెనపై వ్యాఘ్రం (భూపేన్ ఖకర్) వంటి ఊహా కల్పిత చిత్రాలు, స్మృతి (ముత్తుకోయ) వంటి అధివాస్తవిక చిత్రాలు, సంప్రదాయ రూపాలకు కొంగ్రొత్త వ్యాఖ్యానయినకంపోజిషన్-1 (అల్ఫాన్సో), రాజు (రేకుశిల్పం - పి.వి. జానకిరామ్), వంటివి, నరనారీప్రకరణాన్ని మూలసూచికా విషయంగా గ్రహించి రచించిన ఆన్ బైటిల్స్ (కె. లక్ష్మణ్ గౌడ్) వంటి గ్రాఫిక్ చిత్రాలు, తల్లిపిల్ల (రామ్ కి. కర్) వంటి అపూర్వ భావస్ఫోరక శిల్పాలు ప్రేక్షకులను ఆకర్షించాయి. ఈ కళాఖండాలన్నిటా సాంకేతిక ప్రజ్ఞ, ప్రతికృతిరచనా పాండితుల విస్తృత పరిధులు అవగతమవుతాయి.

కింగ్ కోఠీలో పెద్ద ఆస్పత్రి :—

నిజాం నవాబు ఆదాయంపన్ను కోట్లు చెల్లించాలి. చెల్లించలేదు. దానికి మారుగా నగర మధ్యంలో వున్న కింగ్ కోఠీ భవన సముదాయాన్ని ఆదాయం పన్ను శాఖవారు జప్తు చేశారు. రాష్ట్రప్రభుత్వం ఆ డబ్బు చెల్లించి, కొనింది. దానిలో అన్ని హంగులుగల పెద్ద ఆస్పత్రిని నెలకొల్ప దలచింది ప్రభుత్వం. ఈ సమాచారాన్ని ముఖ్యమంత్రి డాక్టర్ చెన్నారెడ్డి నవంబర్ 23న మలక్ పేట ప్రభుత్వ ఆస్పత్రిలో పిల్లల, ప్రసూతి వార్డులకు శంకుస్థాపన చేసిన సందర్భంలో ప్రకటించారు. ఈ శంకుస్థాపనోత్సవానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి శ్రీ ఎ. మదన్ మోహన్ అధ్యక్షత వహించారు.

ఉపశ్రుతి :—

"దండలు తీసివేయకండి-అని ప్రతి సభలోను గోలపెట్టేవారు మీరు. ఈ రోజు మీ ఆశ తీరింది కదూ!" అన్నారు మిత్రులు డాక్టర్ బి.వి.ఎల్. నారాయణరావు (కేంద్ర ఆంగ్ల : దే భాషాధ్యాయన సంస్థ ఆచార్యులు): సురభారతీ సమితిలో దండలు ధరించి చక్కగా కూర్చున్న ఉపన్యాసకులను చూపిస్తూ. "ఔను" అన్నారు ఆనందంతో "ఏదో, పాము వైన పట్టు పూల దండలు తీసివేస్తారు మనవారు; ఉత్తరభారతంలో అయితే సభ అయ్యేవరకు తీయరు. వారిలాగే నేనూ తీయను. మీరూ తీయకండి" అన్నారు శ్రీ గుడిమళ్ళ వరదాచార్యులు. సప్తతివర్షవృద్ధులు "మన నాయకుల సంస్కారం, నిరాడంబరత దండలు తీసిపారేయడంలోను పేర్ల చివరలు కత్తిరించడంలోను కనిపిస్తుందే కాని, తక్కిన వాటిలో లేదు" అన్నారు మరొక శ్రోత.

—తిరుమల రామచంద్ర

ఢిల్లీ ఆంధ్ర అసోసియేషన్ వారు యిటీవల ఒక నెలరోజులు మహాభారతం హరికథాకాలక్షేపాలు యేర్పాటు చేశారు. హరిదాసు శ్రీ పేరగంధం వేంకట సుబ్బారావుకథాగానం చేస్తున్న దృశ్యం.



Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna

ఉత్తరాలు

(6వ పేజీ తరువాయి)

జయసుధ

"పండంటికాపురము"లో పుట్టి, "గడుసు అమ్మాయి"గా పెరిగి, "సోగ్గాడు" అయిన "రాజా"ను ప్రేమించి, అతని "అర్ధాంగి" కావాలని, "నోము" నోచి, అతనికి "ప్రేమ లేఖలు" వ్రాసి, "విచిత్ర జీవితం"లోని విధి వ్రాతవల్ల, "మల్లెపూవు"ల పందిట్లో "లాయర్ విశ్వనాథ్"ను పెళ్ళాడి, సంఘ విద్రోహుల చర్యలవల్ల, తనభర్త "కటకటాల రుద్రయ్య"గా మారిపోగా దుఃఖిస్తూ, తన "జీవితనౌక" పయనానికి చింతిస్తూ, తమ దాంపత్య చిహ్నమైన "రామకృష్ణులు" కొరకు జీవిస్తూ, పెరిగి పెద్దయిన వాళ్ళు కన్నతల్లిని కూడా మర్చి మేము "దేవుడు చేసిన బొమ్మలు" అని నిరూపిస్తూ, ఆస్తిలో "భాగస్థులు"గా పోట్లాడుకొని, వేర్వేరుగా జీవిస్తువుంటే, "కలియుగ సీత" వలె బాధపడ్తూ, తనకు "శ్రీరామరక్ష" ఎవరంటూ, ఆరిపోయిన "జ్యోతి" లా తాను మిగిలింది సంగీతలోకము లోని "శివరంజని" రాగంవలె. ఇది "ఆమెకథ" ప్రముఖనటి, నా అభిమాన జయసుధగారి జన్మ దిన సందర్భంగా, అభినందలతో.

వి. అరుణ, [హనుమకొండ.]

శీర్షికలు

నటి శైలజ ముఖచిత్రంతో వచ్చిన ఈ వారం పత్రిక అంత అందంగా లేదని వ్రాయడానికి చాలా బాధపడ్తున్నాం. కాకపోతే లోనున్న శీర్షికలు బాగానేవున్నాయి.

కోట వెంకటరమణ, సి. కృష్ణకుమారి,
ఏ.కె. విజయకళ్యాణి, పి. రమణి
[బరంపురం]

రాగద్వేషాలు

"రాగద్వేషాలు" నవల చాల మలుపులు తిరిగి అనుకోనివిధంగా, చక్కగా సమాప్తమయింది. స్త్రీకి-ఎవరికైనా-వివాహం పరమధ్యేయం కాదని నా విశ్వాసం. పూర్వం ప్రజాముఖ్యం గనుక వివాహం ముఖ్యం: "దశాస్యాన్ పుత్రానాధేహి పతి మేకాదశం కృధి" అని ఆశీర్వదించడం తప్పనిసరి. ఇంత ప్రజామైగృహమేధినాం అనే కాలంలోను ఆండాళ్, అక్కామహాదేవి వంటి బ్రహ్మచారిణులున్నారు. దీనిని బట్టి వివాహం కన్నా, సామాన్య సంసార యాత్రకన్న ఉత్తమ ధ్యేయం పాటించేవారని కూడ స్పష్టం. శ్రీమతి ప్రసాద్ ఇందిరను దృఢచిత్తురాలిగా చిత్రించి స్త్రీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిపారు. కొందరయినా ఇలా ప్రవర్తించినప్పుడే, "నాతి చరామి" అని పెండ్లినాడు చేసిన ప్రమాణాలను మరచి అతిగా చరించే పురుషులకు బుద్ధి వస్తుంది. శ్రీమతి పుణ్యశీలా ప్రసాద్‌కు నా హృదయపూర్వక అభినందనలు.

తిరుమల రామచంద్ర [హైదరాబాద్]



'నామాల తాతయ్య'లో రంగనాథ్, జయ

Regd. No. H/VJ-41 ANDHRA SACHITRA VARA PATRIKA

